అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

మంగళవారం 14-05-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 84 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

నాల్గో విడత పోలింగ్ 62శాతానికి పైనే..

- ఆంధ్రా, బెంగాల్‌లో చెదురుమదురుగా హింసాత్మక ఘటనలు
- బెంగాల్, ఒడిశాల్లో కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయింపు
- పశ్చిమ బెంగాల్‌లో ఓటింగ్ అత్యధికం-జమ్మూ కాశ్మీర్‌లో అత్యల్పం...



10లో..

పోలింగ్ ప్రశాంతం

సాయంత్రం 5 గంటలవరకు 61.16 శాతం నమోదు

- తెలంగాణలో మరో మూడు నుంచి నాలుగు శాతం పెరిగే అవకాశం
- మంగళవారం మధ్యాహ్నం వరకు తుది గణాంకాలు
- ఎన్నికల సంఘం వెల్లడి
- పలుచోట్ల ఈవీఎంల మొరాయింపు
- భారీ భద్రత నడుమ స్ట్రాంగ్‌రూంలకు తరలింపు
- ఈవీఎంలలో నేతల భవితవ్యం
- జూన్4న తేలనున్న ఫలితాలు







నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ నాలుగో విడత ఎన్నికల్లో భాగంగా తెలంగాణలోని 17 నియోజకవర్గాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ పరిధిలో పోలింగ్ ప్రశాంతగా ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా సాయంత్రం 5 గంటల వరకు 61.16 శాతం పోలింగ్ నమోదైంది. మంగళవారం మధ్యాహ్నం వరకు పోలింగ్ శాతానికి సంబంధించి కచ్చితమైన సమాచారం తెలుస్తుందని ఎన్నికల సంఘం తెలిపింది. గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 66.4 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ సారి కూడా అదే స్థాయిలో పోలింగ్ నమోదయ్యే అవకాశముందని భావిస్తున్నారు. సోమవారం ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ 11 గంటల నుంచి ఊపందుకుంది. మొదటి రెండు గంటల్లో 9.8 శాతం పోలింగ్ నమోదు కాగా, ఆ తర్వాత వేగం పుంజుకుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 40.38 శాతం పోలింగ్ నమోదైంది. ఎండ తీవ్రత ఉన్నా మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడటంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటేసేందుకు జనం బారులు తీరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పోటెత్తగా ఎప్పటిలాగే హైదరాబాద్ వాసులు బద్దకించారు. మారుమూల సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన 13 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మధ్యాహ్నం 4 గంటలకే పోలింగ్ ముగిసింది. మిగతా 106 అసెంబ్లీ సెగ్మెంట్లలో సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ ముగిసే సమయానికి 1500కు పైగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు వరుసలో నిలబడి ఉన్నందున వారందరికీ ఓటు వేసేందుకు అవకాశం కల్పించనున్నట్టు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత పోలింగ్ ఆఫీసర్ల (పీవో) తనిఖీ అనంతరం ఈవీఎంలను భారీ భద్రత నడుమ స్ట్రాంగ్ రూంలకు తరలించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వాటికి మూడంచెల భద్రత కల్పిస్తారు. ఈ ఎన్నికల్లో చెదురుమదురు సంఘటనలు మినహా రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. కొంతమంది నేతలు పోలింగ్ కేంద్రాల్లో దురుసుగా ప్రవర్తించడం, ఓటింగ్ సరళిపై కామెంట్లు చేయడం మినహా ఎలాంటి గొడవలూ జరగలేదు. ...11లో

ఎవరి ధీమా వారిదే!

ఈవీఎమ్‌ల్లో ఓటర్ తీర్పు

- జూన్ 4న కౌంటింగ్
- అప్పటి వరకు సస్పెన్సే...
- బద్దకించిన 'గ్రేటర్' ఓటర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పోలింగ్ పూర్తయ్యింది. ఈవీఎమ్‌ల్లో ఓటరు తీర్పు నిక్షిప్తమైంది. కాకపోతే ఇప్పటికిప్పుడు ఫలితాలు వెల్లడయ్యే అవకాశం లేదు. దేశంలో మరో మూడు విడతల ఎన్నికలు ఉన్న నేపథ్యంలో జూన్ 4వ తేదీ వరకూ ఫలితాల కోసం వేచిచూడాల్సిందే. పోలింగ్ పూర్తికాగానే ప్రధాన రాజకీయపార్టీలు అధిక సీట్లు మావంటే...కాదు మావే అంటూ మీడియా ముందు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించాయి. ఓటరు నాడి ఇప్పటికే ఆయా పార్టీల నేతలకు తెలిసిపోయినా, వాస్తవాలను ఇప్పటికిప్పుడు ఒప్పుకోవాల్సిన అవసరం లేదనేది వారి ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తుంది. మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో 12 నుంచి 14 స్థానాలు గెలుస్తామని అన్ని రాజకీయపార్టీల అధినేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొన్ని మీడియా సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలను ఇప్పటికే ప్రధాన రాజకీయపార్టీల అధినేతలతో పంచుకున్నట్టు సమాచారం. తాజాగా దీన్ని ...11లో

బద్దకించిన కంటోన్మెంట్ ఓటర్లు

సాయంత్రం 5 గంటల వరకు 47.88 శాతం పోలింగ్

- మరికొంత పెరిగే అవకాశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికలో నగర ఓటర్లు బద్దకించారు. సాయంత్రం 5 గంటల వరకు 47.88 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. మరో రెండు నుంచి మూడు శాతం పోలింగ్ నమోదయ్యే అవకాశం ఉందని ఈసీ వర్గాలు వెల్లడించాయి. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు 6.28 శాతం పోలింగ్ నమోదు కాగా, 9 గంటల నుంచి 11 గంటల వరకు 16.34 శాతం నమోదైంది. ఎప్పటిలాగే తక్కువ పోలింగ్ శాతం నమోదైంది. ఈ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో ముఖాముఖి నెలకొన్న ఈ నియోజక వర్గంలో ఇండిపెండెంట్లతో కలిపి మొత్తం 15 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. లోక్‌సభతో పాటే జూన్ 4న కంటోన్మెంట్ అసెంబ్లీ ఫలితాలు వెల్లడి కానున్నాయి.

నివేదిక తర్వాతే రీపోలింగ్‌పై నిర్ణయం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలతో పాటు కంటోన్మెంట్ శాసన సభ నియోజక వర్గానికి జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారం వికాస్‌రాజ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారుల నుంచి వచ్చిన నివేదిక తర్వాత రీపోలింగ్‌పై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈవీఎంలను భారీ భద్రత నడుమ 44 స్ట్రాంగ్ రూంలకు తరలించామనీ, వాటిని మూడంచెల భద్రత నడుమ ఉంచుతామని ...11లో

రాష్ట్రానికి బీజేపీ ప్రమాదకరం

- కాంగ్రెస్ వందరోజుల పాలనకు ఎన్నికలు రెఫరెండం : కొడంగల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం



వివరాలు 3లో



ప్రాంతీయ పార్టీలదే కీలకపాత్ర

- చింతమడకలో ఓటేసిన మాజీ సీఎం కేసీఆర్

వివరాలు 3లో



ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ తెల్దారుపల్లిలో ఓటేసిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మునిపంపుల గ్రామంలో ఓటేశాక సిరా గుర్తు చూపుతున్న సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థి ఎండి. జహంగీర్



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మికశాఖ ఆవరణలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఆయన సతీమణి, కేంద్ర కమిటీ సభ్యురాలు ఎస్ పుణ్యవతి





సిరా గుర్తు చూపుతున్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ (ఎంఐఎం), సికింద్రాబాద్ ఎంపీ జీ. కిషన్‌రెడ్డి (బీజేపీ)

గురుద్వారాలో మోడీ


- పాట్నాలో లంగర్ సర్వ్ చేసిన ప్రధాని..
- ఓట్ల కోసమే రాజకీయం..ప్రతిపక్షాలు



పాట్నా: ప్రధాని మోడీ సోమవారం పాట్నాలోని తాకత్ శ్రీ హరిమందర్ జీ పట్నా సాహిబ్ గురుద్వారాను సందర్శించారు. ప్రధాని రాక సందర్భంగా అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 18వ శతాబ్దంలో మహారాజా ...11లో

మహాలక్ష్మి పథకం కింద రూ.లక్ష

- కాంగ్రెస్ గ్యారంటీలతో మహిళల జీవితాలు మారిపోతాయ్: సోనియా గాంధీ



న్యూఢిల్లీ: తమ మ్యానిఫెస్టోలో పేర్కొన్న గ్యారంటీలతో దేశంలో మహిళల స్థితిగతులు పూర్తిగా మారిపోతాయని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తెలిపారు. దేశంలో నెలకొన్న తీవ్ర సంక్షోభం ...11లో

దండకారణ్యంలో ఆగని ఎన్‌కౌంటర్లు

వివరాలు 11లో

అప్పుడే వెనక్కి...

ఓటేసిన వెంటనే హైదరాబాద్‌కు

- టోల్‌ప్లాజా వద్ద భారీ ట్రాఫిక్ జామ్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసేందుకు భారీగా తరలివెళ్లిన ఓటర్లంతా అప్పుడే హైదరాబాద్ కు తిరుగుముఖం పట్టారు. తెలంగాణ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన నగరంలోని ఓటర్లంతా సెలవులు ముగియడంతో మళ్లీ వెంటనే ప్రయాణం కట్టారు. గత గురువారం నుంచి ఏపీకి భారీఎత్తున ఓటు వేసేందుకు తమ తమ సొంత ప్రాంతాలకు వెళ్లిన సంగతి తెలిసిందే. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిక్కిరిసిపోయిన సంగతి తెలిసిందే. లక్షలాది మంది తరలివెళ్లి ఓటు ప్రాధాన్యతను తెలియజేశారు. వీరి సౌకర్యార్థం టీఎస్ఆర్టీసీ వేల సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేసింది. ప్రయివేటు ట్రావెల్స్‌లోనూ ప్రయాణం చేశారు. టీఎస్ఆర్టీసీ దాదాపు 700కుపైగా బస్సులను ఏర్పాటు చేయగా, హైదరాబాద్ నుంచి తెలంగాణ జిల్లాలకు 1500 బస్సులు నడిపింది. సోమవారం ఉదయం సైతం బస్సులు అందుబాటులో ...11లో

బుర్ఖాలు తొలగించి.. ముస్లిం ఓటర్ల ఐడీ తనిఖీ

హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతపై కేసు

- నిజామాబాద్‌లోనూ అరవింద్ దుందుడుకు చర్యలు
- మహిళా ఓటర్లపై బీజేపీ నేతల దురుసు



నవతెలంగాణ-సిటీబ్యూరో/ మలక్‌పేట్/నిజామాబాద్

పోలింగ్ సందర్భంగా మహిళా ఓటర్ల పట్ల బీజేపీ నాయకులు, కార్యకర్తలు దురుసుగా ప్రవర్తించారు. బీజేపీ హైదరాబాద్ అభ్యర్థి మాధవీలత సోమవారం ఓ పోలింగ్ బూత్‌లో పలువురు ముస్లిం మహిళల బురఖాలను తొలగించాలని కోరి వారి ఓటర్ ఐడీలను వెరిఫికేషన్ చేశారు. అందుకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో అది వివాదాస్పదమైంది. ఈ మేరకు ఆమెపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళ్తే.. హైదరాబాద్ పాతబస్తీలోని అజాంపూరలో పోలింగ్ బూత్ నెంబర్ 122కు వచ్చిన మాధవీలత అక్కడ కూర్చున్న ముస్లిం మహిళా ఓటర్ల బుర్ఖాలు తొలగించి వారి ఐడీలను పరిశీలించారు. ఈ ఘటన సోషల్‌మీడియాలో వైరలైంది. కాగా మాధవీలతపై ఏఐఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్.. మాధవీలతపై కేసు నమోదు చేయాలంటూ ...11లో



ఉదయం ఎండ..సాయంత్రం ఓటరు క్యూ

- 17 పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికలు
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 4 గంటలకే ముగింపు
- మొరాయించిన ఈవీఎంలు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- పలు చోట్ల బీజేపీ నేతల అత్యుత్సాహం
- మహిళల కోసం ప్రత్యేక కేంద్రాలు
- సెల్ఫీ తీసుకునేందుకు పోలింగ్ కేంద్రాల అలంకరణ



నవతెలంగాణ-విలేకరులు

రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ కూడా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు వరకు కొనసాగింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసింది. సాయంత్రం పూట ఓటర్లు బారులు తీరడంతో పోలింగ్ ముగిసే సమయానికి క్యూలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. ఉదయం 7 గంటల నుంచే జనం పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రాలేదు. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీజేపీ అభ్యర్థులు, శ్రేణులు ఘర్షణలు సృష్టించే ప్రయత్నాలు చేశారు. పలు గ్రామాల్లో తమ స్థానిక సమస్యలను పరిష్కరించడం లేదని గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. అధికారుల చర్చలతో ఓటింగ్‌లో పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో సాంకేతిక లోపాలతో ఈవీఎంలు మొరాయించగా, అధికారులు సరిచేయడంతో ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. అంతేకాదు, ఈ సారి పలు చోట్ల మహిళలకు ప్రత్యేక క్యూ లైన్లు, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. ఓటేసిన అనంతరం సెల్ఫీలు తీసుకోవడానికి వీలుగా పోలింగ్ కేంద్రాలను వైవిధ్యభరితంగా ముగ్గులు, పూలతో అలంకరించారు.

హైదరాబాద్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ ఎంపీ స్థానాలతో పాటు, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. షేక్‌పేట్‌లో ఓట్లు గల్లంతయ్యాయంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో పోలింగ్ ప్రక్రియ సాఫీగా సాగింది. ఓటు వేసేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. గంట గంటకూ పోలింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంలోని నాదర్‌గూల్‌లో మహిళా పోలింగ్ కేంద్రానికి ఏర్పాట్లు చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో గచ్చిబౌలిలోనూ మహిళలకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మెదక్, జహీరాబాద్ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ త్రిముఖ పోటీ జరగడంతో పోటీపడి ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించారు. ఒకటి రెండు చోట్ల చెదురుమదురు సంఘటనలు జరిగాయి. నారాయణఖేడ్‌లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య తోపులాట జరిగింది. సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. జనగామలోని ధర్మకంచలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధంతో ఉద్రిక్తత చోటు చేసుకోగా, పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది.

పోలింగ్ ప్రశాంతంగా జరగడం.. కొన్ని చోట్ల భారీగా పోలింగ్ శాతం నమోదు కావడంతో ప్రధాన పార్టీలు ఎవరికీ వారే అనుకూలంగా లెక్కలు వేసుకుంటున్నారు. అయితే, హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్లలో ఓటింగ్ శాతం తక్కువ రావడంతో పార్టీల నాయకులు ఢీలాపడ్డారు. ప్రచారంలో చెప్పుకున్న విధంగా గెలుస్తామనే ధీమాను వ్యక్తం చేయలేకపోతున్నారు. అయితే క్రాస్ ఓటింగ్ జరిగినట్టు ప్రారంభంలో ప్రచారం జరిగింది. క్రాస్ అయితే ఓట్లు ఎవరికి పడ్డాయనేది చర్చనీయాంశంగా మారింది.



100 శాతం ఓటింగ్‌తో ఆదర్శంగా సంగాయిపేట

మెదక్ జిల్లాలోని సంగాయిపేట తండాలోని ఓటర్లంతా ఓటేసి ఆదర్శంగా నిలిచారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని కొల్చారం మండలం సంగాయి పేట తండాలో మొత్తం 210 ఓట్లు ఉన్నాయి. అందులో 95మంది పురుషులు, 115 మంది మహిళలు ఉన్నారు. వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకొని 100శాతం పోలింగ్‌ను నమోదుచేశారు. దీంతో ఆ తండా ప్రజలను జిల్లా కలెక్టర్ అభినందించారు.

ఈవీఎంల మొరాయింపు..

యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని 32వ పోలింగ్ కేంద్రంలో 40 నిమిషాలు ఈవీఎంలు మొరాయించాయి. వెల్లంకి గ్రామంలో 9వ పోలింగ్ బూత్ ఈవీఎంలో సాంకేతిక లోపం తలెత్తడంతో గంటల తరబడి ఓటర్లు బారులు తీరారు. ఎన్నారం గ్రామంలో 54, 55 పోలింగ్ బూత్‌లలో అరగంట పాటు ఈవీఎంలు మొరాయించాయి. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని మంగల్‌తండా గ్రామంలో ఈవీఎం మొరాయించింది.

మహబూబ్‌నగర్ జిల్లాలోని మహ్మదాబాద్ మండల పరిధిలోని గాదిర్యాల్‌లో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం వరకు 110 బూత్‌లు 30 నిమిషాలు మొరాయించాయి. దీంతో పోలింగ్ కేంద్రాల దగ్గర ఓటర్లు బారులు తీరారు. వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ స్టేషన్ 228లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడు గంటల దాకా ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లకు ఇబ్బంది కలిగింది. పోలింగ్ స్టేషన్ ప్రిసైడింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు తక్షణమే టెక్నికల్ ఆఫీసర్‌తో చూయించగా ఈవీఎం బ్యాటరీ లోపం వల్ల ఆగిపోయిందని తెలిపారు.

దొంగిలించిన ఓటు

వికారాబాద్ జిల్లా బంట్వారం మండల కేంద్రానికి చెందిన దొరేటి సుధాకర్ ఓటు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బూత్ నంబర్ 253లో సీరియల్ నెంబర్ 198లో ఓటు ఉంది. అతను పోలింగ్ బూత్‌లోకి వెళ్లి చూస్తే తన ఓటు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నట్టు అధికారులు తెలిపారు. దాంతో ఆయన ఆందోళనకు దిగారు. తాను ప్రభుత్వ ఉద్యోగి కానప్పటికీ తన ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎలా వినియోగించుకున్నారో సమాధానం చెప్పాలని అధికారులను నిలదీశారు. ఎన్నికల అధికారులు కుమ్మక్కై తన ఓటును దొంగిలించారని ఆందోళన వ్యక్తం చేశారు. తనకు ఓటు వేసేందుకు అవకాశం ఇవ్వాలని, లేదంటే ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో వెంటనే అధికారులు స్పందించారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అక్కడి అధికారులతో మాట్లాడి ఆ వ్యక్తి ఓటు వేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అధికారుల ఓవరాక్షన్..

చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో శంకర్‌పల్లి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తన సిబ్బందితో మధ్యాహ్నం 3 గంటలకు పోలింగ్ కేంద్రానికి చేరుకొని హల్‌చల్ చేశారు. ఓటేసేందుకు వెళ్తున్న ఓటర్లను చెదరగొడుతూ లాఠీచార్జీ చేశారు. దాంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ప్రజలంతా భయాందోళనతో పరుగులు తీశారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. గ్రామస్తులు ధర్నాకు దిగారు. పోలీసులు గ్రామస్తులకు క్షమాపణ చెప్పడంతో వారంతా శాంతించారు.

కరీంనగర్‌లో బీజేపీ అత్యుత్సాహం

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ ఫొటోతో కూడిన పోల్ చిట్టీలను రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేటలో కొందరు ఓటర్లకు పంపిణీ చేశారు. కొందరు తెలియక అవే చిట్టీలను తీసుకుని ఓటేసేందుకు పోలింగ్‌బూత్‌కు వెళ్లడంతో అధికారులు అడ్డుకున్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల నడుమ స్వల్ప వివాదం చోటుచేసుకుంది. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం చింతకుంట గ్రామంలో బీజేపీ నేత నేతుల మల్లేశం పోలింగ్‌బూత్ వద్ద ప్రచారం చేస్తుండగా.. బీఆర్ఎస్ శ్రేణులు దాడి చేశారు. అతని కాలుపైకి టాటా ఏసీ వాహనం ఎక్కించడంతో మల్లేశంకు గాయాలు కాగా వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఇరుగ్రూపులు తోపులాట చేసుకోగా.. పోలీసులు చెదరగొట్టారు. జమ్మికుంట పక్క మండలం వీణవంకలోని చల్లూరు గ్రామంలో బీజేపీ నాయకులు ఆదిరెడ్డి, ఎల్బాక మాజీ సర్పంచ్ ఓదయ్యల డబ్బులు పంచుతుండగా పోలీసులు పట్టుకుని రూ.25 వేలు సీజ్ చేశారు.

సిరిసిల్లలో మద్యం సీజ్..

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్ ఇంట్లో ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.25వేల మద్యాన్ని సీజ్ చేశారు. కౌన్సిలర్‌పై కేసు నమోదు చేశారు. ఆయా పార్టీలకు సంబంధించిన నాయకులు, ప్రజాప్రతినిధుల ఇండ్లలో అధికారులు సోదాలు నిర్వహించారు.

సెల్ఫీ తీసుకున్న వ్యక్తిపై కేసు నమోదు..

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములపల్లి గ్రామంలో రెడ్డవేణి జయరాజ్ తన ఓటు హక్కు వినియోగించుకుంటున్న క్రమంలో ఫోన్‌లో సెల్ఫీ తీసుకున్నాడు. గమనించిన అధికారులు ఫోన్ లాక్కుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పుట్టెడు దు:ఖంలోనూ ఓటేసిన కుటుంబం

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో ఇంట్లో తల్లి చనిపోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న ఓ కుటుంబం అంత్యక్రియలు ముగించుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని రూ.8 లక్షలకు టోకరా

మోసపోయానని ఆవేదనతో యువకుడి ఆత్మహత్య



ఫైల్

నవతెలంగాణ-లింగంపేట్

ఉద్యోగం ఇప్పిస్తానని 8 లక్షలు తీసుకొని.. ఇంకా ఉద్యోగం రాకపోవడంతో మోసపోయానని ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి, స్థానికుల వివరాల ప్రకారం.. లింగంపేట్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి ప్రవీణ్ (28) 2019లో చిట్యాలకు చెందిన ఆరిఫ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. మెదక్ మున్సిపల్ కార్యాలయంలో గ్రూప్ 4 స్థాయి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నిజామాబాద్‌కు చెందిన రామకృష్ణారెడ్డి అలియాస్ ఆర్కే రెడ్డి వద్దకు కమ్మరి ప్రవీణ్‌ను తీసుకెళ్లారు. ఉద్యోగం తప్పకుండా ఇస్తామని నమ్మబలికి లక్ష రూపాయలు రామకృష్ణారెడ్డికి, రూ.6 లక్షలు ఆరిఫ్‌కి ఇచ్చేటట్టు ప్రవీణ్ కుమార్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ముందస్తుగా ఆరిఫ్ రూ.2 లక్షలు ప్రవీణ్ వద్ద తీసుకున్నాడు. మరో రూ.5 లక్షలు రామకృష్ణారెడ్డి తీసుకున్నాడు. డబ్బులు తీసుకుని నాలుగేండ్లు అవుతున్నప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో వారి చుట్టూ తిరిగి తిరిగి ప్రవీణ్ అలసిపోయాడు. సరైన సమాధానం చెప్పకుండా ఉద్యోగం ఇస్తామని ఆలస్యమవుతుందని నమ్మబలికారు. అయినప్పటికీ ఉద్యోగం ఇవ్వకపోవడంతో ప్రవీణ్.. ఆరిఫ్, రామకృష్ణారెడ్డిని గట్టిగా నిలదీశారు. దాంతో వారిద్దరూ మరో లక్ష రూపాయలు ఇస్తే ఆర్డర్ కాపీ, అపాయింట్‌మెంట్ లెటర్ ఇస్తామని చెప్పడంతో ప్రవీణ్ మరో లక్ష రూపాయలు తీసుకొచ్చి ఇవ్వగా మెదక్ మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగం వచ్చిందని నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్‌ను చేతిలో పెట్టారు. లెటర్ తీసుకొని సదరు బాధితుడు ఇటీవల మెదక్ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ఉద్యోగం విషయంలో ఎంక్వయిరీ చేయగా అక్కడ నకిలీ అని తేలింది. దీంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీనికి తోడు అప్పులిచ్చిన వారు డబ్బుల కోసం అడుతుండటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దాంతో ఆదివారం రాత్రి గ్రామ సమీపంలోని పోలేరమ్మ ఆలయ సమీపంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి సత్యనారాయణ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. తల్లీ కొడుకు ఇద్దరూ కూలి పని చేసుకుంటూ ఇంటి వద్ద ఉంటున్నారు. ప్రవీణ్‌కు గతేడాది వివాహం జరగగా.. విడాకులు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

నిజాయితీ లేని పాలకుల నుంచి దేశాన్ని కాపాడాలి : అఖిలేశ్ యాదవ్

లక్నో : నిజాయితీ లేని పాలకుల నుంచి దేశాని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలు ఓటేయాలని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అన్నారు. యూపీలోని కన్నౌజ్ బరిలో నిలిచిన అఖిలేష్ యాదవ్ నాలుగోదశ పోలింగ్‌లో భాగంగా సోమవారం ఓ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM VIII ADDL. METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT AT: KUKATPALLY
O.S.No.868 of 2023

Between:
Penumetcha Vijayalakshmi ...Plaintiff
AND
CH.Sandhya ...Defendant

To,
CH.Sandhya, W/o.CH Ramesh Babu, D/o.Vijaya Bhaskara Rao, Aged about: 45 yrs, Occ:Business Serilingampally Mandal, R.R.Dist., (Sole Defendant) R/o.Flat No.303, Sreetha Blooms, Raghavendra Colony, Kondapur,

Please take notice that on behalf of our client, we have filed a suit being O.S.868 of 2023 on the file of the Hon'ble Court seeking the relief of Recovery of money from you. The Hon'ble Court ordered notice to you by way of paper publication and adjourned the case **to 20-06-2024 at 10:30 a.m.** for your appearance and reply if any, either in person or through an Advocate duly authorized, failing which the case will be decided ex-parte.

(BY ORDER OF THE COURT)
Bhaskara Rao Pelluru, D.Rajabapu, Advocates
201, Sapthagiri Towers Begumpet, Hyderabad-500016 Mob :9704444753/9177443321

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM VIII ADDL. METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT AT :KUKATPALLY
O.S.No.866 of 2023

Between:
Penumetcha Vijayalakshmi ...Plaintiff
AND
Mr.B.V.Rama Murthy ...Defendant

To,
Mr.B.V.Rama Murthy S/o.Thiru mala Rao Aged about: 50yrs Occ: Business R/o.Flat No.102, Sri Sai Panduranga Residency Plot No.1 1B & 11C, Venkateswara Nagar Serilingampally, Hyd-500084, Telangana (Sole Defendant)

Please take notice that on behalf of our client, we have filed a suit being O.S.866 of 2023 on the file of the Hon'ble Court seeking the relief of Recovery of money from you. The Hon'ble Court ordered notice to you by way of paper publication and adjourned the case **to 20-06-2024 at 10:30 a.m.** for your appearance and reply if any, either in person or through an Advocate duly authorized, failing which the case will be decided ex parte.

(BY ORDER OF THE COURT)
Bhaskara Rao Pelluru, D.Rajabapu, Advocates
201, Sapthagiri Towers Begumpet, Hyderabad-500016 Mob:9704444753/9177443321

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM VIII ADDL. METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT AT :KUKATPALLY
O.S.No.867of 2023

Between:
Penumetcha Srinivasa Raju ...Plaintiff
AND
Mr.BV Rama Murthy ...Defendant

To,
Mr.B.V.Rama Murthy Aged about: 50 yrs, Occ: Business S/o.Thiru mala Rao R/o.Flat No.102, Sri Sai Panduranga Residency Plot No.1 1B & 11C, Venkateswara Nagar Serilingampally, Hyd-500084, Telangana (Sole Defendant)

Please take notice that on behalf of our client, we have filed a suit being O.S.867 of 2023 on the file of the Hon'ble Court seeking the relief of Recovery of money from you. The Hon'ble Court ordered notice to you by way of paper publication and adjourned the case **to 20-06-2024 at 10:30 a.m.** for your appearance and reply if any, either in person or through an Advocate duly authorized, failing which the case will be decided ex parte.

(BY ORDER OF THE COURT)
Bhaskara Rao Pelluru, D.Rajabapu, Advocates
201, Sapthagiri Towers Begumpet, Hyderabad-500016 Mob:9704444753/9177443321

ఫారం-జి
ఆసక్తి వ్యక్తీకరణ కొరకు ఆహ్వానం
కెఎస్‌కె వాటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కొరకు
(తేది.23.08.2021నాటి ఫారం-జి అనుసరించి చదవగలరు)
ఛత్తీస్‌ఘడ్ వద్ద ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండస్ట్రీలో ఆపరేటింగ్ సమాచారం నిమిత్తం మాత్రమే
(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ బోర్డుఆఫ్ ఇండియా (ఇన్సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 36ఎ(1)తో చదవగల రెగ్యులేషన్ 36బిలోని సబ్-రెగ్యులేషన్ (6) క్రింద)

సంబంధిత వివరాలు

1.	కార్పొరేట్ డెటార్ పేరు PAN మరియు CIN/ LLP నెం.తోసహా	కెఎస్‌కె వాటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ PAN : AADCK6247P CIN: U41000TG2009PTC062890
2.	రిజిస్టర్డు ఆఫీసు చిరునామా	8-1-293/82/ఎ/431/1, రోడ్ నెం.22, జూబ్లీహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500033
3.	వెబ్‌సైట్ యొక్క యూఆర్ఎల్	https://kskwater.co.in/
4.	స్థిర ఆస్తులు మెజారిటీ ఉన్న స్థలం వివరాలు	ఛత్తీస్‌ఘడ్
5.	ప్రధాన ఉత్పత్తులు/ సర్వీసుల ఇన్‌స్టాల్‌చేసిన సామర్థ్యం	(1) పంపింగ్ స్టేషన్లు-(1) ఆపరేషనల్, 2) ఇంకా కమీషన్ చేయబడలేదు. (2) ఛత్తీస్‌ఘడ్‌లోని నరియారా వద్ద జనంజీర్ నుంచి కెఎస్‌కె మహానది వాటర్ ప్లాంట్ వరకు 60 కిలోమీటర్ల పైప్‌లైన్ ప్రారంభం
6.	చివరి ఆర్థిక సంవత్సరంలో విక్రయించిన ప్రధాన ఉత్పత్తులు/ సర్వీసుల పరిమాణం& విలువ	రూ.204.02 కోట్లు
7.	ఉద్యోగులు/ కార్మికుల సంఖ్య	6
8.	రెండు సంవత్సరాల అందుబాటులోఉన్న ఆర్థిక నివేదికలు (షెడ్యూళ్లతో)సహా తదుపరి వివరాలు, రుణదాతల జాబితా యుఆర్ఎల్ వద్ద లభించును.	తదుపరి వివరాలను దిగువ ఇమెయిల్ ఐడీ పై అభ్యర్థన ద్వారా రిజొల్యూషన్ ప్రొఫెషనల్ నుండి పొందవచ్చును E-mail – ip.kskwipl@ibcprofessionalsolutions.com
9.	కోడ్‌లోని సెక్షన్ 25(2) (హెచ్) క్రింద రిజల్యూషన్ దరఖాస్తులకు అర్హత యుఆర్ఎల్ వద్ద లభించును	తేది.23.08.2021నాటి వివరణాత్మక ఆసక్తి వ్యక్తీకరణ కొరకు ఆహ్వానంతో అనుసరించి అర్హతగల రిజొల్యూషన్ దరఖాస్తుదారులు గుర్తించబడినారు. ఇక్కడ లభించును: – https://kskwater.co.in/
10.	ఆసక్తి వ్యక్తీకరణకు స్వీకరణకు చివరి తేది	07.09.2021. IA 522/2022, తేది:05.06.2023లో గౌరవ ఎన్‌సిఎల్‌టి వారి ఉత్తర్వు కాకుండా తదుపరి పొడగింపులు ఇవ్వబడలేదు. (క్ర.సం.11-14లో పర్యవసాన మార్పులు)
11.	నిర్ణీత రిజల్యూషన్ దరఖాస్తుదారుల ప్రొవిజనల్ జాబితా జారీ తేది	ప్రారంభ ప్రొవిజనల్ జాబితా: 13.09.2021 సవరించినది ప్రొవిజనల్ జాబితా: 31.07.2023
12.	ప్రొవిజనల్ లిస్ట్ అభ్యంతరాలను సమర్పించుటకు చివరి తేది	ప్రారంభంలో: 18.09.2021 సవరించినది: 05.08.2023
13.	నిర్ణీత రిజల్యూషన్ దరఖాస్తుదారుల తుది జాబితా జారీ తేది	ప్రారంభ తుది జాబితా: 28.09.2021 సవరించిన తుది జాబితా: 14.08.2023
14.	నిర్ణీత రిజల్యూషన్ దరఖాస్తుదారులకు రిజల్యూషన్ ప్లాన్ కొరకు ఇన్ఫర్మేషన్ మెమోరాండం, ఎవల్యూషన్ మ్యాట్రిక్స్ మరియు అభ్యర్థన జారీ తేది	ప్రారంభంలో: 18.09.2021 సవరించినది: 05.08.2023
15.	రిజల్యూషన్ ప్లాన్స్ సమర్పించుటకు చివరి తేది	28-05-2024 (ఇటీవల 13-05-2024 తేది నుండి పొడిగించబడినది) (అనుమతించదగిన పొడిగింపులకు లోబడి)
16.	ఇఓఐ సమర్పించుటకు ప్రాసెస్ ఇమెయిల్ ఐడి	ip.kskwipl@ibcprofessionalsolutions.com

కెఎస్‌కె వాటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున
సం/-
వి.వెంకటాచలం
రిజొల్యూషన్ ప్రొఫెషనల్
Reg No.: IBBI/IPA-002/IP-N00267/2017-18/10780
రిజిస్టర్డు చిరునామా: నెం.12-13-205, స్ట్రీట్ నెం.2, తార్నాక, సికింద్రాబాద్-500017.
తేది: 13-05-2024
ప్రదేశం: హైదరాబాద్

ఫారం-జి
ఆసక్తి వ్యక్తీకరణ కొరకు ఆహ్వానం
రాయ్‌గఢ్ చంపా రైల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కొరకు
(తేది.24.08.2021నాటి ఫారం-జి అనుసరించి చదవగలరు)
ఛత్తీస్‌ఘడ్ వద్ద ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండస్ట్రీలో ఆపరేటింగ్ సమాచారం నిమిత్తం మాత్రమే
(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ బోర్డుఆఫ్ ఇండియా (ఇన్సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 36ఎ(1)తో చదవగల రెగ్యులేషన్ 36బిలోని సబ్-రెగ్యులేషన్ (6) క్రింద)

సంబంధిత వివరాలు

1.	కార్పొరేట్ డెటార్ పేరు PAN మరియు CIN/ LLP నెం.తోసహా	రాయ్‌గఢ్ చంపా రైల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ PAN: AADCK6757C CIN: U60300TG2009PTC063665
2.	రిజిస్టర్డు ఆఫీసు చిరునామా	8-1-293/82/ఎ/431/1, రోడ్ నెం.22, జూబ్లీహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500033
3.	వెబ్‌సైట్ యొక్క యూఆర్ఎల్	https://rcrinfra.co.in/
4.	స్థిర ఆస్తులు మెజారిటీ వున్న స్థలం వివరాలు	ఛత్తీస్‌ఘడ్
5.	ప్రధాన ఉత్పత్తులు/ సర్వీసుల ఇన్‌స్టాల్‌చేసిన సామర్థ్యం	అకల్తారా రైల్వేస్టేషన్ నుంచి కెఎస్‌కె మహానది పవర్ ప్లాంట్ వరకు రైల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
6.	చివరి ఆర్థిక సంవత్సరంలో విక్రయించిన ప్రధాన ఉత్పత్తులు/ సర్వీసుల పరిమాణం& విలువ	రూ.101.41 కోట్లు
7.	ఉద్యోగులు/ కార్మికుల సంఖ్య	3
8.	రెండు సంవత్సరాల అందుబాటులోవున్న ఆర్థిక నివేదికలు(షెడ్యూళ్లతో)సహా తదుపరి వివరాలు, రుణదాతల జాబితా యుఆర్ఎల్ వద్ద లభించును.	తదుపరి వివరాలను దిగువ ఇమెయిల్ ఐడీ పై అభ్యర్థన ద్వారా రిజల్యూషన్ ప్రొఫెషనల్ నుండి పొందవచ్చును E-mail – ip.rcripl@ibcprofessionalsolutions.com
9.	కోడ్‌లోని సెక్షన్ 25(2) (హెచ్) క్రింద రిజల్యూషన్ దరఖాస్తులకు అర్హత యుఆర్ఎల్ వద్ద లభించును	తేది.24 ఆగస్టు, 2021నాటి వివరణాత్మక ఆసక్తి వ్యక్తీకరణ కొరకు ఆహ్వానంతో అనుసరించి అర్హతగల రిజల్యూషన్ దరఖాస్తుదారులు గుర్తించబడినారు. ఇక్కడ లభించును: https://rcrinfra.co.in/
10.	ఆసక్తి వ్యక్తీకరణకు స్వీకరణకు చివరి తేది	చివరి తేది: 08.09.2021. ఐఏ 523/2022, తేది: 05-06-2023లో గౌరవ ఎన్‌సిఎల్‌టి వారి ఉత్తర్వు కాకుండా తదుపరి పొడగింపులు ఇవ్వబడలేదు. (క్ర.సం.11-14 లో పర్యవసాన మార్పులు)
11.	నిర్ణీత రిజొల్యూషన్ దరఖాస్తుదారుల ప్రొవిజనల్ జాబితా జారీ తేది	ప్రారంభ ప్రొవిజనల్ జాబితా: 13.09.2021 సవరించినది ప్రొవిజనల్ జాబితా: 31.07.2023
12.	ప్రొవిజనల్ లిస్ట్ అభ్యంతరాలను సమర్పించుటకు చివరి తేది	ప్రారంభంలో: 18.09.2021 సవరించినది: 05.08.2023
13.	నిర్ణీత రిజొల్యూషన్ దరఖాస్తుదారుల తుది జాబితా జారీ తేది	ప్రారంభ తుది జాబితా: 28.09.2021 సవరించిన తుది జాబితా: 14.08.2023
14.	నిర్ణీత రిజొల్యూషన్ దరఖాస్తుదారులకు రిజొల్యూషన్ ప్లాన్ కొరకు ఇన్ఫర్మేషన్ మెమోరాండం, ఎవల్యూషన్ మ్యాట్రిక్స్ మరియు అభ్యర్థన జారీ తేది	ప్రారంభంలో: 18.09.2021 సవరించినది: 05.08.2023
15.	రిజొల్యూషన్ ప్లాన్స్ సమర్పించుటకు చివరి తేది	28-05-2024 (ఇటీవల 13-05-2024 తేది నుండి పొడిగించబడినది) (అనుమతించదగిన పొడిగింపులకు లోబడి)
16.	ఆసక్తి వ్యక్తీకరణ దాఖలుకు ప్రాసెస్ ఇమెయిల్ ఐడి	ip.rcripl@ibcprofessionalsolutions.com

రాయ్‌గఢ్ చంపా రైల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున
సం/-
వి.వెంకటాచలం
రిజల్యూషన్ ప్రొఫెషనల్
Reg No.: IBBI/IPA-002/IP-N00267/2017-18/10780
రిజిస్టర్డు చిరునామా: నెం.12-13-205, స్ట్రీట్ నెం.2, తార్నాక, సికింద్రాబాద్-500017.
తేది: 13-05-2024
ప్రదేశం: హైదరాబాద్

ఓటు వేయడానికి వెళుతూ..

రోడ్డు ప్రమాదం

ముగ్గురు మృతి..మరో ఇద్దరికి తీవ్ర గాయాలు..



ఫైల్

నవతెలంగాణ-జనగామ

ఓటు హక్కును వినియోగించుకునేందుకు వెళ్తూ రోడ్డు మీద టిఫిన్ చేస్తున్న వారిపైకి ఆర్టీసీ బస్సు వెళ్లడంతో ముగ్గురు మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథ్‌పల్లి మండల కేంద్రం సమీపంలో సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, తండ్రి, కుమారుడు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ బీబీనగర్‌లో రోజువారీ కూలీ చేసుకొని బతుకుతున్న వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన తెలకలపల్లి రవీంద్ర (35), తెలకలపల్లి జ్యోతి (32), తెలకలపల్లి భవిష్ (10) ద్విచక్ర వాహనం మీద వరంగల్‌కు వెళ్తూ రఘునాథ్ పల్లి సమీపంలో జాతీయ రహదారి ఆనుకొని ఉన్న మొబైల్ టిఫిన్ సెంటర్ వద్ద ఆగి టిఫిన్ చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుండి వరంగల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ గరుడ బస్సు రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి మొబైల్ టిఫిన్ వాహనం మీదకి దూసుకెళ్లింది. దాంతో టిఫిన్ చేస్తున్న కుటుంబంలో జ్యోతి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందారు. క్యాంటీన్ నిర్వాహకులు రఘునాథపల్లి మండలం సోమయ్యకుంట తండా చెందిన నునావత్ శ్రీకాంత్, నునావత్ సంతోష్ తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దూదిమెట్ల నరేష్ తెలిపారు.

ఆదర్శం...ఈ వికలాంగుడు

రెండు చేతులు లేకున్నా ఓటు హక్కు వినియోగించుకున్న జాకీర్‌పాషా



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అన్ని అవయవాలు సక్రమంగా ఉండీ కూడా ఓటు హక్కు వినియోగించుకోలేని వారు ఎందరో ఉన్నారు. 'నేను ఒక్కన్ని ఓటు వేయకుంటే ఏమవుతుందిలే' అనే భావనలో ఎందరో ఓటర్లుంటారు. కాని ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు ఉన్న విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలంటాడు కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన వికలాంగుడు జాకీర్‌పాషా. రెండు చేతులు లేని జాకీర్‌పాషా మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయం(బూత్ నెం.81)లో తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు. కాళ్లతోనే ఆయన తన ఓటును వేసి ఓటు హక్కు ప్రాముఖ్యతను చాటి చెప్పాడు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన షేక్‌బాబా-మెహ్రాజ్ బేగం దంపతుల కుమారుడు జాకీర్‌పాషాకు పుట్టుకతోనే రెండు చేతులు లేవు. అయినా ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా పీజీ వరకు చదివాడు. ఇప్పటికే ఆయన 2018, 2013 అసెంబ్లీ ఎన్నికలలో, 2019, 2024 లోక్‌సభ ఎన్నికలలో కాళ్లతో ఓటు వేసి పలువురి మన్ననలు అందుకున్నాడు. ప్రస్తుతం ఇతను కాగజ్‌నగర్ మండలం బోరిగాం పంచాయతీ పరిధిలోని చారిగాం రోడ్‌లో నివాసం ఉంటున్నాడు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల వికలాంగులు అందరికంటే ముందుగా వచ్చి ఓటు హక్కును వినియోగించున్నారు.

ఉత్సాహంగా ఓటేసిన వృద్ధులు..ట్రాన్స్‌జెండర్స్

ఓటు వేయడానికి కొంతమంది నిరాసక్తత చూపుతుంటారు. తాము వేయకుంటే ఏమవుతుంది..ప్రపంచం ఆగిపోతుందా..అంటూ కబుర్లతో కాలయాపన చేస్తుంటారు. ఎండ, చలి, వర్షం, దూరం, సమయం ఉంది కదా వేద్దాంలే అంటూ ఓటేయ్యకుండా కారణాలు చెబుతుంటారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేంది ఎన్నికలేనని, ఆ రోజు తప్పకుండా ఓటు వేయాలసిందేనని వృద్ధులు ఉత్సాహంగా ఓటేయడం గమనార్హం. వంద సంవత్సరాలు దాటినా లెక్కచేయకుండా ఓటుకు ప్రాధాన్యత ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 80 సంవత్సరాలు పైబడిన వారంతా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఖమ్మంలోని లక్ష్మి హైమవతి (110) సంవత్సరాలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళలు కూడా ఓటేసేందుకు క్యూలో నిల్చున్నారు. రాష్ట్రంలోని ట్రాన్స్‌జెండర్స్ తమ ఓటు హక్కును ఉపయోగించుకొని ఆదర్శంగా నిలిచారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో పలువురు ట్రాన్స్‌జెండర్స్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖమ్మంలో రాజేంద్రనగర్ జెడ్పి హైస్కూల్ లోని పోలింగ్ కేంద్రంలో ట్రాన్సజెండర్లు ఓటేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును విజ్ఞతతో ఆలోచించి వేయాలన్నారు. ఓటు వేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు.

జనన నమోదుకు ముందే

మరణ ధ్రువీకరణ పత్రాలు

గాజాలో ప్రతి 10 నిమిషాలకు ఒక బిడ్డ మృతి

రఫా: గాజాలో నేడు ఎటు చూసినా బాంబు దాడుల్లో చనిపోయిన తల్లుల సమాధులు, ఆ పక్కనే నవజాత శిశువుల సమాధులు వెలుస్తున్న హృదయవిదారక దృశ్యాలే. ఎవరిని కదిపినా కన్నీటి గాథలే. గాజాలో ఇజ్రాయిల్ ఇటీవల జరిపిన వైమానిక దాడిలో ఓ కుటుంబం యావత్తూ చనిపోయారు. మరణించిన తల్లి గర్భం నుండి నెలలు నిండకుండానే డెలివరీ అయిన పసికందు సబ్రీన్ ఉదంతం ఇజ్రాయిల్ అమానుషత్వానికి తిరుగులేని తార్కాణం. ఆ పసికందు తల్లి పాలకు నోచుకునే అవకాశం లేదు. బయటి పాలుపడదామంటే గాజాకు పాలు, నీరు, ఆహారం, మందుల సరఫరాను ఇజ్రాయిల్ పూర్తిగా అడ్డుకోవడంతో ఆ అవకాశమూ లేకపోయింది. దీంతో ఆ నవజాత శిశువు కొద్ది రోజులకే కన్నుమూసింది. ఆ శిశువు మృతదేహాన్ని తల్లి పక్కనే ఖననం చేశారు. గాజాలో మానవ హక్కులను ఇజ్రాయిల్ ఎంతగా కాలరాస్తున్నదో తెలుసుకోడానికి ఈ ఉదంతం ఒక మచ్చుతునక మాత్రమే. ఆసుపత్రులపై ఇజ్రాయిల్ హింసాత్మక దాడులకు తెగబడుతుండడం వల్ల ప్రసూతి వార్డులు పూర్తిగా నేలమట్టమయ్యాయి. దుర్భరమైన పరిస్థితుల్లో కాన్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల మాతా, శిశు మరణాలు అసాధారణమైన రీతిలో పెరిగిపోయాయి.. అక్టోబర్ 7 నుండి ఇప్పటివరకు గాజాలో దాదాపు 20 లక్షల మంది పాలస్తీనియన్లను ఇళ్ల నుండి ఇజ్రాయిల్ బలవంతంగా తరిమేసినట్టు ఐక్యరాజ్యసమితి నివేదికలే చెబుతున్నాయి. బాంబు దాడుల్లో దాదాపు 62 శాతం ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఒక చోట నుంచి మరో చోటికి పాలస్తీనీయులను జాత్యహంకార నెతన్యాహు ప్రభుత్వం తరిమేస్తుండడంతో ఎలాంటి వసతులు లేని తాత్కాలిక గుడారాల్లో జీవనం సాగిస్తున్నారు. ప్రతి పది నిమిషాలకు ఒక బిడ్డ చనిపోతున్నారు. కొంతమంది నవజాత శిశువులు వారి జననాలను నమోదు చేయకముందే మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసే దౌర్భాగ్యకర పరిస్థితి నేడు అక్కడ నెలకొంది.

బాలికలదే పైచేయి

సీబీఎస్ఇ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) 10, 12వ తరగతుల్లో బాలికలు పైచేయి సాధించారు. సోమవారం ఫలితాలు విడుదల చేసిన సిబిఎస్ఇ టాపర్ల జాబితాను విడుదల చేయలేదు. టాప్ 0.1 శాతం మంది విద్యార్థులకు మెరిట్ జాబితాను విడుదల చేయనున్నట్లు బోర్డు తెలిపింది. పదవ తరగతి పరీక్షల్లో 94.75 శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కంటే 0.48 శాతం ఎక్కువ ఫలితాలు వచ్చాయి. బాలుర కంటే బాలికలు 2.04 శాతం పాయింట్లతో పైచేయి సాధించారు. 12వ తరగతి బోర్డు పరీక్షల్లో 87.98 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల ఉత్తీర్ణత శాతం 91.52. కాగా బాలుర ఉత్తీర్ణత శాతం 85.12 శాతంగా ఉంది. బాలుర కంటే 6.40 శాతం అధికంగా బాలికలు ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది కంటే 0.65 శాతం పెరుగుదల నమోదైంది.

12వ తరగతిలో తిరువనంతపురం టాప్

12వ తరగతి పరీక్షల్లో తిరువనంతపురం 99.91 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో ఉంది. ఆ తరువాత స్థానాల్లో విజయవాడ (99.04), చెన్నై (98.47), బెంగళూరు (96.95) ఉన్నాయి. 77.94 శాతంతో గువహటి అత్యల్పంగా నిలిచింది. సిబిఎస్ఇ 10వ, 12వ ఫలితాలు రెండింటినీ అధికారిక వెబ్‌సైట్‌లు cbseresults.nic.in, results.cbse.nic.in, cbse.gov.in, cbse.nic.in వెబ్‌సైట్లలో చెక్ చేసుకోవచ్చని తెలిపింది. డిజిలాకర్ నుండి కూడా ఫలితాలను తనిఖీ చేయవచ్చు. ఈ ఏడాది సిబిఎస్ఇ పదవ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15, మార్చి 13 మధ్య, 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 2వ తేదీల మధ్య జరిగాయి. సుమారు 39 లక్షల మంది విద్యార్థులు బోర్డు పరీక్షలకు హాజరయ్యారు.

పార్లమెంటు ఎన్నికల్లో గొప్ప ఫలితాలు

- విశ్వాసం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్లు, ప్రజలకు ధన్యవాదాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికల్లో అద్భుతమైన పోరాటపటిమను ప్రదర్శించిన క్షేత్రస్థాయి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్లు, ప్రజలందరికీ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎదురుదెబ్బలు ఎన్ని కొట్టావు అన్నది కాకుండా ఎన్ని ఎదురుదెబ్బలు తిన్నా సవాళ్ల ఎదుర్కొని తిరిగి నిలబడి పోరాటం చేశామన్నదే ముఖ్యం అన్న నానుడిని నిజం చేసినందుకు ఆయన అభినందనలు ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన తర్వాత తిరిగి బలంగా నిలబడి కొట్లాడడం ఆషామాషి వ్యవహారం కాదనీ, పార్లమెంట్ ఎన్నికల్లో అద్భుతమైన నిబద్ధతతో పార్టీ అధ్యక్షులు కేసీఆర్ వెంట నడిచి, ఎన్నికల్లో ప్రజామోదం కోసం కొట్లాడిన తీరు అద్భుతమని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదు నెలలుగా సామాజిక మాధ్యమాల్లో పార్టీ కోసం పని చేసిన, ప్రతి ఒక్క సోషల్ మీడియా వారియర్‌కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తమ పార్టీ సోషల్ మీడియా వారియర్లకు, కార్యకర్తలకు ఇతర పార్టీల మాదిరి ఎలాంటి చెల్లింపులు చేయకుండా పార్టీ మీద, తెలంగాణ మీద ప్రేమతో పనిచేశారని కొనియాడారు. కేవలం తెలంగాణ మీద ఉన్న ప్రేమ కేసీఆర్‌పైన ఉన్న అచంచలమైన విశ్వాసంతో తమ పార్టీ కార్య కర్తలు ఈ ఎన్నికల్లో తమ వాణిని బలంగా విని పించి, అద్భుతంగా కొట్లాడారని పేర్కొన్నారు. తమ పార్టీ శ్రేణులు చేసిన ఈ పోరాటంతో పార్లమెంటు ఎన్నికల్లో గొప్ప ఫలితాలు వస్తాయంటూ ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతోపాటు తమ వెంట నిలిచిన రాష్ట్ర ప్రజలందరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.



ఓటు వేయనివారికి పెనుగోలు ఓటర్లే ఆదర్శం

అడవిలో 16 కి.మీ కాలినడకన వచ్చి ఓటేసిన గ్రామం

నవతెలంగాణ-ములుగు

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. అలాంటి ఓటు హక్కును వినియోగించుకోని వారు కొందరు న్నారు. వారికి ఆదర్శమే ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు గ్రామస్తులు. వారున్న గ్రామంలో పోలింగ్ బూత్ లేకపోవడంతో ఓటు హక్కును వినియోగించుకునేందుకు 16 కిలో మీటర్లు అటవీ గుండా కాలినడకన వాజేడులో ఉన్న పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటును వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి సరైన మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు సౌకర్యం లేక అనారోగ్యంతో వాజేడుకు వచ్చే క్రమంలో అడవి మార్గంలోనే చనిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయని వాపోయారు. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఇప్పుడైనా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి తమ బతుకులు మార్చాలని కోరారు.

పోలింగ్ బూత్ లేక గిరిజనుల అవస్థలు

- రోడ్డుపై బైటాయించి ధర్నా
- అధికారుల జోక్యంతో ఓటింగ్‌లో పాల్గొన్న ఓటర్లు

నవతెలంగాణ-కొత్తూరు

పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలంటూ గిరిజనులు మెరుపు ధర్నాకు దిగారు. గ్రామ పంచాయతీగా ఏర్పడినా పోలింగ్ బూత్ లేక ఎన్నికల సమయంలో తండావాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికలు జరిగిన ప్రతిసారీ తండాలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవిస్తున్నా ఫలితం లేకపోవడంతో సోమవారం గిరిజనులు రోడ్డుపై బైటాయించి తమ నిరసన తెలిపారు.

ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని కొడిచర్ల తాండ గ్రామ పంచాయతీ పరిధిలో జరిగింది. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ.. 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 500 జనాభా గలిగిన తండాలను, ఆమ్లెట్ గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. గ్రామపంచాయతీ పరిధిలోని కొడిచెర్లతండా, ఖాజాగూడ తండాలను కలిపి అప్పటి ప్రభుత్వం కొత్త గ్రామపంచాయతీని ఏర్పాటు చేసింది. ఐదేండ్లు పూర్తయినా ఆ తండాలో నేటికీ పోలింగ్ బూత్ లేక నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. గ్రామంలో కనీస అవసరాలను సైతం ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, రేషన్ తీసుకోవాలన్నా 4కి.మీ వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.



సమస్య పరిష్కరిస్తా : తహసీల్దార్ రవీందర్ రెడ్డి

పోలింగ్ కేంద్రం లేక ఎన్నికల సమయంలో అనేక అవస్థలు పడుతున్నామని కొడిచర్ల తండా గిరిజనులు రోడ్డుపై మెరుపు ధర్నాకు దిగడంతో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సీఐ నరసింహారావు ఘటనా స్థలానికి చేరుకొని గిరిజనులతో మాట్లాడారు. ఎన్నికల అనంతరం నెల రోజుల్లోగా రేషన్ దుకాణం ఏర్పాటుతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల లోపు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దాంతో గిరిజనులు శాంతించి ఓటింగ్‌లో పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అందుకే పోలింగ్ శాతం తక్కువ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లో నివసించే వారిలో ఎక్కువ మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు కావడం, అక్కడ ఓటు వేసేందుకు వారు తరలి వెళ్లడంతో ఇక్కడ పోలింగ్ శాతం తగ్గిందని కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో మార్పు మొదలైందనీ, మోడీ నాయకత్వాన్ని తెలంగాణ కోరుకుంటున్నదని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా ఈ దఫా ఎన్నికల్లో గ్రామాల్లో కూడా బీజేపీకి భారీగా ఓట్లు పడ్డాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా సీఎం రేవంత్ రెడ్డి మాటలు నమ్మలేదని విమర్శించారు. మెజార్టీ ఓటర్లు మోడీవైపే మొగ్గు చూపారన్నారు.

షేక్‌పేట్ డివిజన్ పరిధిలో దాదాపు 3 వేల ఓట్లను డిలీట్ చేశారనీ, ఒక వర్గానికి చెందిన ఓట్లను మాత్రమే డిలీట్ చేయడం దుర్మార్గమని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా



ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లు గల్లంతైన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజవర్గంలో కొంతమంది అధికారులు ఒక పథకం ప్రకారం ఒక వర్గం వారి ఓట్లను డిలీట్ చేశారని ఆరోపించారు. డిలీట్ అయిన వారందరూ అనేక సంవత్సరాలుగా ఇక్కడే ఓటింగ్‌లో పాల్గొంటున్నారనీ, ఇక్కడే సొంత ఇండ్లు ఉన్నాయని తెలిపారు. కొందరు ఉద్యోగస్తులు కూడా ఉన్నారని గుర్తుచేశారు. దీనిపై ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారికి, సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశామని, వారు దర్యాప్తు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. పట్టణ ఓటర్లను సంస్కరించాల్సిన అవసరముందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మరణించిన వారి పేర్లను జాబితా నుంచి మున్సిపల్ అధికారులు తొలగించడం లేదని ఆరోపించారు. తన కుటుంబంలోనే తన ఓటు, తన కుమారుని ఓట్లు వేర్వేరు పోలింగ్ బూత్‌లలో ఉన్నాయని చెప్పారు. ప్రధాని మోడీని విమర్శించే ముందు సీఎం రేవంత్‌రెడ్డి తన స్థాయి తెలుసుకుని మాట్లాడాలని కిషన్ రెడ్డి హితవు పలికారు. గ్యారంటీలు అమలు చేయకుండా మాట్లాడటం ఆయనకే చెల్లిందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఎంత రెచ్చగొట్టినా తమ కార్యకర్తలు ప్రశాంతంగా ఉన్నారని తెలిపారు. రాబోయే ఫలితాల్లో రాష్ట్రంలో బీజేపీ కొత్త శక్తిగా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చాలా చోట్ల బీఆర్ఎస్‌కు ఏజెంట్లు లేరనీ, ఉన్నచోట ఏజెన్సీకి చెందిన వారిని ఏజెంట్లుగా పెట్టుకున్నారని తెలిపారు. చాలా చోట్ల మజ్లిస్ కార్యకర్తలు కాంగ్రెస్ కోసం పని చేశారన్నారు.

ప్రాంతీయ పార్టీలదే కీలకపాత్ర

చింతమడకలో ఓటు హక్కు వినియోగించుకున్న కేసీఆర్

నవతెలంగాణ- సిద్దిపేట రూరల్



లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఆశించిన మేర మెజారిటీ రాదని ఈ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలే కీలక పాత్ర వహిస్తాయని మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆయన సోమవారం తన సొంత గ్రామమైన సిద్ధిపేట జిల్లా రూరల్ మండలంలోని చింతమడకలో కుటుంబ సభ్యులతో కలసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎర్రవల్లి నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 11:30 గంటలకు చింతమడకకు చేరుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 13వ బూత్‌లో ఓటు వేసి ప్రజలకు అభివాదం చేశారు. ఆయన వెంట మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు, మాజీ సుడా చైర్మెన్ రవీందర్ రెడ్డి, జెడ్పీటీసీ శ్రీహరి గౌడ్, ఎంపీపీ శ్రీదేవి రామచంద్రరావు, సర్పంచ్ హంసకేతన్ రెడ్డి, ఉప సర్పంచ్ మోత్కు రవి, నాయకులు తదితరులు ఉన్నారు.



జగన్ నాకు సోదరుడిలాంటోడు

- ఈ ఎన్నికల్లో ఆయనే గెలుస్తారు
- పోలింగ్ స్టేషన్ల వద్ద జనరేటర్లు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు సోదరుడి లాంటోడనీ, ఈ ఎన్నికల్లో ఆయనే గెలుస్తాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ నందినగర్‌లోని జీహెచ్ఎంసీ హాల్‌లో ఓటేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో అనేక సవాళ్లతో కూడుకున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని గుర్తు చేశారు. పోయిన లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన సీట్ల కన్నా ఎక్కువ సాధిస్తామనే నమ్మకముందన్నారు. పోటీ చేసిన ప్రతిపార్టీ తామే గెలుస్తామంటుంది, కానీ.. ఆ గెలుపును ప్రజలు నిర్ణయిస్తారని చెప్పారు. పోలింగ్ స్టేషన్ల దగ్గర కరెంటు కోతలు లేకుండా జనరేటర్లు పెట్టి ముగ్గురేసి చొప్పున అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం కష్టపడుతోందని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీల్లో ప్రభుత్వం ఒక్క గ్యారెంటీనే సగం సగం అమలు చేసిందని దెప్పిపొడిచారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తాను సీఎంనని గుర్తించాలని హితవు పలికారు. ప్రభుత్వ పనితీరుపై ఆయన దృష్టి పెట్టాలని సూచించారు. కరెంటు కోతలు, నీటి కొరతల వంటి అసలైన సమస్యలపైన దృష్టి సారించాలన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి ప్రజా సమస్యల పైన ప్రభుత్వం పని చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మోడీ శ్రీరామచంద్ర ప్రభువుకు చెప్పినట్టు రాజా ధర్మాన్ని పాటించాలన్నారు.నిధులు, ప్రాజెక్టుల కేటాయింపుల్లో ఆయన రాష్ట్రాలకు మధ్య వివక్ష చూపారని విమర్శించారు. ప్రజలు మార్పును కోరుకుంటున్నారని తెలిపారు. ఇన్వర్టర్లు, జనరేటర్లు, క్యాండిల్స్, పవర్ బ్యాంకులు, చార్జింగ్ లైట్లు, ఇవే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలని ఎద్దేవా చేశారు.

రాష్ట్రానికి బీజేపీ ప్రమాదకరం

- కాంగ్రెస్ వందరోజుల పరిపాలన పార్లమెంట్ ఎన్నికలకు రెఫరెండం
- తెలంగాణకు పెట్టుబడులు తగ్గించేందుకు బీజేపీ కుట్ర
- రాష్ట్రంలో మరో పదేండ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కొడంగల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం



నవతెలంగాణ-కొడంగల్

తెలంగాణకు బీజేపీ అత్యంత ప్రమాదకరమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ వందరోజుల పాలనకు ఈ పార్లమెంటు ఎన్నికలు రెఫరెండమని చెప్పారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో కుటుంబ సమేతం గా సీఎం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఐదు గ్యారంటీలు అమలు చేశామని, మిగతా గ్యారంటీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాబోయే పదేండ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు సంక్షేమ రాష్ట్రంగా నడిపించే బాధ్యత తమదేనన్నారు. బీజేపీ శాంతి భద్రతలను దెబ్బతీసి రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసి, ఇక్కడికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు తరలించాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి మత ప్రాతిపదికన విడదీయడంతో అక్కడ ఎవరూ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం లేదన్నారు. అలాంటి పరిస్థితే తెలంగాణాలోనూ సృష్టించేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. బీజేపీకి పడే ప్రతి ఓటూ తెలంగాణ రాష్ట్రం సర్వనాశనం కావడానికి దారితీస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో 39.5 శాతం ఓట్లు వచ్చాయని, పార్లమెంట్ ఎన్నికల్లో అంతకుమించి వస్తాయని భరోసా వ్యక్తం చేశారు. దేశంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. బీజేపీ 336 సీట్లలో మాత్రమే పోటీ చేస్తుందని 400 సీట్లు ఏ విధంగా వస్తాయని ప్రశ్నించారు. దేశంలో మతపరమైన రిజర్వేషన్లు లేవని, సామాజికంగా వెనుకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ఏపీలో ఎన్డీఏ కూటమి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. దేశ ప్రజలకు మోడీ మాయమాటలు చెబుతున్నారన్నారు. ఇండియా కూటమి పేరుతో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడుగుతుంటే బీజేపీ మాత్రం నరేంద్ర మోడీ పేరుతో ఓట్లు అడుగుతుందని తెలిపారు. మోడీ రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడినా, నవనీత్‌కౌర్ 15 సెకండ్ల కామెంట్స్‌పైనా ఎలక్షన్ కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. రాష్ట్రంలో రైతు భరోసా ఎలా ఇచ్చామో పంద్రాగస్టులోగా రైతు రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టంచేశారు. కేసీఆర్‌పై తనకు సానుభూతి ఉందని, మానసిక ఒత్తిడి, నిరాశ, భావోద్వేగంతో ఆయన ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి వంశీ చందర్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్ముఖ్, శ్రీరాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నందారం ప్రశాంత్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, టీపీసీసీ ప్రతినిధి ఎండీ యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.



ఓటు ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు

రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి సి.పార్థ సారథి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజాస్వామ్యానికి ఓటు ఆయువుపట్టులాంటిదని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి సి పార్థసారథి అన్నారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఆయన తన కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ .. ఐదేండ్ల మన భవిష్యత్తును నిర్ణయించేది ఓటు మాత్రమేనని గుర్తు చేశారు. ప్రస్తుతం యువతకు వివిధ కారణాలవల్ల ఓటు పట్ల ఆసక్తి తగ్గుతోందని చెప్పారు. "నేను ఒక్కణ్ని ఓటు వెయ్యకపోతే ఏమవుతుంది... ఏం కాదులే" అని చాలా మంది భావిస్తున్నారన్నారు. నీటి చుక్కలన్నీ కలిస్తేనే సముద్రం అవుతుంది కదా.. అలాగే అందరూ ఓటు వేసినప్పుడే అది నిజమైన ప్రజాస్వామ్యం అవుతుందని గుర్తు చేశారు. ఎన్నికల రోజు అంటే ఎంజాయ్ చేయడానికి ఇచ్చే సెలవు కాదనీ, విలువైన ఓటు వేయడానికి వచ్చిన ఒక సువర్ణావకాశమని తెలిపారు.

కుప్పకూలి...గుండెపోటుతో.. ఓటేయ్యడానికి వచ్చి ఇద్దరు..

పోలింగ్ విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగి మృతి

నవతెలంగాణ - అశ్వారావుపేట/ఉప్పల్

పోలింగ్ రోజు సోమవారం పలుచోట్ల విషాద సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఓటేయ్యడానికి వచ్చి కుప్పకూలి గుండెపోటుతో ఇద్దరు ఓటర్లు మృతిచెందారు. ఒక ఉద్యోగి విధులు నిర్వర్తిస్తూ చనిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ కార్యాలయంలో మృతుడు పోలూరు శ్రీకృష్ణ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఎన్నికల విధుల్లో బాగంగా అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని అశ్వారావుపేట మండలం, పేరాయిగూడెం పంచాయతీ, నెహ్రూ నగర్ పోలింగ్ బూత్ 165లో పోలింగ్ ఆఫీసర్‌గా వచ్చాడు. సోమవారం విధులు నిర్వహిస్తూ ఉదయం 10.30 గంటలకు అకస్మాత్తుగా కుప్పకూలి పడిపోయాడు. స్పందించిన సిబ్బంది హుటాహుటిన సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆస్పత్రికి చేరే లోపే అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేదు. మాయోకార్డియో ఇస్కీమియా కారణంతో మృతి చెంది ఉంటారని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. భద్రాద్రి జెడ్పీ చైర్మెన్ కే.చంద్రశేఖర్ సంతాపం తెలిపారు.

నడుస్తూనే...

అశ్వారావుపేట మండలం వేదాంత పురం పంచాయతీకి చెందిన కాశీ నాగేశ్వర రావు (55) వాగొడ్డుగూడెంలోని 173 పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి ఇంటి నుండి బయలు దేరాడు. అదే గ్రామాల్లోని ఓ దేవాలయం దగ్గరకు రాగానే ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. గమనించిన మాజీ సర్పంచ్ సోనీ శివశంకర్ ప్రసాద్ హుటాహుటిన ఆటోలో అశ్వారావుపేట ఒక ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చూసి మార్గం మధ్యలోనే మృతి చెంది ఉంటాడని తెలియజేయడంతో భౌతిక కాయాన్ని అదే ఆటోలో ఆయన ఇంటికి తరలించారు.

పోలింగ్ కేంద్రంలో గుండె పోటుతో వృద్ధురాలు మృతి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో ఓటు వేయడానికి వచ్చిన ఓ వృద్ధురాలు పోలింగ్ కేంద్రంలోనే గుండెపోటుతో మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ ఓల్డ్ భరత్‌నగర్‌కు చెందిన గట్టు విజయలక్ష్మి (65) సోమవారం ఓటు వేసేందుకు కాలనీలోని మసీదు వద్ద ఉన్న బూతు నెంబర్ 349 వద్దకు వచ్చింది. అక్కడ ఆమె ఓటు వేసి బయటకు వస్తుండగా ఎండవేడిమికి తట్టుకోలేక అకస్మాత్తుగా గుండెపోటు కుప్పకూలి స్పృహ కోల్పోయింది. దాంతో విజయలక్ష్మిని హుటాహుటిన స్థానికులు, పోలీసులు స్థానిక టీఎక్స్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఆమె మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ విషయమై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





అయితే పోలింగ్ కేంద్రం వద్ద ఆమె తనకు దాహం వేస్తుందని పోలీస్, ఎన్నికల సిబ్బందికి చెప్పినా వారు తాగునీరు అందించలేదని, అందుకే ఎండ వేడిమికి తాళ లేక మృతి చెందిందని బాధిత బంధువులు, స్థాని కులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండా రి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్ రెడ్డి సంఘటన స్థలానికి రావాలని డిమాండ్ చేశారు. మహిళ మృతికి పోలీస్, ఎన్నికల అధికారులు బాధ్యత వహించాలని, బాధితురాలు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

నవతెలంగాణ

శ్రమను గౌరవించని జాతికి, శ్రమించడానికి ఇచ్చగించని జాతికి భవిష్యత్తు లేదు, పురోగమించదు - డా. అంబేద్కర్

మంగళవారం 14 మే 2024
www.navatelangana.com

నాయకులు బహుపరాక్!

సంపాదకీయం

'పురుషులందు పుణ్య పురుషులు వేరని వేమన చెప్పినదానికి లింగబేధాల్లేవు. వేమన అర్థంలో పురుషులంటే మనుషులేనని శాస్త్రకారులు ఎప్పుడో ఖరారు చేసేశారు. కాని ప్రస్తుత సందర్భం వేరు. పాలక పార్టీల నాయకులుగా ఉన్న పురుష పుంగవులు ప్రస్తుత ఎన్నికల్లో తమ తమ పార్టీలను సంక్షోభం నుండి బయట పడేసేందుకు చేస్తున్న విన్యాసాలు చూస్తే వేమన చెప్పిన పుణ్య పురుషులు వీరు కారని మాత్రం ఘంటాపథంగా చెప్పచ్చు.

మొదటి మూడు దశల్లోనే బీజేపీ అడుగు జారినట్టు స్పష్టమైన సంకేతాలొచ్చాయి. నిన్నటి నాలుగో దశతో 378 పూర్తయ్యాయి. దాదాపు బీజేపీ ఆశలు ఆవిరయ్యాయి.ఏ పార్టీ అయినా తమ కేడర్‌లో ఊపు నింపడానికి కొన్ని ప్రత్యేక డైలాగులు కొట్టడం కద్దు. దాన్ని తప్పుపట్టలేం. కాని అడ్డదారులు తొక్కి మరీ మాట్లాడుతున్న విషయాలు ఇరవై ఒకటో శతాబ్దపు జోకులుగా పేలుతున్నాయి. జనం నవ్వుకుంటున్నారు. గెలిచిన 303 మందిలో 110 మందిని ఈసారి మార్చాల్సిన దౌర్భాగ్యం బీజేపీది. సరిగా పనిచేయలేదని కాదు సుమా! ఈడిలు, సీబీఐల ద్వారా వెంటాడి, వేటాడి తమ వాషింగ్ మెషిన్లో శుభ్రం చేసుకున్న 105 మంది ఇతర పార్టీల జంప్‌జిలానీలకు టికెట్లివ్వడం కోసం. ఇదేంటని బీజేపీలోనే కుంపటి రగుల్తోంది. గుజరాత్, యూపీల్లో పోలింగ్ 57-58 శాతం మధ్య అఘోరించడమే మోడీ భవిష్యత్తును సీల్ చేసేసింది. తాజాగా పది సీట్లున్న హర్యానా సంక్షోభం అదనం. మొన్న మన రాష్ట్రానికొచ్చిన అమిత్‌షా ఈసారి దక్షిణాదిన తుడిచి పెట్టేస్తామని ఊదర గొట్టడం చూసి జనం పక్కున నవ్వుకున్నారు. హత్రాస్ ఘటన వంటివి, రగులుతున్న రైతు ఉద్యమం, కేజ్రీవాల్ అరెస్టు, ఉత్తర భారత దేశంలోనే కాదు, చివరికి ఉత్తరప్రదేశ్‌లో సైతం బీజేపీకి నూకలు చెల్లేట్టున్నాయి. ఇక దక్షిణాదిన స్వీప్ చేయడమేంటని బీజేపీ కార్యకర్తలే ముక్కున వేలేసుకుంటున్నారు.

> ఏ ప్రాంతీయ పార్టీల గురించి కేసీఆర్ చెప్పేది? చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల గురించా? బీజేపీతో రహస్యంగా బాదరాయణ సంబంధం నెరుపుతున్న జగన్మోహన్ రెడ్డితో కేసీఆర్ ఉంటాడా? ఊసరవెల్లిగా రుజువైన నితీష్‌తోనా? ఆప్, డీఎంకేలు, సమాజ్‌వాద్ పార్టీ, ఆర్జేడీలు 'ఇండియా' కూటమిలో నుండి బయటికి దూకి కేసీఆర్ చంకనెక్కుతారనుకుంటున్నారా?

ఈ ఫ్రస్టేషన్ అంతా బీజేపీ నేతల ఉపన్యాసాల్లో కనపడుతోంది. పచ్చిహిందూ మతోన్మాదుల్లా మాట్లాడుతున్నారు. ఇరవైకోట్ల ఉద్యోగాల గిన్నె బోర్లించేశారు, రైతుల ఆదాయం రెట్టింపు హామీ మట్టిలో కలిసిపోయింది. ప్రభుత్వ రంగాన్ని చంపేస్తానన్న వాగ్దానం మాత్రం



విజయవంతంగా అమలైపోయింది. దాంతో పాటు ప్రభుత్వ విద్య, వైద్య రంగాలు కూడా నాశనమై సామాన్యులు అప్పుల పాలౌతున్నారు. లేదా వారి పొదుపు తగ్గిపోయింది. ఇదే తాజా (2022-23) హౌస్‌హోల్డ్ కన్‌జంప్షన్ ఎక్స్‌పెండిచర్ సర్వే బహిర్గతం చేసింది. ఇలాంటి ఆర్థికాంశాల వైతరణిని దాటడానికే రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ట జరిపింది మోడీ సర్కార్. అయినా ఓట్ల వర్షం కురిసేలా లేదు. పాపం! ఏం చేస్తారు? తెలుగు రాష్ట్రాల్లో కాషాయ జెండాకు ఎదురు లేదని మోడీ, అమిత్‌షాలు పల్లవిలంకించుకున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ బుట్ట ఖాళీ అవుతూనే ఉంది. కొందరు బీజేపీలోకి, మరెందరో కాంగ్రెస్‌లోకి సర్దుకుంటున్నారు. పదవుల ఆశచూపి పోగేసిన జనం ఆపదవే లేకుండా పోయిన తర్వాత ఎందుకుంటారు? అధికారంలో ఉన్నప్పుడు ఫెడరల్ ఫ్రంట్ అన్నారు. ఆ తర్వాత ఏ ప్రత్యామ్నాయ విధానాలూ లేకుం డానే' తృతీయ ప్రత్యామ్నాయం' అన్నారు. తెలంగాణ అస్థిత్వం మీద ఆధారపడ్డ పార్టీని ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి చేశారు. దాని కోసం రెండు, మూడు రాష్ట్రాల్లో ఉమ్మాయ్, జక్కాయ్ లాంటి ఊడగొట్టిన నాగటి దుంపల్ని పోగేశారు. బీఆర్ఎస్ అధినేతను దగ్గరగా చూసినవారు ఇదంతా క్యాడర్‌ను నిలబెట్టుకోవడానికే గాక తనను తాను శక్తివంతునిగా చూపడానికేనంటారు. ఆయన పార్టీ ఆయనిష్టం అని కొందరు వాదించచ్చు. దాన్ని కాసేపు ఒప్పు కుందాం.

మొదటి మూడు దశల పోలింగు అయిపోగానే బీజేపీ హవాలేదని అర్థమై, రానున్నది ప్రాంతీయ పార్టీల కూటమి ప్రభుత్వమేననీ, "దేవుడు మేలుచేస్తే" తానూ ప్రధాని రేసులో ఉన్నానని ఉద్ఘాటించి నవ్వుల పాలైనాడు కేసీఆర్. ఎందుకు నగుబాటుకు గురైనాడో ఆయనకు అర్థం కాకున్నా నాలుగు కోట్ల తెలంగాణ వాసులకు తెలియాలి. 37 ప్రాంతీయ, జాతీయ పార్టీలు కాంగ్రెస్‌తో కలిసి 'ఇండియా' కూటమిలో ఉన్నాయి. మరో 40 దాకా ఎన్డీయేలో భాగస్వాములై బీజేపీతో కలిసున్నాయి. ఏ ప్రాంతీయ పార్టీల గురించి కేసీఆర్ చెప్పేది? చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల గురించా? బీజేపీతో రహస్యంగా బాదరాయణ సంబంధం నెరుపు తున్న జగన్మోహన్ రెడ్డితో కేసీఆర్ ఉంటాడా? ఊసరవెల్లిగా రుజువైన నితీష్‌తోనా? ఆప్, డీఎంకేలు, సమాజ్‌వాద్ పార్టీ, ఆర్జేడీలు 'ఇండియా' కూటమిలో నుండి బయటికి దూకి కేసీఆర్ చంకనెక్కుతారనుకుంటున్నారా? అసలు ఇప్పటికీ ఫలానా పార్టీని వ్యతిరేకించాలనే చిత్తశుద్ధి కేసీఆర్‌కుందా?

తాను ప్రధాని అవడం సంగతి ఎలా ఉన్నా.. కనీసం బీఆర్ఎస్‌ను ఒక పార్టీగానైనా మిగల్చాలంటే 'అడ్ హాకిజం' కాకుండా నికరంగా బీజేపీ వ్యతిరేక కూటమిలో నిలబడితే అయింత పరువైనా మిగులుతుంది. మన రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కేరళకుపోయి విజయన్‌పై అవాకులు చెవాకులు పేలినా రాష్ట్ర సీపీఐ(ఎం) మాత్రం తాము పోటీ చేసే భువనగిరి తప్ప మిగిలిన పదహారింటా కాంగ్రెస్‌నే బలపరుస్తామనడం లక్ష్యం నుండి తమ కన్ను తిప్పకపోవడానికి సంకేతం.

ఉదారవాదపు సంక్షోభం



ప్రభాత్ పట్నాయక్

ప్రతీ రాజకీయ కార్యాచరణ ప్రక్రియా ఏదో ఒక ఒక రాజకీయ తాత్విక సిద్ధాంతం చూపే వెలుగులో కొనసాగుతూ వుంటుంది. ప్రత్యేకించి ప్రస్తుత ఆధునిక కాలంలో ప్రతీ రాజకీయ తాత్విక సిద్ధాంతమూ ప్రపంచంలో వ్యక్తమౌతున్న ఆర్థిక ధోరణులను విశ్లేషిస్తుంది. ఆ విశ్లేషణ ఆధారంగా ఆ తాత్విక సిద్ధాంతం కొన్ని లక్ష్యాలను నిర్దేశిస్తుంది. ఆ లక్ష్యాలను సాధించడానికి పోరాడవలసి వుంటుంది. ఆ పోరాటాన్ని సంబంధిత రాజకీయ కార్యాచరణ ప్రక్రియ ద్వారా నిర్వహిస్తారు. అలా నిర్దేశించిన లక్ష్యాలు సాధించడం కష్టతరం కావచ్చు. కొన్ని పరిస్థితుల్లో చాలా కష్టం కూడా కావచ్చు. ఆ కష్టాలు ఆ రాజకీయ కార్యాచరణ ప్రక్రియకు ఆటంకంగా ఉంటాయి. కాని ఆ ఆటంకాలను బట్టి ఆ రాజకీయ తాత్విక సిద్ధాంతం సంక్షోభంలో పడింది అన్న నిర్ధారణకు రాలేము. ఒకానొక లక్ష్యాన్ని సాధించడంలో ఉండే కష్టాలను బట్టి ఆ సిద్ధాంతం సంక్షోభంలో ఉందని చెప్పలేం. ఆ రాజకీయ తాత్విక సిద్ధాంతంలోనే పరిష్కరించలేని అంతర్గత వైరుధ్యం తలెత్తినప్పుడు, ఆ వైరుధ్యాన్ని పరిష్క రించడం కోసం ఆ సిద్ధాంతం ప్రతిపాదించే మార్గం అదే సిద్ధాంతంలోని మరో అంశానికి భిన్నంగా ఉన్నప్పుడు మాత్రమే ఆ రాజకీయ తాత్విక సిద్ధాంతం సంక్షోభంలో ఉందని అంటాం.

మార్క్సిజం ముందుకు తెచ్చిన రాజకీయ తాత్విక సిద్ధాంతం నిర్దేశించిన సోషలిజం లక్ష్యాన్ని సాధించడం ప్రస్తుత పరిస్థితులలో మరింత కష్టతరంగా మారింది. వామపక్ష శక్తుల బలహీనపడ్డాయి. కాని ఈ ఆటంకాలను బట్టి మార్క్సిజం ఒక సిద్ధాంతంగా సంక్షోభంలో చిక్కుకుంది అని నిర్ధారించడానికి లేదు. కాని ఉదారవాదం అనే రాజకీయ సిద్ధాంతం మాత్రం ఒక సంక్షోభాన్ని ఎదు ర్కొంటోంది. ఉదారవాదం మానవ స్వేచ్ఛ అనే లక్ష్యాన్ని నిర్దేశించి దానిని సాధించడానికి మార్గాన్ని ప్రతిపాదించింది. కాని ఆ మానవ స్వేచ్ఛను ఉదారవాదం తనకు ప్రాణప్రదం అయిన ప్రస్తుత వ్యవస్థ కొనసాగుతుండగా సాధించడం అసాధ్యంగా పరిణమించింది. ఈ ఆర్థిక వ్యవస్థ పరిణామం చెందే క్రమంలోనే తలెత్తిన ఈ వైరుధ్యానికి ఉదారవాదం దగ్గర సమాధానం ఏదీ లేదు. ఇదే ఉదారవాద సిద్ధాంతం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సిద్ధాంత సంక్షోభపు సారం.

రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఆ కాలంలో బోల్షివిక్ విప్లవం విజయవంతమైంది. దీనికి ప్రతిస్పందనగా ఆధునిక ఉదారవాదం ఒక సిద్ధాంతంగా ముందుకొచ్చింది. ఆ కాలంలో తలెత్తిన సంక్షోభాలకు గాని, భవిష్యత్తులో తలెత్తబోయే సంక్షోభాలకు గాని, ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిని దాటకుండానే ఏవిధంగా పరిష్కరించవ చ్చునో మార్గం చూపిన సిద్ధాంతంగా ఈ ఆధునిక ఉదారవాదం ముందుకొచ్చింది. పాశ్చాత్య దేశాలలో ఉనికిలో ఉన్న ఉదార ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీ విధానం-ఈ రెండింటికీ తోడు రాజ్యం జోక్యం చేసుకుంటే అప్పుడు అది మానవ స్వేచ్ఛను సాధించగల అత్యుత్తమ చట్రమౌతుంది అని అది విశ్వసించింది. పాశ్చాత్య దేశాలలో అమలౌతున్న ఉదార ప్రజాస్వామ్యంలోని వ్యవస్థలలో రాజ్యం అనేది ఒక 'వర్గ' రాజ్యంగా ఉండదని, అది ఒక సామాజిక హేతుబద్ధతను వ్యక్తం చేసే రూపంగా ఉంటుందని, మరే ఇతర సామాజిక వ్యవస్థలలో కన్నా ఇందులోనే ఆ హేతుబద్ధత బాగా వ్యక్తం ఔతుందని ఉదారవాదం భావించింది. అందుచేత అటువంటి ఉదారవాద ప్రజాస్వామ్య రాజ్య వ్యవస్థ దేశ ఆర్థిక వ్యవస్థలో జోక్యం చేసుకోగలుగుతుందని, ఆ విధమైన జోక్యం ద్వారా పెట్టుబడి దారీ వ్యవస్థలో అప్రయత్నంగా దొర్లే లోపాలను అది సరిచేయగలుగుతుందని భావించింది. అంతేకాక, అటువంటి లోపాలు ఏవీ ఒకవేళ తలెత్తకపోయినా, సామాజిక హేతుబద్ధత కోరుకునే విధంగా అందుకు కట్టుబడి వ్యవహరించేలా పెట్టుబడిదారీ వ్యవస్థను కట్టడి చేయగలుగుతుందని భావించింది. ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవాడు జాన్ మేనార్డ్ కీన్స్. ఈ ఆంగ్లేయ ఆర్థికవేత్త ఈ సిద్ధాంతానికి నయా ఉదారవాదం అని నామకరణం చేశాడు. అంతకుముందు కాలంలో ఉదారవాదం అనే సిద్ధాంతం ఉనికిలో ఉంది. ఆ పాత ఉదారవాదానికి ఈ కొత్త ఉదారవాదం భిన్నంగా ఉంటుంది. పాత ఉదారవాద సిద్ధాంతాలన్నీ ఆర్థిక వ్యవస్థలో రాజ్యం వీలైనంత పరిమితంగానే జోక్యం కల్పించుకోవాలని చెప్పాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎప్పుడూ "దాదాపు పూర్తిస్థాయి"లో ఉపాధి కల్పన కల్పిస్తూ ఉంటుందన్న పొరపాటు అభిప్రాయంతో ఆ పాత సిద్ధాంతాలు ఉండేవి.

ఉదారవాదపు ప్రస్తుత కొత్త రూపం ఎంతవరకూ సహేతుకమైనది అని గాని, ఈ వాదం పెట్టుబడిదారీ వ్యవస్థ చట్రం లోపల చెల్లుతుందా లేదా అన్నది కాని నేనిప్పుడు చర్చించబోవడం లేదు (నిజానికి ఈ నయా ఉదారవాదం ఇప్పుడు ఎంత మాత్రమూ చెల్లదు. ఎందుకంటే ఈ నయా ఉదారవాదం సామ్రాజ్యవాదం అనే ఒక పెట్టుబడిదారీ దశను ఏ మాత్రమూ పరిగణనలోకి తీసు కోలేదు, దానిని గుర్తించలేదు, ఊహించనూ లేదు.). కాని ద్రవ్య పెట్టుబడితో సహా పెట్టుబడి యావత్తూ ప్రపంచీకరించబడ్డాక ఈ సిద్ధాంతం ఏ మాత్రమూ చెల్లదు. నయా ఉదారవాదం ప్రకారం దేశ ఆర్థిక వ్యవస్థలో రాజ్యం జోక్యం చేసుకోవాలి. ఈ రాజ్యం ఎప్పుడూ జాతి రాజ్యంగానే ఉంటుంది. ఏ దేశానికి ఆదేశం ఒక రాజ్య వ్యవస్థను కలిగి వుంటుంది.

ఒకసారి ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరించబడిన తర్వాత ఈ పెట్టుబడి చెప్పినట్టు దానికి లోబడి ఆయా జాతి రాజ్యాలు వ్యవహ రించాలే తప్ప ఆ రాజ్యాల నియంత్రణకు ఈ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి లోబడి నడుచుకోదు. ఒకవేళ ఏ రాజ్యం అయినా నియంత్రించడానికి పూనుకుంటే, ద్రవ్య పెట్టుబడి అక్కడి నుంచి పలాయనం చిత్తగిస్తుంది. అందుచేత రాజ్యం ఇంకెంత మాత్రమూ సామాజిక హేతుబద్ధతకు ప్రతిరూపంగా వ్యవహరించలేదు.

నయా ఉదారవాదం ప్రతిపాదించబడినప్పుడు ఆయా దేశాల పరిధుల్లోనే అక్కడి పెట్టుబడి కార్యకలాపాలు ప్రధానంగా కొనసాగేవి. కీన్స్ తన సిద్ధాంతాన్ని గురించి చర్చిస్తున్న కాలంలో ఈ విషయాన్నే ప్రత్యేకించి చెప్పేవాడు. కాని పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా సంచరించడం పెరిగాక ఈ ప్రాతిపదిక ఇంకెంత మాత్రమూ పనికిరాకుండా పోయింది. ఇప్పుడు ఒకవేళ దేశంలో ప్రజలందరూ కోరుతున్నారు గనుక సామాజిక హేతుబద్ధత



> ఉదారవాద సిద్ధాంతపు ప్రస్తుత సంక్షోభపు మూలాలు ప్రపంచీకరణ అనే ప్రక్రియలో ఉన్నాయి. అయితే నయా ఉదారవాద సంక్షోభం ఫలితంగా భారీ స్థాయిలో నిరుద్యోగం తలెత్తినప్పుడే ఈ సిద్ధాంతమూ సంక్షోభంలో చిక్కుకుందన్న సంగతి స్పష్టంగా బయటపడింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆయువుపట్టు అంతా ఈ నిరుద్యోగ సమస్య దగ్గరే ఉంటుందని కీన్స్ కూడా భావించాడు. రాజ్యం జోక్యం చేసుకుని దానిని గనుక పరిష్కరించకపోతే బోల్షివిక్ విప్లవం తరహాలో మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థలో విప్లవాలు సంభవిస్తాయని హెచ్చరించాడు.

ప్రాతిపదికన మన దేశం వరకూ ఈ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిని నియంత్రిద్దాం అని ప్రభుత్వం భావించినా, అందుకు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒప్పుకోదు.

అందుచేత ఉదారవాద సిద్ధాంతపు ప్రస్తుత సంక్షోభపు మూలాలు ప్రపంచీకరణ అనే ప్రక్రియలో ఉన్నాయి. అయితే నయా ఉదారవాద సంక్షోభం ఫలితంగా భారీ స్థాయిలో నిరుద్యోగం తలెత్తినప్పుడే ఈ సిద్ధాంతమూ సంక్షోభంలో చిక్కుకుందన్న సంగతి స్పష్టంగా బయటపడింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆయువుపట్టు అంతా ఈ నిరుద్యోగ సమస్య దగ్గరే ఉంటుందని కీన్స్ కూడా భావించాడు. రాజ్యం జోక్యం చేసుకుని దానిని గనుక పరిష్కరించకపోతే బోల్షివిక్ విప్లవం తరహాలో మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థలో విప్లవాలు సంభవిస్తాయని హెచ్చరించాడు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు మించి జరిగే అధికోత్పత్తి ఫలితంగా ఏర్పడే సంక్షోభానికి పరిష్కారంగా డిమాండ్‌ను పెంచాలని కీన్స్ సూచించాడు. డిమాండ్‌ను పెంచే విధంగా రాజ్యం జోక్యం ఉండాలని ప్రతిపాదించాడు. అందుకోసం రాజ్యం తన ఖర్చును పెంచాలని, ఆ ఖర్చుల కోసం అవసరమైన ఆదాయాన్ని పన్నులను పెంచడం ద్వారా రాబట్టాలని చెప్పాడు. సంపన్నుల మీద అదనంగా పన్నులను వేయడం సాధ్యం కాకపోతే ప్రభుత్వం లోటు బడ్జెట్ ద్వారా ఖర్చు పెంచాలని చెప్పాడు. శ్రామిక ప్రజల మీద అదనంగా పన్నులను విధిస్తే వారు మామూలుగా సరుకులను కొనుగోలు చేయడానికి వినియోగించే సొమ్ము నుంచే ఆ పన్నులు చెల్లించవలసి వస్తుంది. అప్పుడు మార్కెట్‌లో డిమాండ్ తగ్గుతుంది. అందుచేత శ్రామిక ప్రజల మీద అదనపు పన్నులను విధించడం వలన డిమాండ్ పెరగదు. సంక్షోభమూ నివారించబడదు.

అయితే రాజ్యం డిమాండ్‌ను పెంచడం కోసం చేయవలసిన అదనపు ఖర్చుకు సరిపడా ఆర్థిక వనరులను సమీకరించడానికి కీన్స్ ప్రతిపాదించిన రెండు మార్గాలూ ఇప్పుడు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి అంగీకారం కావు. అది సంపన్నుల మీద అదనపు పన్నులను విధించడానికీ ఒప్పుకోదు, బడ్జెట్‌లో ద్రవ్య లోటు పెంచడానికీ ఒప్పుకోదు. అంటే సంక్షోభ నివారణకు రాజ్యం ఏ విధంగానూ జోక్యం చేసుకోరాదన్నదే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి భావిస్తుంది. అందుచేత కీన్స్ ప్రతిపాదించిన నయా ఉదారవాదం పెట్టుబడి ప్రపంచీకరణ జరిగిన ప్రస్తుత కాలంలో పనికి రాకుండా పోయింది. నయా ఉదారవాద విధానాలు కొనసాగడానికి ముందు దారిలేకుండా మూసుకుపోయింది. ఇది నయా ఉదారవాద రాజకీయ, తాత్విక సిద్ధాంతానికి పట్టిన సంక్షోభం.

ఈ ఆర్థిక సంక్షోభం ఏవిధంగా పరిణమిస్తోందో యూరప్‌ను పరిశీలిస్తే బాగా బోధపడుతుంది. 1970 దశకం మధ్య కాలం వరకూ (అంటే సుమారు 1975 వరకూ) యూరోపియన్ యూనియన్ దేశాలలో నిరుద్యోగం 3 శాతంగా చాలా కాలంపాటు కొనసాగింది. 1970 దశకం చివరినుండీ, 1980 దశకం అంతా ఈ నిరుద్యోగం క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఈ కాలంలోనే అక్కడ ప్రపంచీకరణ క్రమం అమలు మొదలైంది. అలా పెరిగి 7 శాతానికి నిరుద్యోగం చేరింది. (ప్రస్తుతం ఇది 15 శాతంగా ఉంది) అక్కడి ప్రభుత్వాలు జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించినా, నిరుద్యోగం తగ్గలేదు.

ప్రపంచీకరణ అమలులో ఉన్నాక, ఏ ఒక్క ప్రభుత్వమో విడిగా తన దేశంలో నిరుద్యోగాన్ని తగ్గించడానికి జోక్యం చేసుకునేందుకు పూనుకుంటే అది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో తల పడవలసి వస్తుంది. అప్పుడు ఆ ద్రవ్య పెట్టుబడి సదరు దేశాన్ని విడిచిపెట్టి బయటకు పోతుంది. దానివలన ఆ దేశ ఆర్థిక వ్యవస్థ చిక్కుల్లో పడుతుంది. ఇలా జరగకుండా ఉండడానికి అన్ని దేశాలూ ఒక దగ్గరకు వచ్చి ఒకే విధమైన విధానాన్ని అమలు చేస్తే అప్పుడు ద్రవ్య పెట్టుబడి బయటకు పోయే అవకాశాలకు చెక్ పెట్టవచ్చు. అన్ని దేశాలూ తమ ఆర్థిక వ్యవస్థల్లో జోక్యం పెంచుకుని నిరుద్యోగాన్ని తగ్గించేందుకు పూనుకోవచ్చు.

ఈ విధంగా చేయాలంటే కాస్త ముందో, వెనుకో, ఆ దేశాలు తమ వాణిజ్యం మీద కూడా నియంత్రణ చర్యలు చేపట్టాలి. కొన్ని ఆంక్షలు విధించాలి. ఈ విధంగా చేయడమంటే అది పెట్టుబడి తన ఇష్టం వచ్చినట్టు సంచరించగల పరిస్థితి లేకుండా చేయడమే అవుతుంది. దీనిని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి మొత్తంగా వ్యతిరేకిస్తుంది. అయినా లెక్క చేయకుండా ప్రభుత్వాలు ముందుకు సాగాలంటే, ఆ ప్రభుత్వాలు అంతర్జాతీయ గుత్త పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా తక్కిన వర్గాలను కూడగట్టి ప్రత్యామ్నాయాన్ని రూపొందించాల్సి ఉంటుంది.

ఆ విధంగా ప్రపంచ దేశాల నడుమ ఒక నిజమైన సమన్వయం ఏర్పడి ఆయా ప్రభుత్వాలు తమ తమ ఆర్థిక వ్యవస్థల్లో బలంగా జోక్యం కల్పించుకోవాలంటే ఒకవిధమైన అంతర్జాతీయత అవసరం. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో ఒక స్వత:సిద్ధమైన లక్షణం ఉంది. ముందుగా అభివృద్ధి చెందిన దేశాలు తమకన్నా వెనుకబడిన దేశాల మీద ఆధిపత్యాన్ని చెలాయిస్తాయి. ఈ మాదిరి ఆధిపత్యం కొనసాగు తున్నంత కాలమూ పెట్టుబడిదారీ విధానంలో అంతర్జాతీయ సమన్వయం, సహకారం నిజమైన అర్థంలో సాధ్యం కాదు.

మహా అయితే, సంపన్న పెట్టుబడిదారీ దేశాల వరకూ తమలో తాము ఒకమేరకు సహకరించుకుంటూ, రెండోపక్క వెనుకబడిన దేశాల ఆర్థిక వ్యవస్థలలో తాము నిర్దేశిం చిన ద్రవ్య నియంత్రణ చర్యలు కొనసాగేట్టు చేయ గలుగుతాయి. అంటే సామ్రాజ్య వాదం మూడో ప్రపంచ దేశాల మీద తన పట్టును మరింత బిగిస్తుంది. మరి ఆవిధంగా కొన్ని దేశాల మీద సామ్రాజ్యవాదపు పట్టు బిగించడం అంటే ఉదారవాదం ప్రబోధించే మానవ స్వేచ్ఛకు విఘాతం కాదా? అంటే ఉదారవాదం ప్రబోధించే మానవ స్వేచ్ఛకు, పెట్టుబడిదారీ విధానం కొనసాగడానికి నడుమ పొంతన లేకుండా పోవడమే కదా?

ఇలా ఎటూ తేల్చుకోలేకుండా ఉన్న పరిస్థితి ఉదారవాద సిద్ధాంత సంక్షోభపు సారాంశం. నిరుద్యోగం విపరీతంగా పెరుగుతూ వున్నప్పుడు, దాని ఫలితంగా శ్రామికుల వేతనాలు కూడా తగ్గి పోతూ వున్నప్పుడు, ఇదంతా కలిసి శ్రమజీవుల జీవితాలను అంతకంతకూ దుర్భరం చేస్తూన్నప్పుడు మానవ స్వేచ్ఛ వర్ధిల్లుతోందని ఉదారవాదం చెప్పుకోలేదు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే నయా ఉదారవాద చట్రం పరిధి నుండి బైటపడి ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థను రూపొందించాలి. అంటే ఈ పెట్టుబడిదారీ వ్యవస్థను దాటి సమాజాన్ని ఒక కొత్త దశ వైపు నడిపించే ప్రత్యామ్నాయ శక్తుల కలయిక జరగాలి (అలా కాకుండా మళ్ళీ నయా ఉదారవాద దశకు ముందు ఉన్న దశవైపు వెనక్కి పోవాలనే వాదన కూడా ఉంది. కాని అలా వెనక్కిపోవడం అంటే మళ్ళీ స్వేచ్ఛాయుత పోటీ నెలకొన్న పెట్టుబడిదారీ దశకు పోవాలని అర్థం. మరి ఆ పోటీ లోంచే కదా గుత్త పెట్టుబడిదారీ దశ వచ్చింది? అక్కడి నుండే కదా ప్రస్తుత సమస్యలన్నీ వచ్చాయి? అందుచేత అది పరిష్కారం కాజాలదు. పోనీ, వెనుకబడ్డ దేశాలను మినహాయించి సంపన్న దేశాల వరకూ సహకరించుకుంటూ నిరుద్యోగాన్ని అదుపు చేయాలనుకుంటే, అది ఉదారవాద ఆదర్శాలకే భిన్నం కదా?

గతంలో మహా మాంద్యం నెలకొన్నప్పుడు సాంప్రదాయ ఉదారవాదం దిక్కుతోచని స్థితిలో నిస్సహాయంగా ఉండిపోయింది. మళ్లీ ప్రస్తుతం నెలకొన్న మహా మాంద్యంలో నయా ఉదారవాదం అదే మాదిరిగా నిస్సహాయంగా ఉంది. మరి వేరే ఇతర ఉదారవాదమూ పరిష్కారం చూపడానికి ముందడుగు వేయడం లేదు. అది సాధ్యం కూడా కాదు. ఈ పెట్టుబడిదారీ చట్రాన్ని యథాతథంగా కొనసాగిస్తూ ప్రస్తుత సంక్షోభానికి పరిష్కారం చూపగలిగే మందు ఎక్కడా లేదు.

(స్వేచ్ఛానుసరణ)

మెయిల్ @ నవతెలంగాణ

'ఇండియా' గెలవాలి

తెలంగాణ అమరవీరుల త్యాగానికి, బలిదానాలకు చలించి సోనియమ్మ నాడు తెలంగాణ ప్రత్యేకరాష్ట్రం ఇచ్చిన విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఆమె అఖిలపక్ష పార్టీలను ఒప్పించి, తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని వివరించింది కనుకే రాష్ట్రం కల సాకారమైంది. ఇంకెన్ని ప్రాణాలు పోయినా, ఇంకెంత కాలం పోరాటం చేసినా తెలంగాణ వచ్చేది కాదు.అయితే తెలంగాణ వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీకి జరిగిన నష్టం పూడ్చలేనిది. ఆమెను కలిసి మనోధైర్యాన్ని నింపేందుకు తెలంగాణ ఇచ్చిన సోనియమ్మను ఉద్యమకారుల ఫోరం తరపున పోర్ట్రైట్ పై "సేవియర్ ఆఫ్ తెలంగాణ సోల్స్" అని నా దస్తూరితో రాసి ఆమెను కలిసి బహుమానంగా అందజేశాను. దీనికి బదులుగా తమనుంచి గానీ, పార్టీ నుంచి ఏదైనా కావాలా? అని ఆమె అడిగారు. 'వస్తుందో, రాదో అనుకున్న తెలంగాణను ఇచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పడానికే వచ్చాను, సమయం వచ్చిన ప్పుడు నేను, తెలంగాణ ప్రజలుగా మీ రుణం తీర్చుకోవడమే ఇంకా బాకీ ఉన్నది' అని చెప్పాను. అప్పుడు ఆమెకు నేనిచ్చిన మాటలు ఈ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గుర్తుచేసుకున్నాను. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్ని పార్టీలను కలుపుకుపోతూ 'హస్తం' హవా చూపుతోంది. అయితే ఎంపీ ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాలు గెలుస్తుందనే నమ్మకమైతే ఉన్నది. ప్రజలు ఇండియా కూటమివైపు మొగ్గుచూపారనేది పోలింగ్‌బట్టి తెలుస్తోంది. ప్రజా స్వామ్యం పరిరక్షించబడాలన్నా, రాజ్యాంగం యథావిధిగా కొనసా గాలన్నా కాంగ్రెస్ ఆధ్వర్యంలోని 'ఇండియా' కూటమి అధికారంలోకి రావాలి. తెలంగాణలో ఎలాగైతే దొరల పాలనకు స్వస్తి పలికామో, దేశంలోనూ మతతత్వపార్టీని ఓడించే అవకాశం ఇప్పుడొచ్చింది. రాష్ట్రంలో నిన్నటితో ఎన్నికల సరళి ముగిసినా దేశంలో ఈ నెలాఖరు వరకు పోలింగ్ జరగనుంది. మన రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే 'చెయ్యెత్తి' జైకొట్టాల్సిందే.

- సయ్యద్ రఫీ

మోడీ మహా కుబేర సామ్రాజ్యం

ఏప్రిల్ 21న రాజస్థాన్‌లోని బాన్స్‌వారాలో నరేంద్రమోడీ చేసిన ప్రసంగంలో ముస్లింలపై విషపూరతమైన రీతిలో దాడిచేశారు. సంపద పున:పంపిణీ కోసం జరిగే ఎలాంటి ప్రయత్నమైనా సరే హిందువుల బంగారాన్ని ఆస్తినీ 'చొరబాటుదారుల'కు అప్పగించడమే అవుతుందన్నట్టు భయానకంగా చిత్రించారు. ఈ ప్రసంగంలో ప్రదర్శితమైన మూఢద్వేషం సహజంగానే విస్తారమైన ఖండనలకు గురికావడాన్ని మనం అర్థం చేసుకోదగిందే.కాని ఆ ప్రసంగంలో మరో పార్శ్వం వుంది. మోడీకి, బీజేపీకి ఎంత కరుడుగట్టిన అభివృద్ధి నిరోధక భావజాలం వుందో ఆ ప్రసంగం తేటతెల్లం చేసింది. విపరీతమైన అససమానతలకు నిలయంగా వున్న భారతదేశంలో సంపదనూ ఆదాయాలను పున:పంపిణీ చేయాలనే ఏ కాస్త ప్రతిపాదన వచ్చినా వారెంతో విద్వేషం వెళ్లగక్కుతున్నారు.

దోచిపెట్టిన మోడీ సర్కార్

కాంగ్రెస్ మద్దతుదారుడైన శ్యామ్ పిట్రోడా ఎప్పుడో చేసిన కొన్ని వ్యాఖ్యలను మోడీ బీజేపీ ఈ సందర్భంలో ముందుకు తెచ్చారు. అమెరికాలో వున్నట్టుగా భారత దేశంలోనూ వారసత్వ (సంక్రమణ) పన్నును ప్రవేశపెట్టాల్సిన ప్రతిపాదనను పరిశీలించాలని ఆయన అన్నారు. వారసత్వ పన్ను అనే భావనను ప్రస్తావించడమే మోడీకి, ఆయన మితవాద పాలక పార్టీకి ఎక్కడలేని కోపం తెప్పించింది. ఇది గత పదేండ్లుగా మోడీ ప్రభుత్వం సంపన్న వర్గాల అనుకూల విధానాలను అనుసరించడమే అంతరాలు ఇంతగా పెరగడానికి కారణమైంది. కార్పొరేట్లకు పన్ను రాయితీలు గుప్పించడం, సంపద పన్ను రద్దు చేయడం, అత్యధిక ఆదాయం వచ్చే వర్గాలపై ఆదాయ పన్ను తగ్గింపు, ఆశ్రిత పెట్టుబడి దారుల పట్ల అమితమైన అనుకూలత ప్రదర్శించడం..ఇవే అసమానతలకు ఆజ్యం పోశాయి. ప్రపంచంలోనే ఇండియాను అత్యధిక అసమానతల దేశంగా మార్చాయి.

అగాధమైన ఈ అసమానతల స్వరూపం ఏంటో కండ్లకు కట్టే సంఖ్యా వివరాలు పుష్కలంగా అందుబాటులో వున్నాయి. ప్రపంచ అసమానతల ప్రయోగశాల లెక్కల ప్రకారం 2022-23లో దేశంలో సంపదలలో 65 శాతం, ఆదాయాలలో 57 శాతం అత్యగ్ర స్థానంలో వుండే పది శాతం మంది మహా కుబేరుల చేతుల్లో వున్నాయి. ఆక్స్‌ఫాం నివేదిక ప్రకారం అందరికన్నా పైన వున్న ఒక శాతం మంది 47 శాతం సంపద అనుభవిస్తుంటే దిగువన వున్న 60 శాతం మంది చేతుల్లో వున్న సంపద కేవలం 4.7 మాత్రమే. బాగా పైనున్న ఆ ఒక్క శాతం మంది చేతిలోని అక్రమ ధనాన్ని కూడా లెక్కలోకి తీసుకుంటే ఇది ఘోరంగా వుంటుంది. భారత రాజ్యాంగం మన ప్రజల్లో విస్తారమైన భాగం ప్రత్యేకించి సామాజికంగా అణచివేయబడిన వారలు ఎలాంటి భౌతిక వనరుల నుంచి దూరం చేయబడిన స్థితిలో వున్నారనే వాస్తవాన్ని భారత రాజ్యాంగం గుర్తించింది. ఆర్థిక, సామాజిక రంగాల్లో వారు అన్యాయమైన పరిస్థితి లోకి నెట్టబడ్డారనే సామాజిక వాస్తవాన్ని గుర్తించింది. అందుకే దీనికి సంబంధించి రాజ్యాంగం నాలుగోభాగంలో ప్రభుత్వ విధానాలకు ఆదేశిక సూత్రాలను కొన్నిటిని పొందుపర్చింది. ఆ భాగంలోని 39 (బి) అధికరణం ఇలా పేర్కొంది: దేశంలోని భౌతిక వనరుల యాజమాన్యం, నియంత్రణ అందరి శ్రేయస్సు కోసం ఉపయోగపడే విధంగా పున:పంపిణీ జరగాలి. ఉమ్మడి శ్రేయస్సుకు హాని కలిగించే రీతిలో సంపదలు ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణ జరగని రీతిలో ఆర్థిక వ్యవస్థను నిర్వహించాలని ఉప నిబంధన(సి) ఆదేశించింది.

అసమానతల తగ్గింపెలా?

కాని గత మూడు దశాబ్దాలుగా అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు ఈ ఆదేశిక సూత్రాలకు విరుద్ధమైన దిశలో పని చేశాయి. ఒక చిన్న దొంతరగా వున్న కుబేర వర్గాల చేతిలో సంపదలు పోగుపడి పోయాయి. 90 శాతం మంది ప్రజలు గౌరవ ప్రదమైన రీతిలో మెరుగైన జీవితం గడిపేందుకు అవసరమైన భౌతిక వనరులు హరించివేయబడ్డాయి. నయా ఉదారవాద విధానం ప్రపంచవ్యాపితంగా అసమానతలకు దారి తీస్తే ఇందులో భారత దేశం మరీ అసమానతల మహా సముద్రంగా



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

మారిపోయింది. ఇంకా ఇంకా లోతుల్లోకి దిగిపోయింది. ఆయా దేశాల్లో అసమానతలను తగ్గించడమెలా? అలాగే సుసంపన్నమైన పారిశ్రామిక దేశాలకు వర్థమాన దేశాలకూ మధ్య గండి పూడ్చడమెలాగనే దానిపై మరోసారి ఆలోచనలు మొదలయ్యాయి. ఈ అసమానతలు తగ్గించేందుకు పేదరికాన్ని తగ్గించి భౌతిక వనరులను అందుకోసం ఉపయోగించేలా రాజ్యం జోక్యం చేసుకోవడానికి ఒక మార్గం పన్ను విధానం, దాన్ని సంపద పున:పంపిణీకి వీలుగా రూపొందించడం అందుకో మార్గం. సంపద పన్ను అంటే బడా కుబేరులపై పన్ను, వారసత్వ పన్ను, బహుమతి పన్ను అందులో కొన్ని. వీటిపై బడా పెట్టుబడి దారీ దేశాల్లో ఎప్పటి నుంచో ఆలోచనలు సాగుతున్నాయి. వారసత్వంగా సంక్రమించే సంపదపై పన్ను వేయడం, ఈ సంపదను ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించడం అన్నది వీటిలో బాగా పాతుకుపోయిన ఒక ప్రతిపాదన. ఇందులో మళ్లీ రెండు రకాలుంటాయి. ఎస్టేట్ (ఆస్తి) పన్ను, వారసత్వ పన్ను. మొదటిది- మరణించిన వ్యక్తి ఎస్టేట్‌ను అర్హులైన వారికి ధారాదత్తం చేసేముందే ఎస్టేట్ పన్ను విధించబడుతుంది. అలాగాక ఆ ఆస్తి వారసత్వంగా పొందిన భాగస్వామి లేక కుటుంబ సభ్యులపై వారసత్వ పన్ను విధించడం రెండో పద్ధతి. యూరోపియన్ యూనియన్‌లోని 19 దేశాలలో ఈ మూడు రకాలైన ఎస్టేట్ పన్ను, వారసత్వ పన్ను, బహుమతి పన్నులలో ఏదో ఒకటి వుంది. ఉదాహరణకు బ్రిటన్‌లో వారసత్వ పన్ను 40 శాతం వుంటుంది. ఫ్రాన్స్‌లో 45 శాతం, నెదర్లాండ్స్‌లో 40 శాతం వరకూ వుంది. యూరోపియన్ యూనియన్ వెలుపల జపాన్‌లో వారసత్వ పన్ను 55 శాతం వుంది. అమెరికాలోని వివిధ రాష్ట్రాలు 20 నుంచి 55 శాతం వరకూ వారసత్వ ఆస్తి పన్ను విధిస్తున్నాయి.

ఎవరిపై ప్రభావం?

భారత దేశం విషయానికొస్తే వారసత్వ పన్నును 1985లోనూ సంపద పన్నును 2015 లోనూ ఎత్తివేశారు. ఈ పన్నుల వల్ల వచ్చే ఆదాయం అత్యల్పంగా వుందనీ, వచ్చేదాని కన్నా వసూలు చేయడానికి, నిర్వహణకు ఎక్కువ ఖర్చు అవుతోందని కారణం చెప్పారు. దేశంలో కొందరు భారతీయుల భోగభాగ్యాలు జుగుప్సాకరమైన స్థాయికి పరుగు పెడుతున్న ఈ దశలో వారి సంపదపై పన్ను వేయడం న్యాయం సమ ధర్మం కూడా. అంతర్జాతీయంగా కార్పొరేట్ పన్ను సంస్కరణల కోసం పని చేసిన స్వతంత్ర కమిషన్ సహాధ్యక్షురాలుగా పని చేసిన జయతీ ఘోష్ కొన్ని సూచనలు చేశారు. 2023 హారున్ ప్రపంచ జాబితాలోని 187 బిలియన్ డాలర్ల గల మహా కుబేరులపై సంపద పన్ను వేయాలని సూచించారామె. ఈ ప్రకారం చేయడమంటే జనాభాలో 99.99 శాతం మందిపై ఎలాంటి ప్రభావం పడదన్న మాట. వారి సంపదలపై కేవలం 4 శాతం పన్ను విధించినా ప్రజారోగ్యానికి, విద్యకు గణనీయమైన ఆదాయం వస్తుంది. అదే విధంగా సంపద పన్ను అనేది కేవలం బాగా పైన వున్న వారిపైనే విధించబడుతుంది. చిన్న, మధ్య తరహా స్థాయి ఆదాయాలు, ఆస్తులపై ఎలాంటి వారసత్వ పన్ను వుండదు.

ఉదాహరణకు రూ.వంద కోట్ల పైన ఆస్తి గలవారికే ఇది వర్తిస్తుంది. అది కూడా దశల వారీగా. అందువల్ల మంగళ సూత్రాలు, ఇతర ఆస్తులు జప్తు చేయడం వంటి మాటలతో మోడీ చేసింది కేవలం హడలగొట్టే ప్రయత్నం మాత్రమే. పన్ను రాయితీలతో కార్పొరేట్లను తెగ మోసిన మోడీ ప్రభుత్వం వారి బాకీలను కూడా అన్ని రకాలుగా రద్దు చేసింది. అలాంటి సర్కారుకు కుబేరులపై పన్ను పెంచడమనే ఆలోచనే మింగుడు పడటం లేదు. అది అర్బన్ నక్సల్ ఆలోచన అని మోడీ అభివర్ణించారు. కనుకనే వారసత్వ పన్ను గురించి మాట్లాడగానే వారు విషపూరిత మైన దాడికి దిగారు. ఆ ప్రతిపాదనకు పచ్చి మతోన్మాదరంగు పులిమారు. మోడీ రాజ్యపు మతతత్వ కార్పొరేట్ లక్షణాలకు అనుగుణంగానే ఇలా చేశారన్నమాట.

సంపదల పున:పంపిణీ విధానాలకు సంబంధించి కాంగ్రెస్ ఆత్మ రక్షణలో పడిపోయింది. అలా కావలసిన అవసరమేమీ లేదు. తన ప్రణాళికలో అది పొందుపరచిన ఆర్థిక సామాజిక న్యాయం సాధించాలంటే ఆర్థిక అసమానతలు తగ్గించే సామాజిక సమతకు దారి చూపే కొన్ని చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో సీపీఐ(ఎం) తన వైఖరి స్పష్టంగా ప్రకటించింది. మహా కుబేరులపై తన ప్రణాళికలో సీపీఐ(ఎం) సంపద పన్ను, వారసత్వ పన్ను వేయాలని ప్రతిపాదించింది. కార్పొరేట్ లాభాలపై పన్ను పెంచాలని చెప్పింది. మహా సంపన్నులు బడా కార్పొరేట్ల కోసమే పని చేస్తున్న మోడీ రాజ్‌కు స్వస్తి పలకాలంటే ఈ చర్యలు తప్పనిసరి.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)



ఇండియా కూటమి అభ్యర్థికి సహకరించిన వారికి కృతజ్ఞతలు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఖమ్మం నగరంలో వివిధ ఎన్నికల బూత్‌లను సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు యర్రా శ్రీకాంత్, వై విక్రమ్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇండియా కూటమిలో భాగంగా ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేసిన సీపీఐ(ఎం) శ్రేణులకు, కూటమి అభ్యర్థికి మద్దతుగా నిలిచిన వివిధ పార్టీల కార్యకర్తలకు, పార్లమెంటు వ్యాప్తంగా ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రఘురామ్‌కు ఓట్లు వేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నా

- ఓటర్లు నా పక్షానే నిలిచారు
- నేను చేసిన అభివృద్ధే నన్ను గెలిపిస్తుంది
- నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు
- బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు



నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్లను కలిసి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే ఫోన్‌లో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. వైరా మండలం తాటిపూడి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించినప్పుడు గదిలో ఒక ట్యూబ్ లైట్ మాత్రమే ఉండడం వల్ల సరిగా కనిపించడం లేదని ఓటర్లు సమస్యను నామ దృష్టికి తీసుకురాగా నామ సత్వరమే స్పందించి కలెక్టర్‌కి ఫోన్ చేసి సమస్యను వివరించి, పరిష్కరించారు.ఖమ్మం కవిత పీజీ కాలేజీ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న నామ నాగేశ్వరరావు తర్వాత పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు పరిశీలించారు. ఈ సందర్భంగా నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలింగ్ జరిగిన తీరును బట్టి ఓటర్లు బీఆర్ఎస్ పక్షానే నిలిచారని అన్నారు. తాను అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నట్లు నామ స్పష్టం చేశారు. తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలు, పని చేసిన తీరు, రైతు బిడ్డగా తనను జిల్లా ఓటర్లు ఆదరించారని భావిస్తున్నానని చెప్పారు. తన విజయం కోసం పని చేసిన జిల్లా, మండల, గ్రామ, బూత్ స్థాయి నాయకులకు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటేయాలి

- బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటేస్తే రాజ్యాంగాన్ని కోల్పోతాం
- బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్ రద్దు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ- కల్లూరు

నేడు ప్రజాస్వామ్యం ప్రమాదపుటంచుల్లో ఉందని, కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, కాపాడుకునే అవకాశం మనందరికీ వచ్చిందని, ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌కు ఓటేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం సోదరుడు ప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్, బిజెపిలకు ఓటు వేస్తే మతతత్వంతో దేశం సర్వనాశనం అవుతుందని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని సమూలంగా మార్చివేసి భారతదేశంలో ప్రజాస్వామ్యం లేకుండా చేసేందుకు బిజెపి పార్టీ ప్రయత్నిస్తుందని, మరోసారి బిజెపి అధికారంలోకి వస్తే ఇవే మనకి చివరి ఎన్నికలు అవుతాయని మంత్రి అన్నారు. సమావేశంలో పొంగులేటి ప్రసాద్ రెడ్డి, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కాటేపల్లి కిరణ్ తదితరులు ఉన్నారు.

తెలంగాణలో బీజేపీ 10 సీట్లకు పైగా కైవసం

బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి

నవతెలంగాణ- కల్లూరు

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి పార్టీ తెలంగాణలో పది సీట్లుకు పైగానే గెలుచుకుంటుందని బిజెపి జాతీయ నాయకుడు, తమిళనాడు, కర్ణాటక ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలు కావాలని లేనిపోని అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. బిజెపి మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ తన అవసరాల కోసం ఇప్పటికే రాజ్యాంగాన్ని అనేకసార్లు మార్పు చేసిందని అన్నారు. రిజర్వేషన్ రద్దు చేస్తారని, ఇక ఎన్నికలు ఉండవని ఈమధ్య రాజకీయాల్లోకి వచ్చి పదవులు చేపట్టిన వారు ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. డబ్బు రాజకీయాలతో ఎదిగిన వారు రాజకీయం తెలిసి మాట్లాడాలని హితవు పలికారు. సమావేశంలో పొంగులేటి మహేందర్‌రెడ్డి, సత్తుపల్లి పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ నంబూరి రామలింగేశ్వరరావు, వీర్రాజు తదితరులున్నారు.

సీబీఎస్ఈ ఫలితాలు విడుదల

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాలు సోమవారం విడుదల అయ్యాయి. పోలేపల్లిలోని కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతిలో మొత్తం 96 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ఏ-1 గ్రేడ్ ముగ్గురికి, ఏ-2 గ్రేడ్ ముగ్గురికి, బీ-1 గ్రేడ్ 7 మందికి, బీ-2 గ్రేడ్ ముగ్గురికి వచ్చినట్లు విద్యాలయ ప్రిన్సిపల్ కవింద్రరాయ్ తెలిపారు. సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

12వ తరగతి ఫలితాల్లో...

సీబీఎస్ఈ బోర్డు సోమవారం 12వ తరగతి ఫలితాలను విడుదల చేసింది. మండలంలోని కేంద్రీయ విద్యాలయంలో మొత్తం 14 మంది విద్యార్థులు ఉండగా వారిలో పరీక్షకు 13 మంది మాత్రమే హాజరయ్యారు. 13 మంది ఉత్తీర్ణులయ్యారు. 12వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

నవతెలంగాణ - బోనకల్

పార్లమెంటు ఎన్నికలలో తమ ఓటు హక్కును మండల జెడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు మోటమర్రిలో సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నాడు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు రావినూతలలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కలకోటలో ఎంపీపీ కంకణాల సౌభాగ్యం తూటికుంట్లలో తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్ కలకోటలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు బోనకల్లో టిడిపి మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ రావినూతలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న సీపీఐ నాయకులు



నవతెలంగాణ-ఖమ్మం

సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖమ్మంలోని ఇందిరా నగర్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఆయన సతీమణి విజయలక్ష్మి, మమత విద్యా సంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ, డైరెక్టర్ పువ్వాడ -నరేన్, సాయి శిరణి తదితరులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు కొత్తగూడెంలోని విద్యా నగర్ కాలనీ పంచాయతీ జికె విద్యాలయం పోలింగ్ బూత్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కుటుంబ -సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీపాషా కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం

మంగళవారం | మే 14, 2024 | www.navatelangana.com

ప్రజా సమస్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు



నవతెలంగాణ-మధిర

మధిర మున్సిపాలిటీలోని సుందరయ్య నగర్ యువ ఆదర్శ్ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ బూత్ నెంబర్ 178లో ఓటు హక్కును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు మరియు వారి కుమారుడు సూర్య విక్రమాదిత్య వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు దేశ పౌరులకి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలి అని అన్నారు.

ఓటర్...బెటర్...

- ప్రశాంతంగా ముగిసిన లోక్‌సభ పోలింగ్
- వాతావరణం చల్లబడటంతో తరలిన ఓటర్లు
- ఖమ్మంలో 75%, మానుకోటలో 68%
- అక్కడక్కడా మొరాయించిన ఈవీఎంలు
- 6 గంటల తర్వాత కూడా కొనసాగిన పోలింగ్

చెదురుమదురుగా కురుస్తున్న చిరు జల్లులతో వాతావరణం చల్లబడటం ఓటర్లలో ఉత్తేజాన్ని నింపింది. ఎండవేడిమి దిగులు లేకుండా హాయిగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. గతంకంటే కొంత పోలింగ్ పర్సంటేజ్ తగ్గినా 18వ లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం, మానుకోట నియోజకవర్గాల ఓటర్లు సామాజిక స్ఫూర్తిని కనబరిచారు.



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పోలింగ్ విజయవంతంగా ముగిసింది. రెండుమూడు చోట్ల ఈవీఎంలు మొరాయించినా పోలింగ్‌కు అంతరాయం కలగకుండా వెంటనే రిజర్వ్ ఈవీఎంలను అమర్చారు. ఎక్కడ కూడా ఓటర్ ఇబ్బందులు పడకుండా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీ) ఏర్పాట్లు చేయడంతో ఈసారి పోలింగ్ పర్సంటేజ్‌లో కొంత పురోగతి కనిపించింది. సాయంత్రం 5 గంటల వరకు ఖమ్మంలో 70.76% ఓటింగ్ జరగ్గా...మొత్తంగా 75% ఓటింగ్ నమోదైనట్లు సమాచారం. మానుకోట లోక్‌సభ నియోజకవర్గంలో 68.60% పోలింగ్ నడిచింది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి అసెంబ్లీ స్థానాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. 6 గంటల లోపు క్యూలైన్‌లలో ఉన్న వారు సైతం ఓటుహక్కు వినియోగించుకున్నారు. మహబూబాబాద్ నియోజక వర్గంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు భద్రాచలం, ఇల్లెందు, పినపాక, ములుగు, ఖమ్మం పరిధిలోని కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. పోలింగ్ పూర్తిస్థాయి గణాంకాలు అందాల్సి ఉంది.

పెరుగుతున్న ఓటింగ్...

ఖమ్మం పార్లమెంట్ పరిధిలో 16,31,039 మంది ఓటర్లు ఉండగా వీరి కోసం 1896 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. 35 మంది బరిలో ఉన్నారు. ఒక్కో ఈవీఎంకు 16 మంది చొప్పున మూడు యూనిట్లు ఏర్పాటు చేశారు. అలాగే మానుకోట పరిధిలో 15,32,366 మంది ఓటర్లు ఉండగా 23 మంది పోటీ పడుతున్నారు. రెండు ఈవీఎం యూనిట్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటల వరకు ఖమ్మం లోక్‌సభ పరిధిలో 70.76% పోలింగ్ నమోదైంది. ఖమ్మంలో 62,50.92%, పాలేరులో 83.30%, మధిర (ఎస్సీ) 81.30%, వైరా 80.56%, సత్తుపల్లి (ఎస్సీ) 80.00%, కొత్తగూడెం 66.17%, అశ్వారావుపేట 80.36% ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2014లో 82.20% పోలవగా 2019లో 75.19% ఓటింగ్ జరిగింది. 2019తో పోల్చితే ఈసారి 5 శాతానికి పైగా ఓటింగ్ పెరిగే అవకాశం ఉంది. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో సాయంత్రం 5 గంటలకల్లా 68.60% పోలింగ్ నమోదైంది. నియోజకవర్గం పరిధిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు పినపాక 65.91%, ఇల్లెందు 69.11%, భద్రాచలం 64.72% మొత్తంగా ఈ మూడింటిలో 66.83% పోలింగ్ నమోదైంది. ఈ నియోజకవర్గం పరిధిలోని ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు గ్రామస్తులు 16 కి.మీ అటవీమార్గంలో వెళ్లి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

అపశృతులు...

పోలింగ్‌లో కొద్దిపాటి అపశృతులు చోటుచేసుకున్నాయి. ఎన్నికల విధులు నిర్వహిస్తూ కొత్తగూడెం జిల్లా పరిషత్ ఉద్యోగి, అశ్వారావుపేట నెహ్రూనగర్ 165వ బూత్ పోలింగ్ ఆఫీసర్ శ్రీ కృష్ణ మృతిచెందారు. అలాగే ఇక్కడే ఓటు వేసి వెళ్తూ మరొకరు మరణించారు. ఇల్లెందులో ఓటర్లపై తేనెటీగలు దాడి చేశాయి. ఎవరికీ ఎలాంటి అపాయం జరగలేదు. ఇక్కడే జేబీఎస్ పాఠశాలలో ఈవీఎం మొరాయించింది. ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గంలో పలుచోట్ల 4 గంటలకు పోలింగ్ అనే విషయం తెలియక వచ్చిన వందలాది మంది ఓటర్లు నిరాశతో వెనుదిరిగారు. సమస్యలు పరిష్కరించాలని ఇల్లెందు మండలం కొమ్ముగూడెం, లచ్చగూడెం గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారితో పాటు ఎమ్మెల్యే కోరం కనకయ్య హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఎన్నెస్పీ కాలువపై వంతెన నిర్మించాలని కోరుతూ ఏన్కూరు మండలం రాయమాధారం గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల, గొల్లగూడెం గ్రామస్తులు ఓటింగ్‌కు నిరాకరించడంతో ట్రైనీ ఏఎస్పీ విక్రాంత్‌సింగ్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ నచ్చజెప్పి ఓట్లు వేయించారు.

శతాధిక వృద్ధులు సైతం...

శతాధిక వృద్ధులు సైతం ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ స్టేషన్‌లకు వచ్చారు. ఓటు ఆవశ్యకతను చాటడంలో స్ఫూర్తిగా నిలిచారు. ఖమ్మం బ్రహ్మణబజార్‌కు చెందిన లక్ష్మీహైమావతి (110) అనే శతాధిక వృద్ధురాలు స్థానిక పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. పాల్వంచ ఇందిరాకాలనీ పోలింగ్ స్టేషన్ 57లో దాసరి పుల్లమ్మ (101) వృద్ధురాలు ఓటు వేశారు.

పోలింగ్ సరళి పరిశీలన..

ఖమ్మం జిల్లాలో కలెక్టర్ వీపీ గౌతమ్ నగరంలోని పలు పోలింగ్ స్టేషన్‌లను సందర్శించి సరళిని పరిశీలించారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఆ జిల్లా పోలింగ్ అధికారి, కలెక్టర్ ప్రియాంక అలా పర్యవేక్షించారు. సీపీఐ(ఎం), సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి తన ఓటుహక్కును స్వగ్రామం మహబూబాబాద్ మండలం మాధాపురంలో వినియోగించుకున్నారు. ఆ తర్వాత ఆయన తాను పోటీ చేస్తున్న పార్లమెంట్ పరిధిలో కలియతిరిగారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు కుటుంబసభ్యులు ఖమ్మంలోని కవిత మెమోరియల్ కళాశాల బూత్‌లో ఓటు వేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి- మాధురి, ఆయన సోదరుడు ప్రసాద్‌రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు కల్లూరు మండలం నారాయణపురంలో ఓటు వేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలో ఓటు వేయగా...డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నందిని దంపతులు మధిరలో ఓటు వేశారు.















ఆళ్లపాడులో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏజెంట్లు కొట్లాట

- డిప్యూటీ సీఎం భట్టిపై

బీఆర్ఎస్ నాయకుల అవాకులు, చవాకులు



నవతెలంగాణ - బోనకల్

సాక్షాత్తు పోలింగ్ బూత్‌లోనే కాంగ్రెస్, బిఆర్ఎస్ ఏజెంట్లు ఎన్నికల అధికారుల ముందే కొట్టుకున్న సంఘటన మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామంలో సోమవారం జరిగింది. ఇరు వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం ఆళ్లపాడు పోలింగ్ బూత్ నెంబర్ 133లో ఉదయం 10 గంటల నుంచే కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏజెంట్ల మధ్య వివాదం ప్రారంభమైంది. మధ్యాహ్న సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన బండి గోపి ఓటర్లను తీసుకొని వెళ్లి పోలింగ్ బూత్‌లో ఓట్లు వేయిస్తున్నాడు. పదేపదే గోపి ఇతరులను తీసుకొని పోలింగ్ బూత్‌లోకి రావడాన్ని బిఆర్ఎస్ ఏజెంట్ మరీదు వెంకన్న అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో గోపి కళ్ళు కనపడని ఓ వ్యక్తిని పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్లాడు. అతను ఓటు కూడా గోపి వేయటానికి ప్రయత్నం చేయగా బిఆర్ఎస్ ఏజెంట్ మరీదు వెంకన్న తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీంతో కాంగ్రెస్ ఏజెంట్ నర్సింగ్‌ల సతీష్ జోక్యం చేసుకొని నీవు పదేపదే ఎందుకు అభ్యంతరం పెడుతున్నావని మరీదు వెంకన్నను నిలదీశాడు. దీంతో వెంకన్న తీవ్ర ఆగ్రహంతో సతీష్ గల్ల పట్టుకున్నాడు. ఆ వెంటనే కోపోద్రిక్తుడైన సతీష్ వెంకన్నను కొట్టాడు. ఇదంతా ఎన్నికల అధికారి ముందే జరగటం విశేషం. ఒక్కసారిగా ఈ విషయం బయటికి రావటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బోనకల్ ఎస్ఐ కడగండ్ల మధుబాబు వెంటనే పోలింగ్ బూతులోకి వెళ్లి ఇరు పార్టీలకు చెందిన ఏజెంట్లను బయటకు తీసుకువచ్చారు. అప్పటికే పోలింగ్ స్టేషన్ బయట ఆవరణలో పెద్ద ఎత్తున కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. బీఆర్ఎస్ ఏజెంట్‌ని కాంగ్రెస్ ఏజెంట్ కొట్టాడని సమాచారం బయటకు రావడంతో ఇరువర్గాలకు చెందిన వారు పోలింగ్ స్టేషన్లలోకి వెళ్లారు. దీంతో ఇరువర్గాలు తోసుకొన్నారు. పోలీసుల రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను పోలింగ్ స్టేషన్ నుంచి చెదరగొట్టారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో కూడా ఇరువర్గాల వారు పెద్ద ఎత్తున మొహరించి ఉన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన వారు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కపై తీవ్ర విమర్శలు చేశారు. భట్టి విక్రమార్క ఎంత, ఆయన ఏం చేస్తాడో చూసుకుందాం రండి అంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఒక దశలో రెచ్చిపోయారు. అయితే పరిస్థితి విషమించటంతో కాంగ్రెస్ నాయకులు తమ పార్టీ కార్యకర్తలను నిలువరించారు. ప్రతి విషయంలో భట్టి విక్రమార్కను ఎందుకు లాగుతున్నారని కాంగ్రెస్ నాయకులు వాదనలకు దిగారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి పోలింగ్ స్టేషన్ పరిసర ప్రాంతాల నుంచి ఇరు పార్టీలకు చెందిన వారందరినీ చెల్లాచెదరు చేశారు. దీంతో దాదాపు రెండు గంటల పాటు ఆల్లపాడు పోలింగ్ స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్నాయి. పోలింగ్ బందోబస్తుకు వచ్చిన ప్రత్యేక పోలీసులు కూడా ఉండటంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. సాక్షాత్తు పోలింగ్ బూత్‌లోనే కాంగ్రెస్ బీఆర్ఎస్ ఏజెంట్లు కొట్టుకోవటం పట్ల ఎన్నికల అధికారులు తమ పై అధికారులకు సమాచారం అందించారు. ఇరు వర్గాలపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై కడగండ్ల మధుబాబు తెలిపారు.



పోలింగ్ బూత్‌లను సందర్శించిన రఘురాంరెడ్డి

నవతెలంగాణ-వైరాటౌన్



పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సోమవారం వైరా నియోజకవర్గ కేంద్రంలోని పోలింగ్ బూత్‌లను కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి సందర్శించారు. పోలింగ్ సరళి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని పోలింగ్ సిబ్బందిని కోరారు. పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలను పరిశీలించారు. స్వేచ్ఛగా పోటు హక్కును వినియోగించు కోవాలని ఓటర్లకు సూచించారు.

ఖమ్మం, మహబూబాబద్ ఎంపీ స్థానాలు గెలుస్తున్నాం

- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు ధీమా
- కుటుంబ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ రవిచంద్ర

నవతెలంగాణ-ఖమ్మం

18వ పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటు స్థానాలకు జరిగిన ఎన్నికలలో ఖమ్మం ఎంపీగా నామ నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీగా మాలోత్ కవిత బీఆర్ఎస్ ఎంపీలుగా విజయం సాధిస్తారని ఎంపీ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఖమ్మం ఎన్ఎస్‌టీ రోడ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాలేజీలోని పోలింగ్ బూత్‌లో కుటుంబ సమేతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం ఉమ్మడి జిల్లాతో పాటు మహబూబాబాద్ పార్లమెంటు స్థానానికి జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే రెండు స్థానాల్లోనూ బీఆర్ఎస్ పార్టీ తప్పకుండా విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించిన కేసీఆర్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకొని ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు పలకనున్నారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఇండియా కూటమిదే గెలుపు

- సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఖమ్మం



పార్లమెంటు ఎన్నికలలో ఇండియా కూటమిదే విజయం అని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా నాయకులు ఎర్రా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఖమ్మం త్రీ టౌన్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆ పార్టీ బలపరిచిన ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామ సహాయము రఘురాంరెడ్డి గెలుపు కోసం టౌన్ ప్రాంతంలో ఉన్నటువంటి అన్ని బూతులు స్టేషన్లలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలలో ఓటును వినియోగించుకుని ఇండియా కూటమికి ఓటు వేసిన సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం. ఈ బృందంలో ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ హిమామ్, ఎస్కే బాబు, గణపనేని పున్నయ్య చౌదరి, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

తేజావత్ పంతులుకు మంత్రి తుమ్మల పరామర్శ

నవతెలంగాణ-ఖమ్మం



ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తేజావత్ పంతులు నాయక్‌ని ఖమ్మంలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాధు రమేష్‌రెడ్డి, నున్న రత్నరావు, మోరంపూడి నాగేశ్వరరావు, పోలూరి రమేష్, పొన్నం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గోర్కి పబ్లిక్ స్కూల్ విజయఢంకా

నవతెలంగాణ-ఖమ్మం



G. GAYATHRI PRIYAMVADA

సీబీఎస్ఈ పదవ తరగతి పరీక్షా ఫలితాలలో గోర్కి పబ్లిక్ స్కూల్ విజయఢంకా మోగించారని పాఠశాల సెక్రటరీ అండ్ కస్పాండెంట్ డాక్టర్ పీ.గోర్కే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500 మార్కులకుగాను 12 మంది విద్యార్థులు 450 పర్కులు పైగా సాధించారని, 400 మార్కులు పైగా సాధించినవారు 36 మంది విద్యార్థులు, సబ్జెక్టుల వారిగా తెలుగులో, సైన్సులో, సోషల్‌లో వందకు తొంబైతొమ్మిది మార్కులు విద్యార్థులు సాధించారని తెలిపారు. వందశాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ పీ.గోర్కే అభినందించారు.

హార్వెస్ట్ విదార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-ఖమ్మం




2023-24 విద్యా సంవత్సరానికి సెంట్రల్ బోర్డఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఈ) సోమవారం ప్రకటించిన పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుంగా అత్యధిక మార్కులు సాధించి అగ్రశ్రేణిలో నిలిచారని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల తెలిపారు. కరస్పాండెంట్ రవిమారుత్ , ప్రిన్సిపాల్ ఆర్. పార్వతీరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 12వ తరగతి పరీక్షా ఫలితాలు తమ పాఠశాలలో తమ పాఠశాల నుండి 12వ తరగతి పరీక్షకు 275 మంది హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణులై 100 శాతం ఫలితాలు సాధించారని తెలిపారు . 450 పైగా మార్కులు సాధించిన వారు 26 మంది, 400 మార్కులు పైగా సాధించిన వారు 83 మంది ఉన్నారని, . ఇంగ్లీషులో 76 మంది ఏ వన్ సాధించగా, గణితంలో 50 మంది ఏ1 లు, భౌతికశాస్త్రంలో 45 మంది ఏ1లు, రసాయన శాస్త్రంలో 29 మంది ఏ1లు, బయాలజీలో 7 మంది ఏ1 లు, పొలిటికల్ సైన్స్ లో 6 మంది ఏ1 లు, ఎకనామిక్స్లో 7 మంది ఏ1, , జాగ్రఫీలో ఇద్దరు, బిజినెస్ స్టడీస్ లో ముగ్గురు, కంప్యూటర్ సైన్స్లో 9మంది, అగ్రికల్చర్ 21 మంది, అకౌంటెన్సీలో ఒక్కరు మొత్తంగా సబ్జెక్ట్ వారిగా ఏ1 సాధించారని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్లో మరిన్ని విషయ సాధించాలని అభిలషించారు.

10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 'హార్వెస్ట్' అగ్రస్థానం



2023-24 విద్యా సంవత్సరానికి గానూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ నకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఈ) సోవవారం ప్రకటించిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుంగా అత్యధిక మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారని కరస్పాండెంట్ పి. రవి మారుత్ , ప్రిన్సిపల్ ఆర్. పార్వతీరెడ్డి తెలిపారు. 10 వ తరగతి పరీక్షా ఫలితాలు సిబిఎస్ఈ బోర్డు సోమవారం ప్రకటించగా, తమ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారని తెలిపారు. తమ పాఠశాల నుండి 10వ తరగతి పరీక్షకు 267 మంది హాజరు కాగా, అందరూ 100 శాతం ఫలితం సాధించారన్నారు. 450 మార్కులు పైగా సాధించిన వారు 58 మంది కాగా, 400 మార్కులు పైగా సాధించిన వారు 138 మంది అని వారు తెలిపారు . 13 మంది విద్యార్థినీ, విద్యార్థులు అన్ని సబ్జెక్టులలో ఏ1 సాధించడం అభినందనీయమన్నారు . సబ్జెక్టుల వారీగా- ఇంగ్లీష్లో 72 మంది , తెలుగులో 39 మంది, హిందీలోని 6 గురు , గణితంలో 70 మంది , సైన్స్లో 63 మంది , సోషల్లో 39 మంది , గణితంలో 100/100 మార్కులు 18 మంది సాధించడం విశేషం అన్నారు. విద్యార్థినీ, విద్యార్థుల అభినందించి, భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలని అభిలాషించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ పాఠశాల ప్రభంజనం

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ పాఠశాల విద్యార్థులు సీబీఎస్ఈ ఫలితాలలో ప్రభంజనం సృష్టించారని పాఠశాల చైర్మెన్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా మంచి విజయాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పీ.అశోక్‌రెడ్డి, ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ దంపతులు

నవతెలంగాణ-ఖమ్మం



లోక్‌సభ సాధారణ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ దంపతులు సామాన్యుల్లా క్యూలైన్‌లో నిలబడి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సోమవారం రిటర్నింగ్ అధికారి ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్ లో జిల్లా అటవీ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం సంఖ్య 195 లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ లోకసభ సాధారణ ఎన్నికల పోలింగ్ సజావుగా జరుగుతున్నట్లు, జిల్లా అటవీ అధికారి కార్యాలయం పోలింగ్ కేంద్రంలో ఉన్న తమ ఓటు హక్కును తాము బాధ్యతగా వచ్చి వినియోగించుకోవడం జరిగిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రజలు తమకు అందించిన పోలింగ్ స్లిప్పులతో పాటు ఓటర్ ఐడి. కార్డు లేదా ప్రభుత్వం జారీ చేసిన 12 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకొని వచ్చి పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. మనం వేసే ఓటే మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశ ఎన్నికల్లో భాగస్వామ్యం కావాలని, ప్రతి ఒక్క ఓటరు ఓటు వేయాలని ప్రజాస్వామ్యాన్ని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ

నవతెలంగాణ-ఖమ్మం



లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను పోలీసు కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. ఖమ్మం రూరల్ డివిజన్ పరిధిలోని ఎంవీ.పాలెం, తెల్దారుపల్లి, పిండిప్రోలు, కాచిరాజుగూడెం, ఖమ్మం నగరంలోని రమణగుట్ట, ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ కాలేజ్, వైరా, ఏన్కూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలీస్ కమిషనర్ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఓటర్లకు కల్పించిన సౌకర్యాలపై పోలింగ్ అధికారులతో మాట్లాడారు. ఏవరికి ఇబ్బందులు లేకుండా వరుస క్రమంలో వెళ్లి ఓటును వినియోగించుకోవాలని ఓటర్లకు సూచించారు. క్రమపద్ధతిలో పోలింగ్ బూత్‌లోనికి ఓటర్లను అనుమతించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అలాగే ఓటు వేసిన వారిని పోలింగ్ కేంద్రాలలో వేచి ఉండకుండా బయటకు పంపించాలన్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలోనే ఓటింగ్‌కు వచ్చేవారి వాహనాల పార్కింగ్ చేసుకునేలా, పోలింగ్ స్టేషన్లకు వచ్చిపోయే వారికి అంతరాయం కలగకుండా అన్నిచర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల బందోబస్తు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు.

గంగారంలో ఓటుకోసం పో(ఓ)టెత్తిన జనం

- 81.1శాతం పోలింగ్ నమోదు
- కాంగ్రెస్‌కు కలిసొచ్చిన 'దాసరి' సేవలు..?
- ఓటర్లకు చల్లని మజ్జిగ, లస్సీ ప్యాకెట్లు వితరణ చేసిన దాసరి మధుమోహనరెడ్డి

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి మండలం గంగారంలోని శ్రీదాసరి వీరారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల వద్ద తమ ఓటుహక్కును వినియోగించుకొనేందుకు ఓటర్లు పోటెత్తారు. గ్రామంలో మొత్తం ఓటర్లు 3,501 ఉండగా 2,840 మంది తమ ఓటుహక్కును వినియోగిం చుకున్నారు. 81.1శాతం పోలింగ్ నమోదైంది. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐదు బూత్‌ల వద్ద ఉదయం 7గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. ఓటేందుకు వచ్చిన జనాలకు నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా గ్రామవాసి, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు దాసరి వెంకట్రామిరెడ్డి (చిట్టినాయన) కుమారుడు మధుమోహనరెడ్డి సౌజన్యంతో ఓటర్లకు చల్లని మజ్జిగ, లస్సీ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థికి కలిసొచ్చిన 'దాసరి' సేవా కార్యక్రమాలు..?

ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు దాసరి వెంకట్రామిరెడ్డి కుమారుడు మధుమోహనరెడ్డి సౌజన్యంతో గ్రామంలో చేపట్టిన కోట్లాది రూపాయల శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలు కలిసొచ్చాయి. ఇటీవల కాలం నుంచి గ్రామంలో పలు సామాజిక వర్గాలు మధుబాబు చేస్తున్న సేవా కార్యక్రమాల కారణంగా ఆయన మాటకు తిరుగు లేకుండా పోయినట్లయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం మధుబాబు తన అనుయాయులను వెంటేసుకొని ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్‌కు ఓటెయ్యమని ప్రజలను అభ్యర్థించారు. సోమవారం పోలింగ్ సందర్భంగా చిట్టినాయన ఇంటిముందు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మధుబాబు అభిమానులతో కిటకిటలాడుతూ తిరునాలను మరిపించింది. గ్రామంలో ఎవరిని అడిగినా కాంగ్రెస్ అభ్యర్థికి జైకొట్టడం గమనార్హం.



సీబీఎస్ఈ ఫలితాలలో న్యూ లిటిల్ ఫ్లవర్ విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-వైరాటౌన్

సెంట్రల్ బోర్డు అఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ న్యూ ఢిల్లీ వారు మే 13న ప్రకటించిన పది, పన్నెండు ఫలితాలలో న్యూ లిటిల్ ఫ్లవర్ వైరా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ పి.భుమేష్‌రావు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. 12వ తరగతి ఫలితాలలో మొత్తం 66 మంది విద్యార్థులు హాజరుకాగ 100 శాతం ఉత్తీర్ణతతో 65 విద్యార్థులు మొదటి శ్రేణిలో, ఒక విద్యార్థి ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. అత్యున్నతంగా 500 మార్కులకు గాను 482 మార్కులతో (97%) కుర్రా స్వాత్య మొదటి స్థానంలో నిలువగా కొప్పురావూరి తేజస్విని (95%), జ్ఞాన ప్రద్యుమ్న (94%), బీరెల్లి వెంకట కృష్ణ (93%), వడ్డే శ్రీముఖి (91%) సాధించి జాతీయ స్థాయి ఫలితాలలో ముందంజలో ఉన్నారు. 10వ తరగతి ఫలితాలలో మొత్తం 156 మంది విద్యార్థులు హాజరుకాగ 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యున్నతంగా తేజ్ చరణ్ 500 మార్కులకు గాను 488 మార్కులతో 98 శాతం సాధించాడు. కె.ఈశ్వర్ (96%), భూక్యా ఠాగూర్ (95%), ఎ.అన్విక (95%), వై.తోషిని శ్రీలక్ష్మి (94%), టి.వివేక్ నందు (94%), బి. సాయిచరిత (94%), టి.కీర్తన, జి. స్వేచ్ఛ, సిహెచ్. యజ్ఞ త్రివేణి, చావా సాయి కృష్ణలు (92%), యు.అక్షరసిరి, డి.ఉజ్వల్ చౌదరి, ఎ.గౌతమ్ కుమార్ (91%), ఎస్.శ్రీజ, జె.వివేక్, ఎ.సాయి ఉజ్వల్ 90 శాతం సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పి.భుమేష్ రావు మాట్లాడుతూ 12వ తరగతి మొదటి బ్యాచ్ లోని విద్యార్థులు క్రమశిక్షణగా కష్టపడి జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనపరచి మన కాలేజీకి మంచి గుర్తింపును తీసుకొచ్చారని మాట్లాడారు. అదే విధంగా పది ఫలితాలలో కనీ విని ఎరుగని రీతిలో ఫలితాలను సాధించటం జరిగిందని, ఈ క్రమంలో విద్యార్థులు పట్టుదలగా అకుంఠితమైన దీక్షతో అత్యధికమైన మార్కులను సాధించి మన పాఠశాలను రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలపటం జరిగిందని అన్నారు. ఇటువంటి ఫలితాల కోసం న్యూ లిటిల్ ఫ్లవర్ నిరంతరం కృషి చేస్తుందని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ డాక్టర్.కాపా మురళీ కృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకార్, స్కూల్ ప్రిన్సిపల్ షాజీ మాథ్యూ, ఎట నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ 'పది'లో శ్రీ చైతన్య భేష్

- టాప్ మార్కులతో ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ సత్తా

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించిన సీబీఎస్ఈ పదోతరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక మమత రోడ్‌లోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాల టాప్ మార్కులతో ప్రభంజనం సృష్టించింది. ఎస్.మనోన్మయి 491/500 మార్కులు సాధించగా, జి.తన్మయి 483, ఎన్. నిఖిత 483, వి. కీర్తి 481, వి. వర్షిత్ 480, ఎస్.మధు సన్విత 479 మార్కులు సాధించారు. సబ్జెక్టుల వారీగా 120 మంది విద్యార్థులు ఏ-1 గ్రేడ్లు సాధించగా, మార్కుల సరాసరి 100 శాతంతో పాటు మొత్తం పరీక్ష రాసిన విద్యార్థులలో 30 మంది 450కి పైగా మార్కులు పొందారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య అభినందించారు. శ్రీచైతన్య సీబీఎస్ఈ ఇంటిగ్రేటెడ్ కరిక్యులంతో విద్యార్థులకు సి-బ్యాచ్, ఎస్-బ్యాచ్ ప్రోగ్రాములతో విద్యాబోధన సాగిస్తుందని తెలిపారు. జాతీయ పోటీ పరీక్షలకు విద్యార్థులను ప్రతిభవంతులుగా తీర్చిదిదుతున్నామన్నారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించేందుకు అహర్నిశలు కృషి చేసిన ఉపాధ్యాయులనూ అభినందించారు. తమ విద్యాసంస్థలలో విద్యనభ్యసించే విద్యార్థులు కేవలం తరగతి గదికే పరిమితం కాకుండా అన్ని రంగాలలో శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సాయిగీతిక, ఎ.జి.యం. చేతన్ మాధుర్, కోఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాల్స్ టిఎల్ఎస్ శర్మ, నాగప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, డీన్ లక్ష్మీనారాసింహ, ఇంచార్జులు రామారావు, నరేష్, సతీష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఏ. జిగ్నేష్ కృష్ణ ప్రసాద్



జీ. రాజ్ వర్ధన్

సత్తా చాటిన హార్వెస్ట్ విద్యార్థులు

నవతెలంగాణ-ఖమ్మం

ఏ. జిగ్నేష్ కృష్ణ ప్రసాద్ హార్వెస్ట్ స్కూల్ లో గత ఐదు సంవత్సరాలుగా చదువుతున్నాను. సోమవారం 12వ తరగతి ఫలితాల్లో నాకు 495/500 మార్కులు వచ్చినవి. అదే విధంగా నేను ఎం. బైపీసీ విద్యార్థి కాబట్టి నాకు మెయిన్స్, నీట్ పరీక్షలు రాసే అవకాశం ఉన్నది. మెయిన్స్ లో ఓపెన్ క్యాటగిరి లో 2251 ర్యాంకు సాధించాను. నీట్‌లో కూడా మంచి ర్యాంకు వచ్చే అవకాశం వచ్చింది. హార్వెస్ట్ యాజమాన్యం యొక్క ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారంతో ఇటువంటి మంచిర్యాంకులు సాధించడం జరిగింది. నేను శాస్త్రవేత్త ని కావాలని కోరుకుంటున్నాను.

జీ. రాజ్ వర్ధన్ హార్వెస్ట్‌లో తొమ్మిది సంవత్సరాలుగా చదువుతున్నాను. సోమవారం 12వ తరగతి ఫలితాల్లో 494/500 మార్కులు వచ్చినవి. మెయిన్స్ లో 2666 ఓపెన్ కేటగిరి ర్యాంకు సాధించడం జరిగింది. 4వ తరగతి నుండి 12వ తరగతి వరకు హార్వెస్ట్‌లో చదువుకున్నాను. యాజమాన్యం నిరంతరం నన్ను ప్రోత్సహిస్తూ నా విజయాలకు కారణమయ్యారు. నేను భవిష్యత్తులో సైంటిస్ట్ కావాలని కోరు కుంటున్నాను. ఉపాధ్యాయుల సహకారం తల్లిదండ్రుల ప్రోత్సాహం నా విజయాలకు కారణం.

IN THE COURT OF THE II ADDL DISTRICT & SESSIONS JUDGE AT KHAMMAM
A.S.No. 66 / 2024
(O.S.No. 350/2018 on the file of Senior Civil Judge at Khammam)
Between:
Manchala Somaiah .....*Appellant / Plaintiff*
AND
Darelly Ashok .....*Respondent / Defendant*
NOTICE
To
Darelly Ashok S/o. Kotaiah Age: 30 years, Occ: Business R/o. H.No. 5-274, Wyra Village and Mandal, Khammam Dist
పై అప్పీలు నందు పై కోర్టులో మీ హాజరునకు **తేది: 03-06-2024 న ఉదయం 10:30 నిII లకు కలదు.** మీరు స్వయంగా కాని, లేక న్యాయవాది ద్వారా కాని హాజరు కానియెడల మీ పరోక్షములో కోర్టు వారి నుండి ఉత్తర్వులు పొందబడను
//కోర్టు వారి అనుమతితో//
ఖమ్మం,
తేది:13-05-2024
KARI CHARAN, MBA, LL.B
Advocate for the Appellant/Plaintiff
H.No: 3-8-323, Zaheerpura,
Near Janatha Medical Shop,
KHAMMAM-507003. T.S

IN THE COURT OF THE HON'BLE JUDGE FAMILY COURT AT KHAMMAMM
MC NO.1/2024
Between
Chitha Pavani (Being Minor represented by Her Grand Mother) Jakkampudi Vasantha .....*Petitioner*
And
Chinta Venkateswar Rao .....*Respondent*
To
Chintha Venkateswar Rao, S/o Shankar Rao, age: 35 years, Occ: Agriculture, R/o H.No.2-57, Nutankal Village, Tallada Mandal, Khammam District
NOTICE
Take notice that the above case is posted on 16.05.2024 for your appearance before the Hon'ble Court. You **have to present on 16.05.2024 before the Hon'ble Court by 10:30 am** either in person or through your advocate, failing which the case will be decided exparte.
(By the order of the Hon'ble Court)
Khammam
Date: 13-05-2024
Kondapalli Jagan Mohan Roa
Advocate, Khammam

IN THE COURT OF THE 1st ADDL district JUDGE AT KHAMMAM
E.P No. 128 OF 2021
IN
ARBITRATION CASE No. 251 OF 2015
Between:-
M/s Shriram City Union Finance Limited, MADHIRA Branch, Rep by Its GPA Holder K. Srinivasulu .....*DHR*
And
1) LAKSHMI MANOHARI KOPPURAVURI, W/O: SATYANARAYANA, AGE: 37 YRS, OCC: M/S. SRI GOODWILL CYCLE STORES, WYRA ROAD, MADHIRA, KHAMMAM, R/O: H.NO: 7-80, 5 NUNDY 8 BLAKULU, MADHIRA(M), KHAMMAM (D)
2) SEKHAR BABU KAMATAM, S/O: VENKATAPPAIAH, AGE: 45 YRS, OCC: SGT, PATAMATA LANKA, VIJAYAWADA, R/O: H.NO: 23-220/5, BOSU BOMMA ROAD, NEAR PANCHAYATH OFFICE, PATAMATALANKA, VIJAYAWADA, CELL NO: 9441715612.
.....*Judgement Debtors*
సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా.! **శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్,** మధిర బ్రాంచి తనకు రావలసిన డబ్బులు రాబట్టుకొనుటకు ఎఆర్‌బి కేసు నెం.251/2015 ద్వారా 1) లక్ష్మి మనోహరి కొప్పురావూరి 2) శేఖర్ బాబు కమతం పై డిక్రీ పొంది యున్నారు. సదరు అవార్డు డిక్రీ ని అనుసరించి ఈ ఇద్దరు చెల్లించవలసిన రూపాయలు అసలు, వడ్డీ మరియు ఖర్చులు చెల్లించని కారణంగా ఇపి నెం. 128/2021 ద్వారా మొత్తం డబ్బులు రాబట్టుకొనుటకై 1) లక్ష్మీమనోహరి కొప్పురావూరి 2) శేఖర్ బాబు కమతం గారి స్వాధీనానుభవ యాజమాన్య హక్కు భుక్తములలోని దిగువ షెడ్యూలు స్థిరాస్తిని కోర్టువారు అటాచ్మెంట్ చేసి యున్నారు. మరియు దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని అమ్మవలసినదిగా పై కోర్టు వారిని కోరినందున సదరు కోర్టు వారు ఆజ్ఞానుసారం **తేది 03/06/2024 ఉ.గం. 10.30 నిIIలకు** కోర్టు వారి ముందు కోర్టు వారి షరతులకు లోబడి బహిరంగ వేల వేయుటం జరుగుతుంది. కావున ఆసక్తి గలవారు పైన తెలిపిన కోర్టు వారు నిర్వహించబడు వేలంలో పాల్గొని దిగువ షెడ్యూలు స్థిరాస్తిని కొనుగోలు చేయవచ్చు. ఈ రోజు వరకు అవార్డు/ డిక్రీ బాపతు అసలు, వడ్డీ మరియు ఖర్చులు మొత్తం కలిపి **శ్రీరామ్ సిటీ యూనియన్‌ఫైనాన్స్ లిమిటెడ్‌కు** రావలసిన **బకాయి రూ. ఇపి అమౌంట్ రూ.8,41,392**
SCHEDULE OF THE IMMOVABLE PROPERTY TO JDR no.1
200 SQ. YARDS OF VACANT RESIDENTIAL SITE IN PLOT NO.62 OUT OF S. NO.32/AA, SITUATED AT DIDUGUPADU VILLAGE MADHIRA MANDAL, KHAMMAM DISTRICT, REGISTRATION DISTRICT KHAMMAM, SUB DISTRICT: MADHIRA, BOUNDED AS UNDER:
East : SITE OF PLOT NO.45
West : 25 FEET WIDTH OF PROPOSED ROAD
North : SITE OF PLOT NO.61
South : SITE IN PLOT NO.63 BELONGING TO SHAIK PEER SAHEB & OTHERS
Kandala kranthi kumar
Advocate, khammam

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్





ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

నవతెలంగాణ-కొత్తగూడెం





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకుని నేటితరం యువతకు ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ప్రాముఖ్యతను తెలిపే విధంగా స్ఫూర్తినిచ్చారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని ఈకే విద్యాలయం ఆవరణలో గల పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు లక్ష్మీదేవి పల్లెపల్లిలోని శ్రీ రామచంద్ర ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖమ్మం పార్లమెంటు బీఎస్పీ పార్టీ అభ్యర్థి ఎర్ర కామేష్ కొత్తగూడెం సింగరేణి పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఆయన సతీమణితో కలిసి వెళ్లి ఓటు వేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య జిల్లాలోని ములకలపల్లి మండలంలోని మదారంలో ఓటు వేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి ఉన్నతపాఠశాలలో ఓటు వేశారు. ఇలా ప్రముఖ నాయకులు వారి వారి పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఇష్టంగా ఓటు వేయడం కనిపించింది. దీన్ని బట్టి చూస్తే భవిష్యత్తు ప్రజాస్వామ్యం వర్ధిల్లేవిధంగా ఓటు హక్కు వేసినట్టు స్పష్టమవుతుంది.

జిల్లాలో 67.93 శాతం నమోదు

- మందకొడిగా సాగి...ఉపందుకుని
- అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్న మహిళలు




నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిస్తాయి. సోమవారం లోక్ సభకు జరిగిన ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు క్యూ లైన్‌లో నిలబడి ఓటు వేశారు. ఉదయం 11 గంటల వరకు 10 శాతం ఓటింగ్ మందకొడిగా నమోదయింది. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాను అత్యంత సుందరంగా అలంకరించారు. ఆహ్లాదంగా ఏర్పాటు చేశారు. దీంతో పెళ్లి సందడి వాతావరణం కనిపించింది. ఓటర్లు గతం కంటే ఈసారి లోక్ సభ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద ప్రశాంతంగా ఓటింగ్ వేసిన పరిస్థితి కనిపించింది. మహిళా ఓటర్లు ఎక్కువగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం ఈవీఎంలు మొరాయించినప్పటికీ వెంటనే ఎన్నికల సిబ్బంది అప్రమత్తమై వాటిని సరిచేశారు. వెంటనే ఓటింగ్ సరళి సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టారు. ఓటర్లకు ఇబ్బంది కలగకుండా పోలీసులు ఇతర ఎన్నికల సిబ్బంది సహకరించారు. వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఓటు వేయడానికి వచ్చిన వారికి సహాయకులుగా అంగన్వాడీ సిబ్బంది సహకారం అందించారు. వీల్ చైర్ ద్వారా ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లడం కనిపించింది. మొత్తంగా పెద్ద వయసు వాళ్ళు ఓటు హక్కును వినియోగించుకోవడం పట్ల దేశంలో ప్రజాస్వామ్యం పట్ల వారుకున్న నిబద్ధత స్పష్టంగా కనిపించింది. ఈసారి యువకులు పూర్తిస్థాయిలో పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించిన పరిస్థితి లేదు. అంతగా ఆసక్తి చూపలేద అన్నట్టుగా తెలుస్తుంది. కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారు ఆనందంగా ఓటు వేశారు.

అధికారుల పరిశీలన....



పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అల, ఎస్పీ రోహిత్ రాజు జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాలలో పోలింగ్ సరళిని ఎన్నికల అధికారి నేరుగా బూత్‌లోకి వెళ్లి పరిశీలించారు. సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు ఇబ్బందులు కలిగించాయా...? అని వారిని అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు లేవని, సక్రమంగా పోలింగ్ జరుగుతుందని ఎన్నికల సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్పీ పరిశీలన...

ఎస్పీ రోహిత్ రాజ్ పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు గురించి అడిగి తెలుసుకున్నారు. రుద్రంపూర్ పరిధిలోని త్రీ ఇంక్లైయిన్ పోలింగ్ కేంద్రంలో ఎస్పీ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వివిధ పోలింగ్ కేంద్రాల వద్దకు నేరుగా వెళ్లి పోలింగ్ సరళి ఎలా జరుగుతుందో ఎన్నికల సిబ్బందిని అడిగారు. అనంతరం పహారగా ఉన్న పోలీసులతో మాట్లాడి పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూడాలన్నారు. ఎవరైనా ఎన్నికలకు ఆటంకం కల్పించే విధంగా చర్యలు ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో జిల్లా యంత్రాంగం ఊపిరి పీలుచుకుంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కావడంతో సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగింది. నాలుగు గంటల లోపు పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లను బూత్‌ల వద్ద ఉంచి, మెయిన్ గేట్లు మూసివేశారు. అప్పటికే చాలామంది 4 గంటల తరువాత ఆలస్యంగా రావడంతో తమ ఓటు హక్కు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. నిరుత్సాహంతో ఇంటికి తిరిగి వెళ్లారు..



పోలింగ్ కేంద్రాలలో విస్తృతంగా పర్యటించిన జిల్లా ఎన్నికల అధికారి

నవతెలంగాణ-పాల్వంచ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉదయం 7 గంటల నుంచి ప్రక్రియ ప్రారంభమైందని, జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొనసాగుటకు కాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అల పోలింగ్ కేంద్రాలను విస్తృతంగా పరిశీలన చేశారు. కొత్తగూడెం నియోజకవర్గం వర్గ పరిధిలో జరుగుతున్న పోలింగ్ సరళిని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కొత్తగూడెం నియోజకవర్గం పరిధిలోని లక్ష్మీదేవి పల్లి మండలం చేతకొండ మహిళా పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి అక్కడ ఏర్పాట్లును పరిశీలించారు. సింగరేణి ఉమెన్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఓటర్లకు కల్పించిన సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు అనుమతి లేదని నిశితంగా పరిశీలించి పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలని అధికారులకు సూచించారు. అనంతరం పాల్వంచ మండలంలోని సిల్ క్యాంపస్, నవభారత్ ఎదురుగా 72వ పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అక్కడ ఓటర్లు ఏర్పాటు చేసిన ఏర్పాట్లపై అధికారులకు కొన్ని సూచనలు చేశారు. అనంతరం పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన స్వీప్ సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటో దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధిగా అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ఏదైనా సమస్య తలెత్తినట్లయితే వెంటనే తమ దృష్టికి తేవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జగన్నాధపురంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సందర్శించారు. అక్కడ వికలాంగులు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీలుగా పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ఏర్పాటు చేసిన వాహనాలను పరిశీలించారు.

ఈ పర్యటనలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విద్యా చందన, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.





అత్యధిక ఆధిక్యంతో 'రామసహాయం' విజయం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-అశ్వారావుపేట

సీపీఐ(ఎం), సీపీఐలు బలపరిచిన ఖమ్మం పార్లమెంట్ నియోజక వర్గం కాంగ్రెస్ అభ్యర్థి రామ సహాయం రఘురామిరెడ్డి అత్యధిక ఓట్లు ఆధిక్యంతో విజయం సాధించనున్నారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ఆశాభావం వ్యక్తం చేసారు. ఆయన సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ములకలపల్లి, అశ్వారావుపేట మండలాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రజా పాలన మరిచిన బీఆర్ఎస్‌కు, మతం, దైవం ముసుగులో రాజకీయం చేస్తున్న బీజేపీకీ ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, మండల కార్యదర్శి బి.చిరంజీవి, మండల కమిటీ సభ్యులు తగరం జగన్నాధం, కాంగ్రెస్ నాయకులు తుమ్మ రాంబాబు, జూపల్లి ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న నాలుగు తరాల కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



19వ లోక్ సభకి జరిగిన ఎన్నికలలో భద్రాచలం పట్టణానికి చెందిన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డితో పాటు ఆయన తల్లి శాంతమ్మ, కుమారుడు నరసింహారెడ్డి, మనుమడు విష్ణువర్ధన్ రెడ్డి కలిసి పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన నాలుగు తరాల వారు ఈ విధంగా ఓటు హక్కు వినించుకోవటం ప్రత్యేకతను చాటుకుంది. ఈ సందర్భంగా ఎం.బి నర్సారెడ్డి మాట్లాడుతూ... ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. తన తల్లిగారైన శాంతమ్మ ఎనిమిది పదుల వయసులో అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకుంటానని ముందుకు వచ్చారని తెలిపారు.



ఖమ్మంలో నామ విజయం ఖాయం

- తెలంగాణలో 12 నుంచి 14 సీట్లు బీఆర్ఎస్‌కు రావడం తథ్యం
- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

నవతెలంగాణ-జూలూరుపాడు

తెలంగాణ రాష్ట్రంలో కేవలం 5 నెలలలోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఆదివారం పార్లమెంటు ఎన్నికల సందర్భంగా పోలింగ్ సరళిని పరిశీలించేందుకుగాను జూలూరుపాడు వచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు ఎల్లంకి సత్యనారాయణ గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కోఆర్డినేటర్ ఆర్‌జేసీ కృష్ణతో కలిసి మాట్లాడారు. ఖమ్మంలో నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ పార్లమెంటు స్థానంలో కవిత విజయం ఖాయమని అన్నారు. కేవలం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అన్నారు. ఈ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ 12 నుండి 14 స్థానాలు గెలుచుకోవడం ఖాయమని, జూన్ 4న తెలంగాణ రాష్ట్రం అంతా గులాబీమయం కావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చావా వెంకట రామారావు పాల్గొన్నారు. అనంతరం జూలూరుపాడు మండల కేంద్రంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎల్లంకి శేషయ్య, చాపలమడుగు రామ్మూర్తి, ఇల్లంగి తిరపతి తదితరులు ఉన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో 4 గంటలకే పోలింగ్ బూత్లకు తాళం

- ఓటు వేయలేకపోయిన వందలాది మంది ఓటర్లు
- నిరాశతో వెను తిరిగిన వైనం
- ప్రచార లోపమేనా...!

నవతెలంగాణ-ఇల్లందు



రాష్ట్రంలోని పలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల నియోజకవర్గాలలో మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలోని ఇల్లెందులో 4 గంటల వరకు మాత్రమే పోలింగ్ ఉంటుందని అధికారులు ప్రకటించారు. సోమవారం పోలింగ్ అనంతరం నాలుగు గంటలకే అధికారులు తాళాలు వేశారు. తెలుసుకోలేని సుమారు 20 మంది ఓటర్లు నాలుగు గంటల రెండు నిమిషాలకు పోలింగ్ బూత్‌కు చేరుకున్నారు. అప్పటికే పోలింగ్ బూత్లకు తాళాలు వేసి ఉండటంతో నిరాశ చెందారు. ఓటర్లు పోలీసులతో కొంతసేపు బతిమిలాడి వెనుతిరిగారు. ఈ ఘటన పట్టణంలోని మెయిన్ రోడ్డు ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్ నెంబర్ 107లో జరిగింది.

రాష్ట్రంలో పోలింగ్ సమయాలలో తేడాలు గంటలు 4, 5, 6 : ప్రచార లోపకమేనా...!

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన భద్రాచలం, కొత్తగూడెం, ఇల్లందు, పినపాక, అశ్వరావుపేటలలో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని ఎన్నికల అధికారులు ముందే ప్రకటించారు. మహబూబాబాద్ పార్లమెంటు స్థానం పరిధిలో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల పరిధిలో ఉంది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో సాయంత్రం 5 గంటలకు, ఎక్కువ ప్రాంతాలలో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంది. వివిధ ఛానల్‌లు, ప్రసార మాధ్యమాలలో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 మరి కొన్ని చోట్ల 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందని ప్రసారం జరిగింది.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో నాలుగు గంటల వరకు మాత్రమే అని ఎక్కువ ప్రచారం కనిపించలేదని ఓటర్లు అంటున్నారు. పోలింగ్ సమయాలలో తేడాలు ఉండడంతో ఓటర్లు కన్ఫ్యూజ్ అయ్యారు. దీంతో పట్టణంలోనే చాలా పోలింగ్ బూత్‌లలో వందలాది మంది ఓటర్లు నాలుగు గంటల తర్వాత పోలింగ్ చేరుకున్నారు. దీంతో పోలీసులు నాలుగు గంటల వరకే పోలింగ్ ఇక వెళ్ళిపోవాల్సిందేనని చెప్పడంతో అనే ఒక మంది నిరాశతో వెనుతిరిగారు.

ఏజెన్సీలో ఓటర్ల ఇబ్బందులు

- పగిడేరు పంచాయతీలో అవస్థలు
- మోట్లగూడెంలో 1300 ఓట్లకు ఒకటే పోలింగ్ బూత్
- స్కూల్ గేట్లనుండి జారిపడ్డ మహిళలు, వృద్ధులు
- సరైన మంచినీటి సౌకర్యాలు లేక ఇబ్బంది పడ్డ ప్రజలు

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరు సబ్ డివిజన్‌లో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పినపాక నియోజకవర్గంలో 250 బూత్‌లలో ఏజెన్సీలో సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పగిడేరు పంచాయతీలో మొట్లగూడం పాఠశాలలో 1350 ఓటర్ల గాను ఒకటే బూత్ కలిగి ఉన్నది. ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం ఏడు గంటలకు ఓటు వేసేందుకు వెళ్లినవారు రెండు గంటలకి గాని ఓటు వేసే అవకాశం రాలేదు. శాంతినగర్ కొడిశల గ్రామాల ప్రజలకు శాంతినగర్, గొల్ల కొత్తూరు గ్రామాలలోని ప్రజలకు శాంతినగర్‌లో పోలింగ్ బూత్ అదనంగా ఏర్పాటు చేస్తే బాగుండేదని ప్రజలు అనుకుంటున్నారు. సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మోట్ల గూడెంలో ఉండడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాల గేటు వద్ద సరైన రహదారి లేకపోవడంతో వృద్ధులు, మహిళలు జారి కింద పడ్డారు. ప్రిసైడింగ్ అధికారి చివరికి ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేయడంతో ఎవరికి ఇబ్బంది కలగలేదు. ఈవీఎంలు ఓటుకి ఓటుకు మధ్య అధిక సమయం తీసుకున్నాయి. దీని కారణంగా ఓటింగ్ నిదానంగా జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఓటింగ్ శాతం తక్కువగా నమోదయింది. ఎండల తీవ్రత దృష్ట్యా కొందరు వృద్ధులు ఓటింగ్ వినియోగించుకోలేకపోయారు. పగడేరు పంచాయతీలోని కొన్ని గ్రామాల ఓట్లు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న బుగ్గ పంచాయతీలో ఉండడంతో ఓటు వేసేందుకు ప్రజలు అవస్థలు పడ్డారు. 65.91 శాతం నమోద యింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.



పోలింగ్ ప్రశాంతంగా ముగియటం పట్ల కలెక్టర్ హర్షం

నవతెలంగాణ-పాల్వంచ



పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడం పట్ల కలెక్టర్ ప్రియాంక అలా హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16 నుండి, నోటిఫికేషన్ ఏప్రిల్ 18 నాటి నుంచి మే 13 పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో జిల్లా ప్రజల సహాయ, సహకారాలు భాగస్వామ్యం మరువలేనిదని ఆమె పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ఆమె అభినందనలు తెలియజేశారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతమైన మన జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించడం ఎంతో అభినందనీయమని, ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన అధికారులకు, అనధికారులకు, జిల్లా ప్రజలకు, పాత్రికేయులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి

- మరో యువకునికి గాయాలు

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

రెండు ఎద్దులు పోట్లాడుకుని అకస్మాత్తుగా ద్విచక్ర వాహనం మీదికి రావడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృత్యువాత పడగా..మరో యువకునికి గాయాలయ్యాయి. సంఘటన మండల పరిధి జగన్నాధపురం శివారు పల్లె ప్రకృతి వనం ప్రాంత బీసీఎం రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... బూర్గంపహాడ్ మండలం వేపల గడ్డకు చెందిన ఎస్.కే.సమీర్ (21), మడకం సతీష్‌లు వేపలగడ్డ నుండి ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం వైద్యశాలలో చికిత్స పొందుతున్న సమీర్ బంధువును పరామర్శించేందుకు ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జగన్నాధపురం వద్ద రెండు ఎద్దులు పోట్లాడుకుంటూ వీరి ద్విచక్ర వాహనం పైకి దూసుకొచ్చాయి. ద్విచక్ర వాహనం నడుపుతున్న సమీర్ భయం కొద్ది వాహనాన్ని నడుపుతూ అదుపుతప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున్న సతీష్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రున్ని 108 వాహనంలో పాల్వంచ ఏరియా వైద్యశాలకు తరలించారు. సమాచారాన్ని స్థానికులు గ్రామీణ పోలీసులకు అందించారు.

73.95 శాతం పోలింగ్ నమోదు

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలో 73.95 శాతం పోలింగ్ నమోదు అయినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సోమవారం తెలిపారు. మహబూబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇల్లందులో 69.11% నమోదయిందని, టేకులపల్లి మండలంలోని గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన 44 పోలింగ్ బూత్‌లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల పరిరక్షణలో ప్రశాంతంగా పోలింగ్ పూర్తయినట్లు తెలిపారు.

మండల పరిధిలో పురుషులు 20297 మంది, మహిళలు 20886, మొత్తం 41183 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 15303, మహిళలు 15152 మొత్తం 30455 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. ఓటర్లు ఓటు హక్కు విని యోగానికి పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు వచ్చారని, ఓటు హక్కు వినియోగానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

చంద్రుగొండలో పోలింగ్ ప్రశాంతం

నవతెలంగాణ-చంద్రుగొండ



ఓటు హక్కును సద్వి నియోగం చేసుకోవడంలో మండల వాసులు బాధ్యతగా మెలిగారు. ఓటింగ్ ప్రారంభానికి గంట ముందే పోలింగ్ బూతుల వద్ద బారులుతీరి కనిపించారు. యువతి యువకులు ఉత్సాహంగా ఓట్ల ప్రక్రియలో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛందంగా ఓట్లు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వైపు తరలి వెళ్లిన పరిస్థితి కనిపించింది. వృద్ధులు, వికలాంగులు సైతం ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని ఆదర్శంగా నిలిచారు. దీనికి తోడు మధ్యాహ్నం వరకు వాతావరణం చల్లగా ఉండడంతో ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ సాగింది. మరోవైపు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పహారా, 144 సెక్షన్ అమల్లో ఉంది. సాయంత్రం 4గంటల వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగింది.

మానవత్వం చాటుకున్న మంగీలాల్ నాయక్

నవతెలంగాణ - జూలూరుపాడు

అనంతారంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టంతో మండల పరిధిలోని శంభుని గూడెం గ్రామానికి చెందిన బండ కాంతారావుకు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. జూలూరుపాడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాలోతు మంగీ లాల్ నాయక్ అంబులెన్స్ కు సమాచారం అందించి వెంటనే మెరుగైన వైద్యం కొరకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జూలూరుపాడు



మండల పరిధిలోని పడమట నర్సాపురం పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సందర్శించారు. అనంతరం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మాటామంతిలో గ్రామంలోని ప్రతి ఓటర్, ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించి ఎన్నికల కేంద్రాలకు తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జూలూరుపాడు ఫ్యాక్స్ చైర్మన్ లేళ్ళ వెంకటరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంగీలాల్ నాయక్, ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదనరావు, లేళ్ళ గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా పేదల పెన్నిధి, కార్మిక పక్షపాతి మాచర్ల లాలయ్య వర్ధంతి

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలోని అనేక సమస్యలపై పోరాటాలు చేసి పేదలకు సేవలు చేసిన పేదల పెన్నిధి, కార్మిక పక్షపాతి మాచర్ల లాలయ్య అని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నబి అన్నారు. పట్టణ సీపీఐ(ఎం) మాజీ కార్యదర్శి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ నేత మాచర్ల లాలయ్య 19వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఏలూరి భవన్ లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అబ్దుల్ నబీ పాల్గొని మాట్లాడుతూ మాచర్ల లాలయ్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలను చేపట్టాడని మహిళలను పోగేసి త్రాగునీటి ఎద్దడి నివారణకు కోటి లింగాల వాటర్ స్కీం కోర్టు వెనుక వాటర్ ట్యాంక్ నిర్మాణనికి కృషి చేశారని అన్నారు. ప్రజా సమస్యలపై మహిళలను చైతన్యపరిచి అనేక పోరాటాలకు రూపకల్పన చేశారని కళాకారులను తయారు చేసి అనేక కళారూపాలని ప్రజా నాట్యమండలి దళాలతో సమస్యలు అర్థయ్యే లాగ ప్రదర్శించి ప్రజల ఎదుర్కొంటున్నటువంటి సమస్యలు కళారూపాల ద్వారా చైతన్యవంతుల్ని చేసే కార్యచరణ తీసుకునేవారని, ఆ కాలం లోనే ఇల్లందు మున్సిపాలిటీని సీపీఐ(ఎం) కైవసం చేసుకుందని అన్నారు. అలాంటి నేత వర్ధంతి జరుపుతున్నామంటే ఆయన నడిచిన బాటలో సమ సమాజ స్థాపన కోసం పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ మన్యం మోహన్ రావు, మునిగంటి లక్ష్మి, మాదారపు వెంకటేశ్వర్లు, మహమూద్, తాళ్లూరి పద్మ, శ్రీను లక్ష్మణ్ పాసి, సత్యనారాయణ కోరి, లీలా నాగమణి, బండి ఆంజనేయులు, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

నవతెలంగాణ-అశ్వాపురం



మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 24 పంచాయతీలలో 41 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 33, 056 మంది ఓటర్లు ఉండగా 66శాతం పోలింగ్ నమోదయింది. సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరగడంతో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో కొంతమంది ఓటర్లు ఓటెయ్యకుండానే వెనుతిరిగి వెళ్లారు. పోలింగ్ కేంద్రాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేశారు.

విద్యావంతులే ఓటుకు దుమ్మా కొట్టారు

భారజల ఉద్యోగుల నివాస కేంద్రమైన గౌతమి నగర్ కాలనీలో మొత్తం ఐదు పోలింగ్ కేంద్రాలు ఉండగా 2, 981 మంది ఓటర్లు ఉన్నారు. అయితే సోమవారం జరిగిన ఎన్నికలలో కేవలం 40 శాతం ఓటింగ్ మాత్రమే నమోదు కావడం విశేషం. విద్యావంతులు, ఉన్నత ఉద్యోగాలు చేపట్టే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులే ఓటు హక్కును వినియోగించకపోవడం ఏంటని పలువురు అంటున్నారు. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల ముందు నుండి అధికారులు అనధికారులు ఎంతో అవగాహనలు చేసినప్పటికీ ఉద్యోగులు కొందరు పోలింగ్ కేంద్రాలకు కూడా రాకపోవడం గమనార్హం.



అన్నపురెడ్డిపల్లిలో 80 శాతం పోలింగ్

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

పార్లమెంట్ ఎన్నికకు ఓట్లు వేసేందుకు ఉదయం 6 గంటల నుండి ఓటర్లు పోలింగ్ బూతులు వద్ద బారులు తీరారు. మండలంలో మొత్తం 16, 725 మంది ఓటర్లు ఉండగా 13, 462 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా 80.54 శాతం పోలింగ్ జరిగింది. పోలింగ్ కేంద్రాలలో వృద్ధులు, వికలాంగులను పోలీసులు దగ్గర వుండి వారిని పోలింగ్ కేంద్రంలోకి పంపించారు. మండలంలో అన్ని గ్రామంలో పోలింగ్ కేంద్రాలు దగ్గర ఎస్ఐ చంద్రశేఖర్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి అన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలుకు వెళ్లి పరిశీలన చేస్తూ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. మండలంలో నూతనంగా సబ్ ఇన్స్పెక్టర్ గా చంద్రశేఖర్ బాధ్యతలు తీసుకొని ఎంతో చాకచక్యంగా ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసిన సేవలు ఎంతో గొప్పవి అని కొనియాడారు.

పోలింగ్ లో అపశృతి....

- అనారోగ్యంతో ఇరువురి మృతి
- ప్రశాంతంగా ముగిసిన పోలింగ్ ప్రక్రియ...
- నియోజక వర్గం పోలింగ్ 80.36 శాతం

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఖమ్మం పార్లమెంట్ నియోజక వర్గం నెంబర్ 17 పరిధిలోని అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ నెంబర్ 118 ఎస్టీలో సోమవారం జరిగిన పోలింగ్ లో అపశృతి చోటు చేసుకుంది. పోలింగ్ అధికారి ఒకరు, ఓటరు ఒకరు వేర్వేరు చోట్ల అనారోగ్యానికి గురై మృతి చెందారు. ఎటువంటి రాజకీయ అలజడులు లేకుండా పోలింగ్ నాలుగు గంటలకు ముగిసింది. సాయంత్రం 7 గంటలకు అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ లో 80.36 శాతం నమోదు అయింది. గతేడాది డిసెంబర్‌లో జరిగిన సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో 86.88 శాతం పోలింగ్ నమోదు అయింది. నాడు 1,55,961 మంది ఓటర్లకు గానూ 1,35,501 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నేడు పార్లమెంట్ ఎన్నికల్లో 1,59,174 ఓటర్లకు గానూ 1,27,918 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.అసెంబ్లీ తో పోల్చితే పోలింగ్ శాతం 6.36 శాతం తగ్గింది.

పేటలో అత్యధికం.. భద్రాచలంలో అత్యల్పం

- ప్రశాంతంగా లోక్ సభ ఎన్నికలు
- మందకొడిగా సాగిన ఓటింగ్ సరళికి

నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో లోక్ సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఖమ్మం, మహబూబాబాద్ లోక్సభ పరిధిలో పినపాక, భద్రాచలం, ఇల్లందు శాసనసభ నియోజకవర్గాలు ఉండగా ఖమ్మం పరిధిలో మిగతా నియోజకవర్గాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 9,88238 ఓటర్స్ ఉండగా 67.93 ఓట్లు నమోదయ్యాయి. ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 4 గంటల వరకు కేంద్రంలో ఉన్న వరకు ఓటు వేసేందుకు అనుమతిని ఇచ్చారు. జిల్లాలో 5 గంటలకు 67.93 శాతం పోలింగ్ నమోదైనట్లు మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలో పినపాక 65.91శాతం, భద్రాచలం 65.70 శాతం, ఇల్లందు 70.55 శాతం, ఖమ్మం పార్లమెంటు పరిధిలో కొత్తగూడెం 66.17 శాతం, అశ్వారావుపేట 80.36 శాతం నమోదు అయినట్లు, పోలింగ్ ప్రక్రియ ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తెలిపారు.

పాల్వంచలో పోలింగ్ ప్రశాంతం

పాల్వంచ వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. లక్ష్మీదేవి పల్లి, జగన్నాథపురం పోలింగ్ కేంద్రాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అలా సందర్శించి, పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ చేపట్టాలని పోలింగ్ సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ సజావుగా జరిగేందుకు ఓటర్లు సహకరించాలని కోరారు. ప్రియదర్శిని కాలనీలో జిల్లా కలెక్టర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ యంత్రాంగం, పోలీస్ సిబ్బంది చేపట్టిన కట్టుదిట్టమైన చర్యలు సత్ఫలితాన్ని ఇచ్చిందనే చెప్పొచ్చు. అక్కడక్కడ ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించడంతో ఎన్నికల అధికారులు సరిచేసి, పోలింగ్ ప్రక్రియ చేపట్టారు. ఉదయం 7 గంటలకే ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయం పూట చల్లటి వాతావరణం ఉండటంతో పెద్ద ఎత్తున ఓటర్లు కేంద్రాల వద్ద గుమ్మిగూడారు. 11 గంటలకే 45శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 12 గంటల తర్వాత అనూహ్యంగా ఎండ పెరగడంతో.. ఓటింగ్ సరళి మందకొడిగా సాగింది. సాయంత్రం ఐదు గంటల వరకు నియోజకవర్గ వ్యాప్తంగా 62.31 శాతం నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అలా తెలిపారు. దంతల బోర సీతారాంపురం, ఉల్వనూరు సిరసాని గుంపు వలస ఆదివాసీలు కిలోమీటర్ల కొద్ది కాలి నడకతో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.



నియోజకవర్గం	పోలింగ్ శాతం
పినపాక	65.91
భద్రాచలం	65.70
ఇల్లందు	70.55
కొత్తగూడెం	66.17
అశ్వారావుపేట	80.36

ఓట్ వేసిన ప్రముఖులు

ఇందిరా కాలనీలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 57 లో దాసరి పుల్లమ్మ 101 వయసులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘు రామరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు, కలిసి పాత పాల్వంచ పోలింగ్ బూత్ లో ఓటింగ్ సరళి ని పరిశీలించారు. రామాంజనేయ కాలనీ, పాత పాల్వంచలోని పోలింగ్ బూతుల్లో పోలింగ్ సరళిని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పరిశీలించారు. వనమా రాఘవేంద్రరావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు-పద్మావతి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎడవల్లి కృష్ణ ఎడవల్లి సుశీల పట్టణంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.





భద్రాచలంలో ప్రశాంతంగా పోలింగ్



- 65.70 శాతం ఓటు హక్కును
- వినియోగించుకున్న ఓటర్లు
- ఇండియా బ్లాక్ అభ్యర్థికి మద్దతుగా
- నిలిచిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం పట్టణ వ్యాప్తంగా 19వ లోక్ సభ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతం అయిన నేపథ్యంలో ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. గత అసెంబ్లీ ఎన్నికలలో భద్రాచలం పట్టణ వ్యాప్తంగా 80 శాతానికి పైగా పోలింగ్ నమోదు కాగా పార్లమెంటు ఎన్నికలలో ఓటర్లు అప్పటిలా ఉత్సాహం కనిపించలేదు. ఉదయం నుంచి మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం నాలుగు గంటల వరకు 64.70% వరకు పోలైనది. పట్టణంలో ఆదర్శ పోలింగ్ కేంద్రమైన నన్నపనేని మోహన్ హై స్కూల్ సెంటర్ వద్ద వృద్ధులకు వికలాంగులకు వీల్ చైర్ లేకపోవడంతో రాజకీయ పార్టీల నాయకులు ఆందోళన చేశారు. అనంతరం ఎస్పీ రోహిత్ రాజ్ పరిశీలనకు వచ్చిన సందర్భంలో సిపిఎం నేతలు సమస్యను ఎస్ పి దష్టికి తీసుకురాగా వెంటనే వీల్ చైర్ లను ఏర్పాటు చేశారు.

పోలింగ్ పై కనిపించిన ఓటు రేటు ప్రభావం...

గత అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటా పోటీగా ఓటర్లకు 500 నుండి 1000 వెయ్యి రూపాయల వరకు పంపిణీ చేసిన నేపథ్యంలో ఆ ఎన్నికలలో 80 శాతం వరకు పోలింగ్ కాగా లోక్ సభ ఎన్నికలలో పార్టీలా పెద్దలు ఓటర్లకు కేవలం 250 రూపాయలు మాత్రమే అది కూడా కొంతమందికి పంపిణీ చేయడం ఆ ప్రభావం ఓటింగ్ పై పడిందని స్పష్టమవుతుంది. పోలింగ్ బూతుల వద్ద రాజకీయ పార్టీల హడావుడి కూడా గతంలో లాగా ఎక్కడ ఉత్సాహంగా కనిపించలేదు.

ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థికి మద్దతుగా



శిబిరాల వద్ద కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరుతున్న సీపీఐ(ఎం) నాయకులు

నిలిచిన సీపీఐ(ఎం) నేతలు

భద్రాచలం పట్టణంలో పలు పోలింగ్ స్టేషన్ ల వద్ద ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థికి సీపీఐ(ఎం) నేతలు మద్దతుగా నిలిచారు. ఇండియా కూటమి అభ్యర్థిని గెలవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ శిబిరాల వద్ద సీపీఐ(ఎం) కార్యకర్తలు నిలిచారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు, పట్టణ కమిటీ సభ్యులు చుక్కా మాధవరావు తదితరుల నేతృత్వంలో ఆ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శిబిరాల వద్ద ఓటర్లకు ఓటు విలువను తెలియజేస్తూ కనిపించారు.

బూర్గంపాడులో 61.5 శాతం పోలింగ్

నవతెలంగాణ- బూర్గంపాడు



మండలంలో 57 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగింది. మండలంలో 61.5 శాతం పోలింగ్ నమోదు అయింది. మండలంలో 49, 813 మంది ఓటర్లు ఉండగా ఇందులో 30, 809 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మోరంపల్లి బంజర గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆకస్మికంగా సందర్శించి పోలింగ్ సిబ్బందికి సూచనలు సలహాలు చేశారు. బూర్గంపాడులో ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఒకే కాలనీకి చెందిన వ్యక్తులు ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకొని పరిస్థితిని చక్కదిద్దారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన సీపీఐ(ఎం) మండల బృందం:



మండలంలో సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జరిగిన పోలింగ్ సరళిని సీపీఐ(ఎం) మండల బృందం పరిశీలించింది. సీపీఐ(ఎం) బలపరిచిన మ హ బూ బా బా ద్ పార్లమెంటు ఇండియా కూటమి అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గుర్తు హస్తం గుర్తుకు మండల కమిటీ సంపూర్ణంగా ఓటింగ్ పోలింగ్ ముగించేంతవరకు పోలింగ్ బూత్ లు దగ్గరే ఉండి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఇండియా కూటమి అభ్యర్థికి ఓటు వేసిన వారందరికీ సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపినేని సరోజన, ఎస్కే అబీద, కనకం వెంకటేశ్వర్లు, భయ్యా రాము, బర్ల తిరపతయ్య, గుంటక కృష్ణ,రాయల వెంకటేశ్వ ర్లు, నిమ్మల అప్పారావు, ఎస్.కె అంకుశం తదితరులు పాల్గొన్నారు.

ఓటువేసిన బత్తుల వెంకటేశ్వర్లు దంపతులు

సీపీఐ(ఎం) పార్టీ బూర్గంపాడు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అతను భార్య బత్తుల ద్రౌపతి ఓటు హక్కును ఉపయోగించుకున్నారు.

ఇల్లందులో పోలింగ్ 70.55 శాతం



నవతెలంగాణ-ఇల్లందు

ఇల్లందు నియోజకవర్గంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 70.55% పోలింగ్ జరిగినట్లు అధికారులు ప్రకటించారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరిగింది. నియోజవర్గంలో మొత్తం 2 లక్షల 25 వేల 97 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,58,813 ఓట్లు పోలయ్యాయి. 9 గంటల వరకు 26,780. 11.9 శాతం ఓట్లు పోలయ్యాయి. 11 గంటలకు 68,279. 30.3 శాతం ఓట్లు పోలయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 1,07, 104. 47.58 శాతం. మధ్యాహ్నం మూడు గంటల వరకు 1,39,253. 61.86 శాతం. ఐదు గంటల వరకు 1,55,556. 70.55 శాతం. ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 78,153. స్త్రీలు 80,658 ఓటు చేయగా పురుషుల కంటే స్త్రీలు 2,501 అధికంగా ఓటింగ్లో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే కోరం

మండల పరిధిలోని సుభాష్ నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం పరిశీలించారు. పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ధనుంజయ్,నెలవెల్లి నరసింహ రావు, చిట్టి బాబు, ఆముదల ప్రసాద్, యువజన నాయకులు గడ్డం అనిల్, వంగారి శివ, షఫీ తదితరులు ఉన్నారు.

భారీ భద్రత నడుమ

పరివేక్షించిన డీఎస్పీ, సీఐ

నియోజకవర్గంలో 32 రూట్లు 1,998 సిబ్బంది 242 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ చంద్రభాను, సీఐ కరుణాకర్‌లు పరివేక్షించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైనందున ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించారు.



ఎన్నికలలో పాల్గొన్న సీపీఐ(ఎం), సీపీఐ కాంగ్రెస్

ఇల్లందులో సోమవారం జరిగిన ఎన్నికలలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అబ్దుల్ నబి, నాయకులు ఆలేటి కిరణ్, ఆర్పి రాజు, మన్యం మోహన్ రావు, కాంగ్రెస్ నాయకులు, వార్డు కౌన్సిలర్ అంకపాక నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలను బహిష్కరించిన గ్రామస్తులు

సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్న అధికారులు

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

మండలంలోని రేగళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో నెలకొన్న సమస్యలను తీర్చలేదంటూ గ్రామస్తులందరూ ఓటును బహిష్కరించారు. గ్రామంలో సైడ్ డ్రైన్లు, ప్రధాన రహదారి పక్కన ఉన్న రోడ్డు మరమ్మతులు, తాగునీటి కోసం గ్రామంలో ఏర్పాటు చేసిన బోర్లు పనిచేయడం లేదు. 70 సంవత్సరాల నుండి సాగులో ఉన్న భూములకు ఏ రైతుకి కూడా పట్టాలు ఇవ్వకపోవడం, గ్రామంలో ఇంటర్నల్ రోడ్లకి కల్వర్టులు నిర్మించకపోవడం, గ్రామంలో కొంతమందికి పెన్షన్లు రాకపోవడం, మరి కొంతమందికి రేషన్ కార్డులు కూడా మంజూరు కాలేదు అని ఎన్నికలను బహిష్కరించామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు తీర్మానాలు చేసిన గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. మా గ్రామంలో ఇలాంటి అభివృద్ధి జరగకపోతే ఓటును బహిష్కరించామని వారు చెబుతున్నారు..

అధికారులతో చొరవతో ఓట్లు వేసిన ప్రజలు

అనంతరం విషయం తెలుసుకున్న అధికారులు తహసీల్దార్, ఎస్ఐ పాటు ట్రైనీ ఐపీఎస్‌లు అక్కడికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి.. గ్రామంలో నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు ఓటు వేసేందుకు సుముఖం వ్యక్తం చేస్తూ ఓటింగ్లో పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

- ఊపిరి పీల్చుకున్న పోలీసులు
- మండల వ్యాప్తంగా 74.19 శాతం
- అత్యధికంగా కుదునూరు 91.8 2 శాతం పోలు
- అత్యల్పంగా చెర్ల 71వ పోలింగ్ బూత్‌లో 58.04 శాతం

నవతెలంగాణ-చెర్ల

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఉన్న 36 పోలింగ్ కేంద్రాలలో 3,2079 మంది ఓటర్లకు గాను 23, 795 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 74.19 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా అత్యధికంగా కుదునూరు పోలింగ్ కేంద్రంలో ఓట్లు పోలయ్యాయి. అక్కడ 1137 మంది ఓటర్లు ఉండగా 1044 నంది ఓటర్లు అత్యధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు ఈ పోలింగ్ కేంద్రంలో 91.8 2 శాతం ఓట్లు పోలయ్యాయి. అత్యల్పంగా చెర్ల 73వ పోలింగ్ కేంద్రంలో పోలవగా అక్కడ మొత్తం ఓటర్లు 1101 ఓటర్లు ఉండగా కేవలం 639 మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ 58.04 శాతం ఓట్లు పోలయ్యాయి. అత్యంత సమస్యాత్మకమైన వుంజుపల్లి పోలింగ్ బూత్ లో 82.34 శాతం ఓట్లు పోలవగా పెద్ద మిడిసి లేరు పోలింగ్ కేంద్రం 1లో 74.67 శాతం ఓట్లు పోలయ్యాయి. అత్యంత సమస్యాత్మకమైన తిప్పాపురం పోలింగ్ కేంద్రంలో సైతం 67.97 శాతం ఓట్లు పోలయ్యాయి. 1377 మంది ఓటర్లు ఉండగా 936 మంది ఓటర్లు తమ తమ ఓటు హక్కును సద్వినియోగపరుచుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేటట్లు పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది.



ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఏఎస్పీ

ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు ఏఎస్పి పరితోష్ పంకజ్ ఓఎస్డీ సాయి మనోహర్ మండలంలోని అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలలో గట్టి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేశారు. ఉదయం ఏడు గంటల నుంచే గిరిజనులు ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.



ఓటు వేసేందుకు ఐదు కిలో మీటర్ల నుంచి నడిచి వస్తున్న ఆదివాసీలు

గిరిజనులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం అరణ్య మార్గం గుండా సుమారు ఐదు నుండి ఆరు కిలోమీటర్లు నడిచి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను ఏఎస్పి పరితోష్ పంకజ్ ఓఎస్డి సాయి మనోహర్, సీఐ రాజు వర్మ ఎస్ఐలు నర్సారెడ్డి, ఆర్‌వి సూరి తమ సిబ్బందితో సందర్శించి ప్రజల ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పర్యవేక్షిస్తూ చక్కటి సమన్వయంతో పార్లమెంట్ ఎన్నికలను విజయవంతం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో ఇటు పోలీసులు, ఇతర అధికారులందరూ కూడా ఊపిరి పీల్చుకున్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న తాళ్ళూరి

నవతెలంగాణ-బూర్గంపాడు



తాళ్ళూరి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు తాళ్ళూరి పంచాక్షరయ్య పార్లమెంటు ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బూర్గంపాడు మండలం ఇరవెండి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. ప్రతీఒకరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరవెండి మాజీ ఎంపీటీసీ సభ్యుడు వల్లూరిపల్లి వంశీకృష్ణ, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన పోలింగ్ అధికారి భౌతికకాయాన్ని సందర్శించిన పుల్లయ్య

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఎన్నికల విధులు నిర్వహిస్తూ మృతి చెందిన శ్రీక్రిష్ణ భౌతిక కాయాన్ని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.పుల్లయ్య సందర్శించారు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే సామాజిక ఆరోగ్య కేంద్రం చేరుకుని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తుమ్మ రాంబాబు ఉన్నారు.

మొరాయించిన ఈవీఎంలు

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలోని జేబీఎస్ ఉన్నత పాఠశాలలో 95, 98, 115 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ఈవీయంలు మొరాయించాయి. ఎక్కువసేపు నిలబడలేక వచ్చిన ఓటర్లు తిరుగు ముఖం పట్టారు. అనంతరం అధికారులు ఈవీఎంలను సరిచేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మండలంలో 78.52% పోలింగ్

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



మండలంలో స్త్రీలు 4511 మంది ఓటర్లు, పురుషులు 4491మంది ఓటర్లు మొత్తం కలిపి ఓటర్ల సంఖ్య 9002 మంది ఉండగా సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలు 3541 మంది ఓటర్లు, పురుషులు 3500 మంది ఓటర్లు మొత్తం పోలైన ఓట్లు 7069 మంది ఓట్లు వేశారు. అలాగే ఈడీసీ 28 ఓట్లతో కలిపి పోలింగ్ శాతం 78.52%గా నమోదైంది. అదేవిధంగా మండలంలో ఎన్నికల నేపథ్యంలో అనారోగ్యంతో బాధపడే ఓటర్లు, వృద్ధులు, వికలాంగులు పోలింగ్ కేంద్రాల్లో నానా అవస్థలు పడ్డారు. రాయిగూడెం గ్రామం ప్రజలు ఓటు వేయడానికి కాలిబాటన సుమారు 5 కిలో మీటర్ల దూరం నుంచి కిన్నెరసాని వాగు దాటి వచ్చి ఓట్లేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో పాటు ఎన్నికల సుమాచారం ఇవ్వడంలో వివిధ పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక అధికారులుగా విధులు నిర్వహిస్తున్న స్థానిక కార్యదర్శులు పోలింగ్ రిపోర్ట్ విధుల పట్ల బాధ్యత లేకుండా తప్పుడు సమాచారం, జాప్యం చేయడం, మరికొందరు విధుల్లో లేకుండా వేరొకరిని విధుల్లో ఉంచారు. ఏది ఏమైనా ఎన్నికల అధికారులు తమ విధులు నిర్వహించడంలో నిర్లక్షం స్పష్టంగా కనిపించింది. అలాగే పలు అధికార పార్టీలు ఓటుకు 100 నుంచి 200లు, మరికొన్ని పొత్తులో ఉన్న పార్టీలు సైతం కాంగ్రెస్ పార్టీకి వేయకుండా క్రాస్ ఓటింగ్ జరిగిందని ఓటర్లు బాహాటంగా చర్చించుకుంటున్నారు.

వైరాలో ఓటు వేసిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా నియోజకవర్గ కేంద్రం బాలుర ఉన్నత పాఠశాలలోని 201 మోడల్ పోలింగ్ కేంద్రంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ దంపతులు మరో పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్

నవతెలంగాణ-పాల్వంచ



కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని పాఠశాల, పాల్వంచ మండలం, సిల్ క్యాంపస్, నవభారత్ ఎదురుగా 72 పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అలా వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం పెద్ద ఏర్పాట్లను, అందుబాటులో ఉన్న సదుపాయంలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైనదని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఓటు హక్కు వేసుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే సమయం ఉన్నదని, ఓటర్లు సమయం మించిపోయే వరకు వేచి ఉండకుండా ముందస్తుగానే పోలింగ్ కేంద్రాలకు విచ్చేసి వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

75 శాతం పోలింగ్ నమోదు

- రెండు పోలింగ్ కేంద్రాల్లో కొద్దిసేపు మొరాయించిన ఈవీఎంలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం





మండలంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు పోలీస్ నిఘా నీడన ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియ సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. ఓటర్లు ఎండ తీవ్రత దృశ్య ఉదయం నుండే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. లక్ష్మీనగరం 114వ పోలింగ్ బూత్ వద్ద ఏర్పాటు చేసిన ఈవీఎం యంత్రం మాక్ పోలింగ్ అనంతరం మొరాయించడంతో ఉదయాన్నే ఓటు వేసేందుకు వచ్చిన కొంతమంది ఓటర్లు వెనుతిరిగి వెళ్లారు. పోలింగ్ సిబ్బంది వెంటనే మరొక ఈవీఎం యంత్రాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో ఓటింగ్ ప్రక్రియ తిరిగి యధావిధిగా కొనసాగింది. దీంతోపాటు కొత్తపల్లిలో 130 పోలింగ్ బూత్ వద్ద ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో సుమారు 20 నిమిషాల పాటు ఈవీఎం యంత్రం మొరాయించడంతో వెంటనే టెక్నీషియన్ మరమ్మతుల నిర్వహించి అందుబాటులోకి తీసుకురావడంతో ఓటింగ్ ప్రక్రియ యధావిధిగా కొనసాగింది. మండల వ్యాప్తంగా ఓటర్లు యువత స్వచ్ఛందంగా ఓట్లు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండలంలో అత్యధికంగా కొత్త ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిరిగుండం వలస ఆదివాసీ గ్రామానికి చెందిన గిరిజన మహిళలు ఓటు వేసేందుకు చిన్నపిల్లలతో ఎర్రటి ఎండలను సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దుమ్ముగూడెం గ్రామంలో ఏర్పాటుచేసిన ఆదర్శ మహిళ పోలింగ్ కేంద్రం వద్ద అత్యధికంగా మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 40 పోలింగ్ కేంద్రాలు కాగా వీటిలో 35 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలు అయినటువంటి పైడిగూడెం, కొత్తపల్లితో పాటు పలు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక సీఆర్పిఎఫ్ బలగాలతో సీఐ బొడ్డు అశోక్ కుమార్, ఎస్సైలు కేశవరావు, గణేష్‌ల ఆధ్వర్యంలో పోలీసులు ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మండలంలో 75 శాతం పోలింగ్ నమోదయింది. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకుగాను అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.చంద్ర శేఖర్ పర్యవేక్షణలో సెక్టోరియల్ అధికారులు, రూటు అధికారులు, పోలింగ్ ఆఫీసర్స్, ఎన్నికల సిబ్బంది ఈవీఎం యంత్రాలను సురక్షితంగా తరలించేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులతో పాటు ఎన్నికల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.



నియోజకవర్గంలో రఘురాంరెడ్డికి భారీ మెజార్టీ

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం నియోజక వర్గం, చుంచుపల్లి మండల పరిధిలోని విద్యానగర్ ఈకే విద్యాలయంలో ఏర్పాటుచేసి పోలింగ్ బూత్‌లో కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తన ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి ఉన్నతపాఠశాలలో ఓటు వేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ... కొత్తగూడెం నియోజకవర్గంలో తాజా, మాజీ ప్రభుత్వాలైన బీఆర్ఎస్, బీజేపీ తరుపున పోటీ చేసిన అభ్యర్థులకు డిపాజిట్ రావడం కూడా అనుమానమేనన్నారు. చివరిక్షణాల్లో అభ్యర్థులు పోటీనుంచి తప్పుకున్న వాతావరణం కనిపించిందన్నారు. సీపీఐ, సీపీఐ(ఎం), టీజెఎస్ మద్దతుతో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి (ఆర్ఆర్ఆర్)కు భారీ మెజార్టీ రావడం ఖాయమని పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని పలు బూతులు సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. కమ్యూనిస్టు, కాంగ్రెస్ కలయికను ఆదరించి ఓట్లు వేసిన ప్రజలకు, ప్రచారంరంలో పాల్గొన్న మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. కూనంనేని, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషాతోపాటు నాయకులూ ముత్యాల విశ్వనాధం, చంద్రగిరి శ్రీనివాసరావు, దుర్గరాసి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, వి.పూర్ణచందర్ రావు, ఏ.సాయిబాబు, భూక్యా దస్రు తదితరులు వున్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

నవతెలంగాణ-దమ్మపేట







మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ కాస్త నెమ్మదిగా ప్రారంభమైనప్పటికీ క్రమేపి పుంజుకుంది. ఎన్నికల అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. ఓటర్లు క్యూలైన్‌లో పోలింగ్ బూత్‌ల వద్ద నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ మండల పరిదిలోని గంగుడులపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు తాటిసుబ్బన్నగూడెం పంచాయతీ నాయుడుపేట ప్రైమరీ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకోగా, తాటి వెంకటేశ్వర్లు మండల పరిధిలోని మందలపల్లి ప్రాధమిక పాఠశాలలో ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకున్నారు. ఇదిలా ఉండగా గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో శతాధిక వృద్ధురాలు దాసరోజు లక్ష్మీనర్సమ్మ పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేశారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కలెక్టరైతే నాకేంటి..!?

దమ్మపేటలో కానిస్టేబుల్ హల్‌చల్

నవతెలంగాణ-దమ్మపేట

కలెక్టరైతే నాకేంటి అని కలెక్టర్ అనుమతిస్తే డ్యూటీలో ఉండేది తామే అని ఎవరి మాటను లెక్కచేయాల్సిన అవసరం తనకు లేదని దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో మొబైల్ పోలిసింగ్ టీమ్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వ్యాఖ్యానించిన కీలకమూటలివి. వివరాల్లోకి వెళితే... సోమవారం జరిగిన సార్వత్రిక పార్లమెంట్ ఎన్నికల్లో దమ్మపేట జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద జరుగుతున్న ఓటింగ్ ప్రక్రియ దానికి సంబంధించిన ఫొటోలు సమాచారం నిమిత్తం దమ్మపేట పాత్రికేయ బృందం పోలింగ్ బూత్ కాంపౌండ్‌లోకి వెళ్ళబోతుండగా వీరబాబు అనే కానిస్టేబుల్ కాంపౌండ్‌లోకి వెళ్ళకుండా అడ్డుకున్నారు. ఇదేమిటని తమకు ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టర్ పాసులు జారీ చేశారని ఆ పాసులు పాత్రికేయులు చూపించినప్పటికీ వాటిని చూడకుండా నిబంధనలకు విరుద్ధంగా హల్‌చల్ చేస్తూ జిల్లా కలెక్టరైతే తనకేంటి తాము ఎవరిని లెక్క చేయాల్సిన అవసరం లేదని తనకు తమ ఎస్ఐ కఠిన ఆదేశాలు జారీ చేశారని ఊగిపోతూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ భిగ్గరగా అరుస్తూ పాత్రికేయులపై కానిస్టేబుల్ చేయి వేయిబోయే ప్రయత్నం చేశాడు. ఈక్రమంలో పాత్రికేయులు అవసరమైతే దమ్మపేట ఆర్ఓ తహశీల్దార్‌తో మాట్లాడాలని తహశీల్దార్‌కు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని పాత్రికేయులు తహశీల్దార్‌కు దృష్టికి తీసుకువెళ్ళగా తహశీల్దార్ ఆ కానిస్టేబుల్‌తో తాను మాట్లాడతానని ఫోన్ ఇవ్వాల్సిందిగా తహశీల్దార్ పాత్రికేయులకు సూచించారు. దీంతో పాత్రికేయులు కానిస్టేబుల్ వీరబాబుకు ఫోన్ ఇవ్వబోతుండగా తాను కలెక్టర్‌నే లెక్క చేయనప్పుడు తహశీల్దార్‌ను నేనెందుకు లెక్కచేస్తానని నేను ఆయనతో మాట్లాడటానికి సుముఖంగా లేనని ఫోన్‌ను తిరష్కరించారు. తాను ఎవరితోనూ మాట్లాడేది లేదని ఎస్ఐతో కూడా తాను మాట్లాడనని దురుసుగా చెప్పడంతో పాత్రికేయులకు అనుమానం కలిగి కానిస్టేబుల్ వీరబాబు వంటిపై ఉన్న యూనిఫామ్‌పై ఉండే నేమ్‌బోర్డును పరిశీలిస్తుండగా జేబుపై ఉన్న నేమ్ బోర్డును చింపుకొని జేబులో ఎట్టుకొని అక్కడ నుండి ఆటో ఎక్కి పరారయ్యాడు. ఈ విషయాన్ని పాత్రికేయులు తహశీల్దార్ సిహెచ్ నరేష్, దమ్మపేట ఎస్ఐ బి.సాయికిషోర్ రెడ్డికి ఫోన్‌లో వివరించగా తాము తగిన చర్యలు తీసుకుంటామని పాత్రికేయులందరూ ఎన్నికల సమయంలో తమకు సహకరించాలని కోరారు. కానిస్టేబుల్‌ను పాత్రికేయులతో తీవ్ర వాగ్వివాదం పెట్టుకుంటున్న సమయంలో పాత్రికేయులు ఫోటోలు తీయబోతుండగా వీరబాబు పాత్రికేయుల ఫోన్‌లను లాక్కోవడానికి ప్రయత్నించడం కొసమెరుపు.

ప్రశాంతంగా పోలింగ్



నవతెలంగాణ-బోనకల్



బోనకల్ మండల వ్యాప్తంగా ఆళ్లపాడు గ్రామం మినహా అన్ని గ్రామాలలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల మధ్య ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ప్రధానంగా మహిళలు, యువత ఉదయమే పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా వికలాంగులను, వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తరలించారు. బోనకల్ మండల వ్యాప్తంగా 36,005 ఓట్లు ఉన్నాయి. మండల వ్యాప్తంగా 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకల్లా 18 శాతం 11 గంటలకు 34 శాతం నమోదైనట్లు మండల సెక్టార్ ఆఫీసర్ అనిశెట్టి పున్నం చందర్ తెలిపారు. మండల వ్యాప్తంగా 84 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. రావినూతల, బోనకల్, ముష్టికుంట్ల పోలింగ్ కేంద్రాలను బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు సందర్శించారు. ముష్టికుంట్ల పోలింగ్ కేంద్రాన్ని ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామ సహాయం రఘురామిరెడ్డి సందర్శించారు.

నేలకొండపల్లి : మండలంలో 78 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా 48 వేల 478 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 23,329 మంది పురుషులు కాగా 25,148 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మండల వ్యాప్తంగా 59 పోలింగ్ కేంద్రాలకు గాను 512 మంది అధికారులు ఎన్నికల విధులకు హాజరయ్యారు. మండలంలోని కొన్ని గ్రామాలలో ఆయా పార్టీల కార్యకర్తల మధ్య చిన్నపాటి వివాదాలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగియడం పట్ల ఎన్నికల అధికారులు సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన గువ్వలగూడెం, ముజ్జుగూడెంలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను ఏర్పాటుచేసి తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మండలంలోని నేలకొండపల్లి, కొత్త కొత్తూరు, నాచేపల్లి, మంగాపురంతండా, చెన్నారం, రాజేశ్వరపురం తదితర గ్రామాల్లో జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాయల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి వేర్వేరుగా సందర్శించి పోలింగ్ సరళిని ఆ పార్టీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు సోదరుడు నామ కృష్ణయ్య మండలంలోని నేలకొండపల్లి, భైరవునిపల్లి, గ్రామాలలో జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళని అడిగి తెలుసుకున్నారు. రాజేశ్వరపురం, నేలకొండపల్లి గ్రామాలలో పోలింగ్ బూత్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను ఖమ్మంరూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి సందర్శించి పరిశీలించారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కేంద్రాలలో ఉన్న ఓటర్లకు మాత్రమే అధికారులు ఓటింగ్‌కు అనుమతించారు. ఎన్నికల సందర్భంగా గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కూసుమంచి : పార్లమెంట్ ఎన్నిక నేపథ్యంలో ప్రజల ఆరోగ్య విషయంలో 47 పోలింగ్ స్టేషన్లో మరియు 67 పోలింగ్ బూత్ కేంద్రాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సోమవారం డాక్టర్ కిషోర్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రథమ చికిత్స కేంద్రానికి ఒక ఏఎన్ఎం ఒక ఆశను ఏర్పాటు చేయడం జరిగింది. 98 మంది వైద్య సిబ్బందిని నియమించడం జరిగింది. వీరి పర్యవేక్షణకు 6 గురు హెల్త్ సూపర్వైజర్‌ను నియమించడం జరిగింది. వీరందరికీ డాక్టర్ కిషోర్ కుమార్ పర్యవేక్షణతో పాటు అన్ని విధాల సహాయ, సహకారాలను అందిస్తూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆరోగ్య విషయంలో అందరికీ సేవలందిస్తూ, తమ విధులను సక్రమంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషోర్ కుమార్, సిహెచ్ఓ ఎండి వలీవుద్దీన్, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్లూరు: మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో సోమవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ, నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొంగులేటి ప్రసాద్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదే గ్రామానికి చెందిన బిజెపి జాతీయ నాయకులు, తమిళనాడు, కర్ణాటక ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి, ఆయన కుమార్తె శ్రీయ రెడ్డి, సోదరుడు పొంగులేటి మహేందర్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు, ఎర్రబోయినపల్లి గ్రామంలో ఎంపీపీ బీరవల్లి రఘు, పోచవరం గ్రామంలో జడ్పిటిసి కట్ట అజయ్ కుమార్, ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కూసుమంచి: పార్లమెంట్ 17వ ఎన్నికల సందర్భంగా సోమవారం మండల వ్యాప్తంగా 85.7 శాతం ఓటింగ్ నమోదు అయినట్టు ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగాయి.

పాలేరు ఆదర్శ మహిళ పోలింగ్ కేంద్రం...

మండలంలోని పాలేరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రంగా అధికారులు తీర్చిదిద్దారు ప్రత్యేకమైన ఏర్పాటతో ఆకర్షణంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాన్ని పువ్వులతో, తోరణాలతో సుందరంగా అలంకరించారు. మొదటగా వచ్చిన ఓటర్లను పూలతో స్వాగతం పలికి, ఓటింగ్‌ను ప్రారంభించారు.

సత్తుపల్లి : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో ఉన్న 294 బూత్‌ల పరిధిలో పోలింగ్ 80.27శాతం నమోదైంది. 327మంది పోలింగ్ ఆఫీసర్లు, మరో 327మంది సహాయక పోలింగ్ ఆఫీసర్లు, 734 మంది ఓపీవోలు, 23 మంది మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొన్నారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.రాజేందర్, ఎన్నికల అబ్జర్వర్ సంజయ్ జి కోల్ట్ పర్యవేక్షణలో పోలింగ్ విజయవంతంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఏసీపీ అనిశెట్టి పర్యవేక్షణలో 400 మంది పోలీస్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు విధులు నిర్వర్తించారు.

ఓటేసిన తాజా, మాజీ ఎమ్మెల్యేలు

పార్లమెంట్ ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాతసెంటరు యూపీఎస్‌లో తమ ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తన ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకున్నారు.

కొణిజర్ల: మండలంలో సాయంత్రం ఐదు గంటల వరకు 80శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పల్లిపాడు, తీగలబంజర, అంజనాపురంలోని పోలింగ్ కేంద్రాల్లో ఈవిఎంలు అరగంట పాటు మొరాయించాయి. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, కాంగ్రెస్ అభ్యర్థి ఆర్ఆర్ఆర్ పరిశీలించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

ఎర్రుపాలెం : మండలంలో మొత్తం 39,978 ఓట్లకుగాను 32,498 ఓట్లు పోలైనట్లు 81.18% ఓటింగ్ నమోదైందని తహశీల్దార్ మన్నే ఉషా శారద తెలిపారు. మండలంలో గత అసెంబ్లీ ఎన్నికలలో జరిగిన విధంగానే పోలింగ్ నమోదయింది. నరసింహాపురం గ్రామంలోని ఈవీఎం పనిచేయకుండా మొరాయించడంతో ఆ గ్రామంలో ఓటింగ్ సుమారు 30 నిమిషాల నుండి 45 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభించారు.

కల్లూరు : సాయంత్రం ఏడు గంటల వరకు అందిన సమాచారం ప్రకారం మండలంలో 70 శాతానికి పైగా పోలింగ్ జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఎస్ఐ షాకీర్ ఆధ్వర్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తల్లాడ : మండలంలో సోమవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 81 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కామేపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో మహబూబాబాద్ పార్లమెంటరీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మండల వ్యాప్తంగా 35,153 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా 26,429 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 75 శాతం పోలింగ్ పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు.









బిజినెస్

భారత్‌కు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దెబ్బ

- ఎగుమతుల కంటే దిగుమతుల వృద్ధి ఎక్కువ
- విదేశీ సరకుల రాకలో 38 శాతం పెరుగుదల
- ఎగుమతుల్లో మాత్రం 14 శాతం వృద్ధి



న్యూఢిల్లీ : స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు భారత ఆర్థిక వ్యవస్థకు ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఎగుమతుల్లో వృద్ధి తక్కువగా ఉండగా.. మరోవైపు ఇబ్బడిముబ్బడిగా దిగుమతులు పెరిగాయి. గడిచిన ఐదేళ్లలో ఎగుమతుల వృద్ధి కంటే దిగుమతులు రెట్టింపు అయ్యాయి. గడిచిన 2019-24 ఆర్థిక సంవత్సరాల్లో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) భాగస్వామ్య దేశాల నుండి భారత్‌కు వస్తు దిగుమతులు 38 శాతం పెరిగాయి. భారత్‌తో ఎఫ్‌టిఎ కలిగిన యుఎఇ, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, జపాన్ తదితర దేశాల నుంచి 2023-24లో 187.92 బిలియన్ డాలర్ల దిగుమతులు జరిగాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జిటిఆర్ఐ) సంస్థ వెల్లడించింది. 2018-19 నాటికి ఈ దిగుమతులు 136.20 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. మరోవైపు ఎఫ్‌టిఎ భాగస్వామ్య దేశాలకు భారత ఎగుమతులు 2023-24లో 14.48 శాతం మాత్రమే పెరిగి 122.72 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2018-19లో 107.20 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. ఈ పరిణామాలతో మోడీ హయంలోని బిజెపి సర్కార్ పలు దేశాలతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టిఎ) ఆర్థిక వ్యవస్థకు చేటు చేస్తున్నాయని స్పష్టమవుతోంది.

జిటిఆర్ఐ రిపోర్ట్ ప్రకారం.. 2023-24లో యుఎఇకి ఎగుమతులు 18.25 శాతం పెరిగి 35.63 బిలియన్లుగా నమోదయ్యాయి. ఇవి 2018-19లో 30.13 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. కాగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో దిగుమతులు 2018-19లో 29.79 బిలియన్లుగా ఉండగా.. 2023-24లో 61.21 శాతం ఎగిసి 48.02 బిలియన్లకు చేరాయి. యుఎఇతో 2022లో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఆస్ట్రేలియాతో 2022 డిసెంబర్‌లో ఒప్పందం కుదిరింది. ఆ దేశానికి 2018-19లో 3.52 బిలియన్ డాలర్ల ఎగుమతులు ఉండగా.. 2023-24లో 7.94 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. అదే సమయంలో దిగుమతులు 13.13 బిలియన్లుగా ఉండగా.. 23.06 శాతం పెరిగి 16.16 బిలియన్లగా నమోదయ్యాయి. ఆగ్నేయాసియా 10 దేశాల కూటమి ఆసియన్ బ్లాక్‌కు 2018-19లో 37.47 బిలియన్ల ఎగుమతులు జరగ్గా.. గత ఆర్థిక సంవత్సరంలో సుమారు 10 శాతం పెరిగి 41.21 బిలియన్లకు చేరుకున్నాయి. దిగుమతులు 34.3 శాతం పెరిగి 59.32 బిలియన్ డాలర్ల నుంచి 79.67 బిలియన్ డాలర్లకు చేరాయి. గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో దక్షిణ కొరియాకు భారత ఎగుమతులు 36.38 శాతం పెరిగి 4.71 బిలియన్ల నుండి 6.42 బిలియన్లకు చేరాయి. దిగుమతులు 26.12 శాతం పెరిగి 16.76 బిలియన్ల నుండి 21.14 బిలియన్లకు చేరుకున్నాయి. భారత్- దక్షిణ కొరియా మధ్య 2011లో ఎఫ్‌టిఎ అమల్లోకి వచ్చింది. జపాన్‌కు ఎగుమతులు 6.06 శాతం స్వల్పంగా పెరిగాయి. 2018-19లో 4.86 బిలియన్లుగా ఉండగా.. 2023-24లో 5.16 బిలియన్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 38.56 శాతం పెరిగి 12.77 బిలియన్ల నుండి 17.70 బిలియన్లకు చేరుకున్నాయి. భారతదేశం-జపాన్ ఎఫ్‌టిఎ 2011లో అమలు చేయబడింది. "ఈ గణంకాలు భారతదేశ ఎఫ్‌టిఎ గ్లోబల్ వాణిజ్య తీరుతెన్నులను ప్రదర్శిస్తుంది." అని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ డేటా పేర్కొంది.

ఎగుమతుల్లో 17వ స్థానం..

ప్రపంచ వాణిజ్యంలో స్థూల ఎగుమతుల్లో 1.8 శాతం వాటాతో భారత్ 17వ స్థానంలో ఉంది. అత్యధిక దిగుమతుల విషయంలో ప్రపంచ వాణిజ్యంలో 2.8 శాతం వాటాతో 8వ స్థానంలో ఉంది. 2023-24లో భారతదేశ స్థూల సరుకుల ఎగుమతులు 3.11 శాతం తగ్గి 437.1 బిలియన్ డాలర్లకు చేరుకోగా.. దిగుమతులు 5.4 శాతం తగ్గి 677.2 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి.

కింగ్స్ కార్నర్‌స్టోన్ కాలేజీతో ఆర్‌ఎంఐటీ వర్సిటీ జట్టు

హైదరాబాద్ : కింగ్స్ కార్నర్‌స్టోన్ ఇంటర్నేషనల్ కాలేజీతో ఆర్‌ఎంఐటి వర్సిటీ భాగస్వామ్యం చేసుకున్నట్లు ఇరు సంస్థలు తెలిపాయి. ఈ సందర్భంగా ఆ విద్యా సంస్థల ప్రతినిధులు ప్రొఫెసర్ అభిజిత్ మణి, నికోల్ ఆర్విన్, ప్రొఫెసర్ రాజారామన్ ఏరి ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు తమ ఉన్నత విద్యా ప్రయాణం కోసం భారతదేశం నుండి ఆస్ట్రేలియాకు సజావుగా వెళ్లడానికి వీలు కల్పిస్తున్నామన్నారు. రెండు సంస్థలు ఢిల్లీలోని ఆస్ట్రేలియన్ హైకమిషన్‌లో 2016లో ఆస్ట్రేలియన్ బదిలీ కార్యక్రమానికి సహకరించడానికి ఒక ఒప్పందంపై సంతకం చేశాయన్నారు. విద్యార్థులకు అసమానమైన విద్యావకాశాలను అందించే లక్ష్యంతో ఈ ప్రోగ్రామ్‌ను అభివృద్ధి చేశామన్నారు. విద్యాపరంగా వృత్తిపరంగా విద్యార్థుల విజయాన్ని పెంపొందించడంలో ఆర్‌ఎంఐటి నిబద్ధత కలిగి ఉందన్నారు.

హిమాయత్‌నగర్‌లో వీఎల్‌సీసీ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు

హైదరాబాద్ : వెల్నెస్ అండ్ బ్యూటీ సేవల సంస్థ విఎల్‌సిసి హిమాయత్ నగర్లో తన నూతన కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. శాశ్వత కొవ్వు తగ్గింపు కోసం విప్లవాత్మక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక యాంటీ ఏజింగ్ స్కిన్ లేజర్ చికిత్సలు, కండరాల టోనింగ్, బిల్డింగ్ కోసం అధునాతన యంత్రాలతో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ సెంటర్‌లో నిపుణులచే సమగ్ర వెల్ నెస్ సొల్యూషన్స్, కూల్ ట్రిమ్, ఎం టోన్, ఇతర సృజనాత్మక కొవ్వు నష్ట పరిష్కారాలను అందిస్తుందని వెల్లడించింది.

జొమాటోకు రూ.175 కోట్ల లాభాలు

ముంబయి : ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.175 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.188 కోట్ల నష్టాలు చవి చూసింది. గడిచిన త్రైమాసికంలో సంస్థ ఫుడ్ డెలివరీ వ్యాపారం స్థూల ఆర్డర్ విలువ (జిఒవి) 28 శాతం పెరిగి రూ.8,439 కోట్లుగా నమోదయ్యింది. కాగా.. 2023-24లో మొత్తంగా రూ.351 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం 2022-23లో రూ.971 కోట్ల నష్టాలు నమోదు చేసింది. గడిచిన మార్చి త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ రూ.3,562 కోట్లకు చేరింది. 2022-23 ఇదే త్రైమాసికంలో రూ.2,056 కోట్లుగా ఉంది.

ఏపీలో రీపోలింగ్ అవసరం లేదు

- ఊహించిన దానికంటే ఓటింగ్ పెరిగింది : సీఈఓ ముకేశ్ కుమార్‌మీనా

అమరావతి : ఏపీలో రీ పోలింగ్ అవసరం లేదని సీఈఓ ముకేశ్ కుమార్‌మీనా అన్నారు. సచివాలయం మీడియా పాయింట్‌లో సోమవారం సాయంత్రం ఆరుగుంటల తరువాత ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతపురం, తెనాలి, మాచర్ల ఘటనల్లో అభ్యర్థులను హౌస్ అరెస్ట్ చేశామని చెప్పారు. పుంగనూరుల సంఘటనలో నిందితులను వదిలేసిన ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిందని, ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నా మని చెప్పారు. ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా 46,389 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగిందని, ఊహించినదానికంటే ఎక్కువ మంది ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చారన్నారు. ఫిర్యాదులపై మంగళవారం ఆర్ఓలు, పర్యవేక్షకులు సమీక్షిస్తారని సిఇఓ తెలిపారు. సాయంత్రం 5గంటలకు 68.04శాతం పోలింగ్ జరిగిందన్నారు. 275 బ్యాలెట్, 217 కంట్రోల్ యూనిట్‌లు, 600 వివిప్యాడ్‌ల సమస్య వచ్చిందన్నారు. మాచర్లలో 8 కేంద్రాల్లో యంత్రాలు మార్చి మళ్లీ పోలింగ్ నిర్వహించామని సీఈఓ తెలిపారు.

లౌకికవాదంపై చిన్నచూపు

- మోడీ పాలనలో మైనారిటీలపై అడుగడుగునా వివక్ష
- విద్వేష ప్రసంగాలతో అర్థం లేని ఆరోపణలు
- సమాజంలోనూ స్పందన కరువు

న్యూఢిల్లీ : అత్యంత దుర్బలులకు వ్యతిరేకంగా శక్తివంతులైన వారు ప్రదర్శించే క్రూరత్వం, అన్యాయంపై ఆగ్రహం వ్యక్తం చేయడానికి ఫ్రాన్స్‌లో 'జె అక్యూజ్' (నేను ఆరోపిస్తున్నాను) అనే పదాన్ని వాడతారు. గూఢచర్యానికి పాల్పడుతున్నాడన్న ఆరోపణపై ఫ్రాన్స్‌లో ఆల్ఫ్రెడ్ డేఫస్ అనే సైనికాధికారిని ప్రభుత్వం దోషిగా నిర్ధారించింది. అయితే యూదు జాతీయుడైన డేఫస్‌ను అన్యాయంగా కేసులో ఇరికించి శిక్షించారని భావించిన జోలా అనే పాత్రికేయుడు అతనిని కాపాడేందుకు ఎంతో ప్రయత్నించాడు. ఈ ప్రయత్నంలో జోకాకు జైలు శిక్ష కూడా పడింది. అయితే ఇంగ్లండ్ పారిపోయిన జోలా, ఆ శిక్ష నుండి తప్పించుకోగలిగాడు. ఏదేమైనా అతని జోక్యం కారణంగానే చివరికి డేఫస్ నిర్దోషిగా బయటపడ్డాడు.



సమాజంలో స్పందన లేదు

ఒక వ్యక్తిపై అన్యాయంగా నేరం మోపితే, ప్రపంచవ్యాప్తంగా నిరసన వ్యక్తం కావడం ఇప్పుడు హాస్యాస్పదంగా అన్పించవచ్చు. ప్రపంచంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, దాష్టీకాలు, క్రూరత్వాలపై మానవ సమాజం ఏ మాత్రం స్పందించకపోవడంతో అది సున్నితత్వాన్ని కోల్పోయింది. పాలస్తీనాలో మారణహోమం జరుగుతుంటే సమాజం కేవలం సానుభూతి చూపిందే తప్ప ఆక్రమణదారులను నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఇప్పుడు మన దేశంలో జరుగుతున్నది ఏమిటి? సమాజం అణచివేతకు, వివక్షకు గురైనప్పుడు, ద్వేషాన్ని నింపుకున్న ఓ వ్యక్తి జారీ చేసే ఆజ్ఞలను పాటించేందుకు న్యాయ సాధనాలు సాగిలబడినప్పుడు మనలో కదలిక లేదు. మేధావులు తటస్థులుగా ఉండిపోయారు. దీనిని ఎవరైనా ప్రశ్నిస్తే సుదీర్ఘమైన నిర్బంధాలు తప్పడం లేదు. ప్రేమ యొక్క శక్తిని గురించి మహాత్మా గాంధీ మనకు బోధించారు. కానీ ప్రధాని మాత్రం ద్వేషం ఎంత శక్తివంతమైనదో మనకు చూపించారు.

లౌకికవాదంపై చులకన

మోడీ హిందుత్వను ఆచరిస్తారు. ఆ సిద్ధాంతం ముస్లిం, క్రైస్తవ వ్యతిరేకతను బోధిస్తుంది. మోడీ మాదిరిగా వీర్ సావర్కార్ కూడా ముస్లిం సమాజాన్ని ద్వేషించారు. వాజ్‌పేయి, అద్వానీ, మురళీ మనోహర్ జోషీ కూడా హిందుత్వ వాదులే. అయితే మోడీ వచ్చిన తర్వాత హిందుత్వను మరింత ముందుకు తెచ్చి దానిని జాతి మనస్తత్వానికి కేంద్రంగా మార్చేశారు. ఈ ప్రక్రియలో లౌకికవాదం, సమానత్వం, సోదరభావం పట్ల మన కట్టుబాటును నిర్వీర్యం చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత మోడీ ఏమన్నారంటే ...30 సంవత్సరాలుగా ఈ నాటకాన్ని మనం చూస్తూనే ఉన్నాం. లౌకికవాదం అనే ట్యాగ్ ధరించడం ఇప్పుడు ఫ్యాషన్ అయింది. ఈ ఎన్నికల్లో లౌకికవాద ముసుగు వేసుకొని దేశాన్ని మోసం చేసే దమ్ము ఏ ఒక్క పార్టీకీ లేదు. వారు ముసుగులు తీసేశారు...అని చెప్పారు. లౌకికవాదాన్ని ఓ నాటకంగా కొట్టిపారేయడం ద్వారా మన బహుళ సాంస్కృతిక తత్వానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాన్ని మోడీ అపహాస్యం చేశారు.

విద్వేష రాగం

పది సంవత్సరాల పాలనలో మోడీ విద్వేష రాగాన్నే ఆలపిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఈ ధోరణి మరింత మితిమీరింది. ముస్లింలను లక్ష్యంగా చేసుకొని అర్థం లేని ఆరోపణలు సంధిస్తున్నారు. వారిని చొరబాటుదారులుగా, అధిక సంతతికి జన్మనిచ్చే వారిగా తూలనాడుతున్నారు. మతపరమైన ముస్లిం తీవ్రవాదానికి కాంగ్రెస్ మద్దతు ఇస్తోందని మండిపడ్డారు. 'ఓట్ జిహాద్'కు తప్పుడు అర్థాన్ని ఇస్తున్నారు.

మైనారిటీలపై వివక్ష ఎందుకు?

మోడీ నోటి వెంట అనేక వైవిధ్యభరితమైన పదాలు వెలువడుతుంటాయి. ప్రజలను మభ్యపెట్టడానికి ఆయన అనేక తెలివైన పదాలు ప్రయోగిస్తుంటారు. ఉదాహరణకు లౌకికవాదంపై ఆయన ఏమన్నారో చూడండి...అందరికీ న్యాయం జరుగుతుంది తప్ప శాంతి లభించదు. అదే లౌకికవాదం. అది సంక్షేమ పథకాల సంకుచిత చట్రంలో చిక్కుకుపోయింది. ప్రభుత్వ పథకాలకు వివక్ష ఉండదు. కులం, మతం చూడకుండా అవి పంపిణీ అవుతాయి...ఇదీ లౌకికతత్వానికి ప్రధాని ఇచ్చిన నిర్వచనం. మరి అలాంటప్పుడు ముస్లిం మైనారిటీల విషయంలో వివక్ష చూపడం ఎందుకు? పౌరసత్వ సవరణ చట్టం అమలు ద్వారా కేంద్రం ముస్లింల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్న విషయం తెలిసిందే.

సమస్యలపై ఓటర్ల నిరసన

- పోలింగ్‌ను బహిష్కరించిన పలు గ్రామాల ప్రజలు
- చివరికి అధికారుల హామీతో విరమణ
- మైలారంలో ఓటేసిన ఆరుగురు
- మైనింగ్ తవ్వకాలను నిరసిస్తూ గ్రామస్తుల ఎన్నికల బహిష్కరణ



నవతెలంగాణ -బల్మూరు/ఇల్లందు/ఏన్కూర్

సమస్యలపై ఓటర్లు ఎక్కుపెట్టారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని, తాము పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకోవాలని ఎన్నోసార్లు విన్నవించుకున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆగ్రహించిన పలు గ్రామాల ప్రజలు సోమవారం పోలింగ్‌ను బహిష్కరించారు. దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడం లేదని ఓటింగ్ స్లిప్పులతో నిరసన తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు నచ్చచెప్పినా ససేమిరా అంగీకరించలేదు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో కొన్ని గ్రామాల ప్రజలు విరమించారు. మరికొన్నిచోట్ల ఆందోళనను విరమించినా కొంతమంది ఓటేసేందుకు ససేమిరా అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని మైలారం గ్రామంలోని 179 పోలింగ్ కేంద్రంలో ఆరుగురు ఓటర్లు మాత్రమే ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలను నిరసిస్తూ గత కొన్ని రోజులుగా ఎన్నికలను బహిష్కరిస్తామంటూ గ్రామస్తులు ఏకగ్రీవంగా పట్టుబట్టారు. అధికారులు నచ్చ చెప్పినప్పటికీ ఓటింగ్ రోజు ఎవరూ ఓటింగ్‌లో పాల్గొనకుండా ఇండ్లల్లోనే ఉండిపోయారు. 785 ఓటర్లకు గాను ఆరుగురు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారని పీఓ ఆంజనేయులు తెలిపారు. ఓటింగ్ ప్రారంభంలోనే ఆర్డీవో మాధవి డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు అక్కడికి వచ్చి గ్రామస్తులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరినప్పటికీ ఓటింగ్‌లో పాల్గొనలేదు. సాయంత్రం నాలుగున్నర ప్రాంతంలో ముగ్గురు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోగా.. ఐదు గంటల సమయంలో మరో ముగ్గురు వచ్చి ఓటు వేశారు. కొత్తూరు మండలంలోని కొడిచర్ల తండా గ్రామపంచాయతీ పరిధిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని, సరైన సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఓటు వేసే ప్రసక్తే లేదని ఆందోళన చేశారు. అధికారులు గ్రామస్తులకు నచ్చజెప్పడంతో ఓటు వేశారు.

సీసీ రోడ్లు.. డ్రయినేజీ లేదని ఓటింగ్ బహిష్కరణ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలంలోని లచ్చగూడెం బూత్ నెంబర్ 51, బూత్ నెంబర్ 52, కొమ్ముగూడెం గ్రామాల ప్రజలు ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రయినేజీలు, తాగు, సాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై గ్రామస్తులంతా చర్చించుకుని పార్లమెంట్ ఎన్నికలలో పోలింగ్‌ను బహిష్కరించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య గ్రామాలకు వెళ్లినచ్చ చెప్పారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కాశయ్య, తహసీల్దార్ రవికుమార్, సీఐ కరుణాకర్ గ్రామస్తులను కలుసుకొని సమస్యలపై చర్చించారు. గ్రామస్తులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు తప్పకుండా పరిష్కారం అవుతాయని ఓట్లు వేయకుండా బహిష్కరించడం సరికాదని అధికారులు నచ్చచెప్పారు. ఓటింగ్‌లో పాల్గొనాలని చేసిన విజ్ఞప్తితో గ్రామస్తులంతా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

ఎన్ఎస్పీ కాలువపై వంతెన నిర్మించలేదంటూ..

ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం రాయమాదారంలో గ్రామస్తులు పోలింగ్ బహిష్కరించారు. ఎన్ఎస్పీ కాలువపై వంతెన నిర్మించలేదంటూ పోలింగ్ బహిష్కరిస్తున్నట్టు చెప్పారు. ఎన్నో ఏండ్లుగా తాము వంతెన కోసం ఆందోళన చేస్తున్నామని అయినా ఎవరూ తమ గోడు పట్టించుకోవడం లేదని వాపోయారు. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి వచ్చి ఓటర్లకు నచ్చజెప్పడంతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం జగన్నాథ్ పూర్ పంచాయతీ బోరిగాంకు రహదారి సౌకర్యంలేదని ఎన్నికలను బహిష్కరించిన ఓటర్లు... నాయకులు, అధికారుల హామీతో ఓటింగ్‌లో పాల్గొన్నారు. కడెం మండలం అల్లంపల్లి, బజార్‌హత్నూర్ మండలం మాన్కా పూర్, దేగామ, ఇచ్చోడ మండలం బాబ్జీపేట, కాసిపేట మండలం వరిపేటలో గ్రామస్తులు పోలింగ్‌ను బహిష్కరించగా.. అధికారులు, ప్రజాప్రతినిధుల జోక్యంతో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తడిసిన ధాన్యం బస్తాలతో పోలింగ్‌కు..

భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం కనుముక్కలలో గ్రామస్తులు పోలింగ్‌ను బహిష్కరించారు. తడిసిన ధాన్యం బస్తాలతో పోలింగ్ కేంద్రానికి వచ్చిన రైతులు ధర్నాకు దిగారు. ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ ఇస్తేనే ఓటు వేస్తామని పోలింగ్ కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలింగ్ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రైతులకు అధికారులు నచ్చచెప్పి ధర్నాను విరమింపజేశారు.

ఓటర్లపై తేనెటీగల దాడి

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోని జేబీఎస్ ఉన్నత పాఠశాలలో 95, 98, 115 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. పాఠశాలలో పురాతన మర్రిచెట్లకు తేనెటీగల తుట్టెలు ఉన్నాయి. ఓటర్లు పోలింగ్ బూత్‌లోకి వస్తుండగా ఓటర్లపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఒక వృద్ధుడి కనురెప్పపై తీవ్రంగా కుట్టాయి. మరో ఐదుగురిని కూడా తేనెటీగలు కుట్టడంతో విపరీతంగా దద్దులు వచ్చాయి. పత్రికా విలేఖరి సలీం న్యూస్ కవరేజీ కోసం వెళ్లగా ఆయనను కందిరీగలు కుట్టాయి. విషయం తెలుసుకున్న రిటర్నింగ్ అధికారి కాశయ్య సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. బాధితులకు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందించారు. పోలింగ్ బూతులకు వెళ్లే దారిలో తేనెటీగల తుట్టెలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదని ఓటర్లు చెప్పారు. తేనెటీగలు కుట్టడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

ముంబయిలో పెను గాలుల బీభత్సం

భారీ హోర్డింగ్ కూలి ఎనిమిది మంది మృతి

- 60 మందికి పైగా గాయాలు
- ఆరే, అంధేరీ ఈస్ట్ మెట్రో స్టేషన్ల మధ్య మెట్రో సేవల నిలిపివేత

దాదర్ : ముంబయి, ఆ పరిసర ప్రాంతాల్లో ఈదురుగాలులు, వర్షాలు సోమవారం పెను బీభత్సం సృష్టించాయి. ఘట్‌కోపర్ ప్రాంతంలోని చెద్దానగర్ జంక్షన్ వద్ద వంద అడుగుల ఎత్తయిన భారీ హోర్డింగ్ కుప్పకూలి పక్కనే వున్న పెట్రోల్ బంకు, సమీపంలోని నివాసాలపై పడింది. దీంతో, ఎనిమిదిమంది ప్రాణాలు కోల్పోయారు. 60 మందికి పైగా గాయపడ్డారు. చాలామంది అక్కడ చిక్కుకోవడంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. దాదర్, కుర్లా, మాహిమ్, ఘట్కోపర్, ములుండ్, విక్రోలితోపాటు దక్షిణ ముంబైలోని అనేక ప్రాంతాల్లో వర్షంతోపాటు బలమైన గాలులు వీచాయి. థానే, అంబర్‌నాథ్, బద్లాపూర్, కళ్యాణ్ మరియు ఉల్హాస్‌నగర్‌లలో కూడా ఈదురు గాలులతో మోస్తరు వర్షాలు పడ్డాయి. హోర్డింగ్ కుప్పకూలిన ఘటనలో గాయపడిన అనేక మందిని ఆసుపత్రులకు తరలించి వైద్యసేవలందించినట్లు బృహన్ ముంబై అధికారులు తెలిపారు. మెట్రో, లోకల్ రైలు సేవలకు అంతరాయం కలిగింది. థానే, పాల్ఘర్, ముంబైలలో మెరుపులతో కూడిన ఉరుములు, మోస్తరు నుంచి తీవ్రమైన వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తూ భారత వాతావరణ విభాగం (ఐఎండి) "నౌకాస్ట్ హెచ్చరిక" జారీ చేసింది.

ముంబైలోని శ్రీ జీ టవర్, వడాలా (తూర్పు) సమీపంలో సాయంత్రం 4:22 గంటలకు బర్కత్ అలీ నాకాలోని ఒక మెటల్ స్టీల్ పార్కింగ్ కూలిపోయింది. శ్రీ జీ టవర్ దగ్గర ఉన్న మెటల్ స్టీల్ పార్కింగ్ మొత్తం కూలిపోయిందని, ఆ సమయంలో సమీపంలో ఉన్న దాదాపు 10 వాహనాలు సమీపంలోని రోడ్డు పక్కన నిలిపివేశారని అధికారులు తెలిపారు. ఒక వ్యక్తి కారులో చిక్కుకున్నాడని, అతనిని రక్షించేందుకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఈదురు గాలులతో అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాల కారణంగా మెయిన్‌లైన్, హార్బర్‌లైన్ సబర్బన్ సర్వీసులు నిర్ణీత సమయానికి ఆలస్యంగా నడుస్తున్నాయి. బలమైన గాలుల కారణంగా థానే, ములుండ్ స్టేషన్‌ల మధ్య ఉన్న ఓవర్‌హెడ్ పరికరాల స్తంభం వంగిపోవడంతో సెంట్రల్ రైల్వేలోని సబర్బన్ సర్వీసులు నిలిపివేసినట్లు సంబంధిత అధికారి తెలిపారు.థానే జిల్లాలోని కాల్వా, మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల చెట్లు కూలడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. నగరంలో ప్రతికూల వాతావరణం కారణంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దాదాపు 66 నిమిషాల పాటు విమాన కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసింది. 15 విమాన సర్వీసులను మళ్లించింది.

ఐదో దశలో అతివలు అంతంతే..

- మహిళా అభ్యర్థులు 12 శాతం మందే
- మొత్తం 695 మందిలో వారు 82 మంది : ఏడీఆర్



న్యూఢిల్లీ : ఈనెల 20న జరిగే ఐదో దశలో మొత్తం 695 మంది అభ్యర్థుల్లో 82 మంది మాత్రమే మహిళలు ఉన్నారని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫార్మ్స్ (ఏడీఆర్) తెలిపింది. ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం.. ప్రకారం ఐదో దశలో బరిలోకి దిగిన అభ్యర్థుల్లో కేవలం 12 శాతం మంది మహిళలు ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా కొనసాగుతున్నది. దాదాపు 23 శాతం మంది తమపై క్రిమినల్ కేసులను ప్రకటించుకున్నారనీ, 18 శాతం మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మొదటి దశ ఎన్నికలలో 135 (8 శాతం మంది) మహిళా అభ్యర్థులు పోటీ చేయగా, రెండో దశలో 100 (8 శాతం) మహిళా అభ్యర్థులు పోటీ చేశారు. అదేవిధంగా, మూడో దశ ఎన్నికలలో 123 (9 శాతం) మహిళా అభ్యర్థులు పోటీ చేయగా, నాలుగో దశలో 170 (10 శాతం) మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

అభ్యర్థులపై క్రిమినల్ కేసులు

ఐదో దశలో పరిశీలనలో ఉన్న 695 మంది అభ్యర్థులలో.. 18 శాతం మంది(122 మంది అభ్యర్థులు)పై హత్య, హత్యాయత్నం, మహిళలపై నేరాలు, ద్వేషపూరిత ప్రసంగాలతో సహా తీవ్రమైన క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పార్టీల వారీగా క్రిమినల్ కేసులను చూస్తే.. ప్రధాన పార్టీలలో ఏఐఎంఐఎం నుంచి నలుగురు అభ్యర్థులలో ఇద్దరు (50 శాతం), ఎస్పీ నుంచి 10 మంది అభ్యర్థులలో నలుగురు (40 శాతం), కాంగ్రెస్ నుంచి 18 మంది అభ్యర్థులలో ఏడుగురు (39 శాతం), శివసేన నుంచి ఆరుగురిలో ఇద్దరు (33 శాతం), బీజేపీ నుంచి నుంచి 40 మంది అభ్యర్థులలో 12 మంది (30 శాతం), తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నుంచి ఏడుగురిలో ఇద్దరు (29 శాతం), ఆర్జేడీ నుంచి నలుగురిలో ఒకరు (25 శాతం), శివసేన (యూబీటీ) నుంచి ఎనిమిది మందిలో ఒకరు (13 శాతం) తమపై తీవ్రమైన క్రిమినల్ కేసులు కలిగి ఉన్నారు. 29 మంది అభ్యర్థులు మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులను ప్రకటించారు. 29 మంది అభ్యర్థుల్లో ఒకరు లైంగికదాడికి సంబంధించిన అభియోగాలు (ఐపీసీ సెక్షన్ 376), 10 మంది తమపై ద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించిన కేసులను వెల్లడించారు.

ఒక్కో అభ్యర్థి సగటు ఆస్తి రూ.3.56 కోట్లు

33 శాతం మంది అభ్యర్థులు 'కోటీశ్వరులు' (రూ. 1 కోటి కంటే ఎక్కువ ఆస్తులు కలిగిన వారు)గా ఉన్నారు. ఒక్కో అభ్యర్థి సగటు ఆస్తి రూ.3.56 కోట్లుగా ఉన్నది. 47 శాతం మంది అభ్యర్థులు తమ అప్పులను ప్రకటించారు. కొంతమందికి పదుల కోట్ల రూపాయల వరకు అధిక రుణ భారం ఉండటం గమనార్హం. అయితే, అభ్యర్థుల విద్యార్హతలు ఆందోళన కలిగిస్తున్నాయి. 42 శాతం మంది 5 నుంచి 12వ తరగతి మధ్య విద్యార్హతలు కలిగి ఉన్నారు. కేవలం 50 శాతం మంది గ్రాడ్యుయేట్లు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉన్నారు. 26 మంది అభ్యర్థులు డిప్లొమా హోల్డర్లు, 20 మంది కేవలం అక్షరాస్యులు, ఐదుగురు నిరక్షరాస్యులు కావటం గమనార్హం.

నాల్గో విడత పోలింగ్ 62శాతానికి పైనే..

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 96 నియోజకవర్గాల్లో సోమవారం జరిగిన నాల్గవ విడత పోలింగ్‌లో 62శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 75.91శాతం పోలింగ్ నమోదు కాగా, తర్వాత స్థానంలో మధ్య ప్రదేశ్ (68.48) వుంది. జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్రలు వరుసగా 36.58శాతం, 52.63శాతాలతో వెనుకబడ్డాయి. ఇక ఇతర రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లో 68.12, బీహార్‌లో 55.90, జార్ఖండ్‌లో 63.37, ఒరిస్సాలో 63.85, తెలంగాణాలో 61.29, ఉత్తరప్రదేశ్‌లో 57.76శాతం పోలింగ్‌లు నమోదయ్యాయి. ఇది తాత్కాలికమైన డేటానే అయినా మొత్తమ్మీద పోలింగ్ శాతం ఇంకా పెరిగే అవకాశాలు వున్నాయి. మొత్తమ్మీద పోలింగ్ ప్రశాంతంగానే సాగినా, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో అక్కడక్కడా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. పశ్చిమ బెంగాల్, ఒరిస్సాల్లో కొన్ని బూత్‌ల్లో ఇవిఎంలు పనిచేయలేదని వార్తలు కూడా అందాయి. పరుష పదజాలంతో కూడిన ప్రచార హోరు పెరుగుతుండడం, తక్కువ పోలింగ్ నమోదవుతుందనే ఆందోళనల మధ్య శ్రీనగర్‌లో ఓటింగ్ జరిగింది. కాశ్మీర్ ప్రాంతంలో ముస్లిం మెజారిటీకి చెందిన శ్రీనగర్ లోక్‌సభ సీటుకు లేదా రెండు ఇతర పార్లమెంటరీ నియోజకవర్గాల్లో పాలక బిజెపి పోటీ చేయడం లేదు. జమ్మూలో నిర్వాసితులైన అనేకమంది కాశ్మీరీ పండిట్ల పేర్లు ఓటర్ల జాబితాలో గల్లంతవడంతో వారు తమ ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. ఇప్పటివరకు జరిగిన మూడు దశల ఎన్నికల్లో వరుసగా 66.14శాతం, 66.71శాతం, 65.68శాతం నమోదయ్యాయి. నాల్గవ దశలో మొత్తంగా 1717 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 17.70కోట్ల మంది అర్హులైన ఓటర్లు వుండగా, వారిలో 8.73కోట్ల మంది మహిళలే. తెలంగాణాలో 17, ఆంధ్రప్రదేశ్‌లోని 25, యూపీలో 13, బీహార్‌లో ఐదు, జార్ఖండ్‌లో 4, మధ్యప్రదేశ్‌లో 8, మహారాష్ట్రలో 11, ఒడిశాలో 4, పశ్చిమ బెంగాల్‌లో 8, జమ్మూ కాశ్మీర్‌లో ఒక స్థానానికి ఓటింగ్ జరిగింది. ఇప్పటివరకు నాలుగు దశల్లో 379 సీట్లకు పోలింగ్ ముగిసింది. ఇక మే 20, మే 25, జూన్ 1 తేదీల్లో మరో మూడు దశల్లో పోలింగ్ జరగాల్సి వుంది. జూన్ 4 ఓట్ల లెక్కింపు జరగనుంది.

MANAPPURAM HOME FINANCE LTD.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్

CIN : U65923K12010PIC039179

రిజిష్టర్డు ఆఫీసు: 4/470ఏ (ఓల్డ్), డబ్ల్యు/638/ఏ (న్యూ), మణప్పురం హౌస్ వలపాడ్ త్రిషూర్, కేరళ-680567

కార్పొరేట్ ఆఫీసు: మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, 3వ అంతస్తు, యూనిట్ నెం.301 నుండి 315, ఎ వింగ్, 'కనకియ వాల్ స్ట్రీట్', అంధేరి-కుర్లా రోడ్, అంధేరి ఈస్ట్, ముంబయి-400093, మహారాష్ట్ర. ఫోన్ నెం.022-66211000, వెబ్‌సైట్: www.manappuramhomefin.com

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("MAHOFIN") యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ *[యాక్ట్] 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి నోటీసులో తెలిపిన విధంగా రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొన్న మొత్తం తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ **డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది. రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం చెందినారు, సదరు రూల్స్ యొక్క 9తో చదువబడే సదరు *[చట్టం] యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను సంక్రమించిన అధికారాలను వినియోగించి క్రింద వివరించబడిన ఆస్తిని దిగువసంతకందారుడు **లాంఛనప్రాయంగా స్వాధీనం** చేసుకున్నారని ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. సదరు ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు నిర్వహించరాదని, దిగువ సంబంధిత ఆస్తులతో నిర్వహించబడు ఏవేని లావాదేవీలు మొత్తం **మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క చార్జ్‌కు లోబడి మాత్రమే జరుగవలెనని ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

క్ర. సం	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత పేరు/ లాన్/ బ్రాంచ్	సృష్టించబడిన వడ్డీకి సంబంధించి సెక్యూర్డ్ అస్సెట్ యొక్క వివరణ	పంపబడిన డిమాండ్ నోటీసు తేది & బాకీపడిన మొత్తం	స్వాధీనతా తేది
1	హేమలత అవుల నర్సింహా అవుల సత్యనారాయణ దాసరి /NHL01110012732/ తిరుమల టాకీస్ × రోడ్	ఇ.నెం.3-100, చిన్న తుమ్మలగూడెం, అక్కెనేపల్లి గ్రామం, నార్కెట్‌పల్లి మండలం, నల్గొండ జిల్లా, తెలంగాణ పిన్ కోడ్ 508254, పి.ఓ.నార్కెట్‌పల్లి ఎస్.ఓ., నల్గొండ, తెలంగాణ, పిన్: 508254	22-02-2024 & Rs. 3,53,416/-	10-05-2024

తేది: 14 మే, 2024
ప్రదేశం: తెలంగాణ

సం/-
అధీకృత అధికారి
మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్





బధిరుల స్వరాన్ని కనిపెడుతోంది

సాధారణంగా వినికిడి సమస్య ఉన్న వారికి మాటలు కూడా రావు. అలాంటి వారి స్వరాన్ని కనుగొనేం దుకు విశేష కృషి చేస్తున్నది ఐశ్వర్య కర్నాటికి. బధిరుల కోసం ఏదైనా చేయాలనే ఆమె తపనే గ్లోవాట్రిక్స్‌ను స్థాపించేలా చేసింది. వారి కోసం ఏఐ-శక్తితో కూడిన గ్లోవ్‌లను అభివృద్ధి చేసింది. సంకేత భాషను అనువదించడా నికి కృత్రిమ మేధస్సును ఉపయో గించే వినూత్న గ్లోవ్‌లను అభివృద్ధి చేసిన ఆమె పరిచయం నేటి మానవిలో...

ఐశ్వర్య 8వ తరగతి చదువుతున్నప్పుడు తన పాఠశాలలో వికలాంగ పిల్లలకు బోధించడానికి ప్రత్యేక విభాగం ఉండేది. విద్యార్థి మండలిలో భాగంగా ఆమె ప్రతి వారం ఈ పిల్లలతో ముచ్చటించేవారు. ఈ పరస్పర చర్యల సమయంలో సెరిబ్రల్ పాల్సీ, ఆటిజం, లోకోమోటివ్ డిజార్డర్స్ ఉన్న పిల్లలు ఒకరితో ఒకరు మాట్లాడుకోవచ్చని ఆమె గమనించింది. కానీ చెవిటి పిల్లవాడు మాత్రం ఎవరితోనూ మాట్లాడలేకపోయేవాడు. 'అతని సైగల భాష ఎవరికీ అర్థమయ్యేది కాదు. దాంతో అతను ఎప్పుడూ ఒంటరిగా ఉండేవాడు. అందుకే నేను అతనితో మాట్లాడటానికి సంకేత భాష నేర్చుకోవడం ప్రారంభించాను' అని ఐశ్వర్య అంటున్నారు.

కృత్రిమ మేధస్సుతో...

అప్పటి నుంచి ఐశ్వర్య బధిర సమాజానికి ఏదైనా చేయాలనుకున్నారు. కానీ ఆమె కోరిక నెరవేరింది మాత్రం ఆమె కోరుకున్న 12 ఏండ్ల తర్వాత. ఐశ్వర్య, పరీక్షిత్ సోహోనితో కలిసి 2020లో గ్లోవాట్రిక్స్ అనే సంస్థను స్థాపించారు. ఇది పూణేకి చెందిన స్టార్టప్. ఇది సంకేత భాషను వాయిస్‌లోకి అనువదించడానికి కృత్రిమ మేధస్సును ఉపయోగించే గ్లోవ్‌లను అభివృద్ధి చేసింది. 'మేము చెవిటి, మాట్లాడే లోపము గల వ్యక్తులను సాధికారత కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎందుకంటే వారు తమ భావాలను వ్యక్తపరచగలరని మేము కోరుకుంటున్నాము" అని ఆమె జతచేస్తుంది.

పిలుపుని అనుసరించడం

ఐశ్వర్యకు వ్యాపారం చేయడమంటే చాలా ఇష్టం. కాలేజీలో చదివే రోజుల్లోనే ఆమె డోనట్స్ అమ్మడం వంటి చిన్న వ్యాపారాన్ని నిర్వహించేది. 'నేను 9 టు 5 చేసే ఉద్యోగం కోసం పుట్టలేదని నాకు తెలుసు. నా సొంతంగా ఏదైనా చేయాలనుకుంటున్నాను' అని ఆమె జతచేశారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత ఆమె తన తండ్రితో కలిసి ఎంఏసీజే అనే క్వాలిటీ అస్యూరెన్స్ కంపెనీని ప్రారంభించి తన కలను నెరవేర్చుకుంది. ఈ సంస్థ రియల్ ఎస్టేట్ భవనాల నాణ్యతను తనిఖీ చేసేది. 2018లో సీట్ సెన్సార్‌ల తయారీలో ఉన్న లక్సెంబర్గ్‌కు చెందిన కంపెనీకి టెస్టింగ్ సెంటర్‌ను ప్రారంభించి, నిర్వహించే బిడ్‌ను కూడా ఆమె గెలుచుకుంది. అయితే ఆ వెంచర్ సవాళ్లను ఎదుర్కొంది. అదే ఏడాది కంపెనీ మూసివేయాల్సి వచ్చింది. అప్పుడే ఆమెకు చిన్నతనంలోని తన కోరిక గుర్తుకొచ్చింది.

టెక్నాలజీని స్వీకరించండి

సామాజిక అభివృద్ధి రంగంలో మహిళలు తక్కువ ఉన్నప్పటికీ, ఈ రోజుల్లో మహిళా వ్యవస్థాపకతను పెంచే అవకాశాలు, పథకాలు పుష్కలంగా ఉన్నాయని ఆమె అభిప్రాయ పడ్డారు. అభివృద్ధి చెందుతున్న టెక్ ల్యాండ్ స్కేప్‌ను అంగీకరిస్తూనే ఐశ్వర్య 'టెక్నాలజీని స్వీకరించండి, మీరు దాని నుండి తప్పించు కోలేరు. మిమ్మల్ని మీరు అప్‌డేట్ చేసుకుంటూ ఉండండి. ఎప్పటికీ దాన్ని వదులుకోవద్దు. అనుకున్నది కచ్చితంగా సాధించగలరు అని మిమ్మల్ని మీరు నమ్మండి' అని ఆమె మహిళా పారిశ్రామిక వేత్తలకు చెబుతున్నారు.

నిర్దిష్టమైన ఆలోచన లేదు

ఐశ్వర్య ఎప్పటినుంచో వినికిడి సమస్య ఉన్నవారికి ఏదైనా చేయాలని భావించినా మనసులో నిర్దిష్టమైన ఆలోచన లేదు. ఏడాది తర్వాత 2020లో ఎంబీఏ కోసం సిద్ధమవుతున్నప్పుడు ఒక పార్టీలో సోహోనిని కలుసుకుంది. బధిరుల సంఘం కోసం పని చేయాలనే తన కోరికను పంచుకుంది. ఇద్దరూ కలిసి దాన్ని ప్రారంభించాలనుకున్నారు. 'గ్లోవాట్రిక్స్‌ను ప్రారంభించడం గురించి నాకు సరైన అవగాహన లేదు. కానీ అప్పుడు కోవిడ్ సంభవించింది. దాంతో నేను ఎంబీఏ కోసం విదేశాలకు వెళ్లలేకపోయాను. ఆ సమయాన్ని స్టార్టప్‌లో పెట్టుబడి పెట్టాను' అని ఆమె చెప్పారు.

మంచి కోసం టెక్

ఐశ్వర్య ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు రిమోట్ కంట్రోల్‌లకు బదులుగా సంజ్ఞ-నియంత్రిత రోబోటిక్ కారులో పనిచేశానని పంచుకున్నారు. ఈ ప్రాజెక్ట్ తన స్టార్టప్‌లో కూడా కీలక పాత్ర పోషించిందని ఆమె చెప్పారు. గ్లోవాట్రిక్స్‌లో వారు ఫిఫ్త్‌సెన్స్‌ను అభివృద్ధి చేశారు. ఇది 3డి స్పేస్‌లో చేతి, వేళ్ల కదలికలను మ్యాప్ చేసే సెన్సార్‌లతో ఏఐ-ఆధారిత గ్లోవ్ లాంటి పరికరం. కుడివైపు పాయింటర్ వేలుపై వ్యక్తి సంజ్ఞలు చేసినప్పుడు నొక్కాల్సిన బటన్ వుంటుందని ఆమె చెప్పారు. ఇవి అల్గారిథమ్‌ల ద్వారా అమలు చేయబడతాయి. వాటిని వచనంలోకి అనువదిస్తాయి. స్పీకర్ ద్వారా ఇది వాయిస్‌గా మార్చబడుతుంది. అదేవిధంగా ఇది మైక్రోఫోన్‌తో కూడా వస్తుంది. మాట్లాడే పదాలను సంగ్రహిస్తుంది. వినికిడి సమస్య ఉన్నవారి కోసం టెక్స్ట్, ఇమేజ్‌లుగా మారుస్తుంది.



మరిన్ని సంజ్ఞలను జోడిస్తూనే...

'మేము 100 సంజ్ఞల ఆధారంగా 98శాతం కచ్చితత్వాన్ని సాధించాం. మరిన్ని సంజ్ఞలను జోడిస్తూనే ఉన్నందున ఇది పెరుగుతూనే ఉంటుంది. కొంతకాలం తర్వాత మేము ఈ ఉత్పత్తిని బి2బి మార్కెట్‌లో కూడా పరిచయం చేస్తాం. మేము ఇప్పటివరకు ఈక్విటీ ఫ్రీ గ్రాంట్లు, ప్రైస్ మనీలో రూ. 1 కోటి వరకు సేకరించాము' అని ఆమె జతచేస్తున్నారు. స్టార్టప్ దాని ఎనిమిదవ హార్డ్‌వేర్ పునరావృతం, రెండవ యాప్ పునరావృతం చేసింది. ప్రస్తుతం దీని ధర రూ. 20,000. ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్, నిధి ప్రయాస్, బిరాక్ బిగ్ గ్రాంట్ నుండి వీరు నిధులే సేకరించారు. ఇది 'బెస్ట్ ఉమెన్ లీడ్ అసిస్టెంట్ టెక్నాలజీ స్టార్టప్' అవార్డును కూడా గెలుచుకుంది. ■

మహిళా పారిశ్రామిక వేత్తగా సవాళ్లు

పారిశ్రామికవేత్తగా ఐశ్వర్య ప్రయాణంలో సవాళ్లు తప్పలేదు. రియల్ ఎస్టేట్ రంగంలో పురుషుల ఆధిపత్యం ఎక్కువ. ఒక పురుష సివిల్ ఇంజనీర్ కంటే ఫీల్డ్‌లో ఎక్కువ అనుభవం ఉన్నప్పటికీ మహిళ కాబట్టి ఆమె దగ్గర ఆర్డర్లు తీసుకోవడానికి కష్టమర్లు ఇబ్బంది పడేవారని ఐశ్వర్య గుర్తుచేసుకు న్నారు. అదేవిధంగా సేల్స్ కాల్ కోసం ఒక బిల్డర్‌ని కలిసిన మరొక సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. అతను 'తుమారీ ఉమర్ కిత్నీ హై ఉత్నా మేరా తజుర్బా హై. తుమ్ మేరి గల్తీ నీకలోగి' (నీ వయసు నా అనుభవం అంత లేదు. నువ్వు నా తప్పును ఎత్తిచూపుతావా) అన్నాడు. 'ఇలాంటి అనుభవాల నుండి ప్రతి ఒక్కరినీ అధిగమిం చడం ద్వారా మాత్రమే గౌరవం పొందగలనని తెలుసుకున్నాను' అని ఆమె జతచేస్తున్నారు.

కరివేపాకుతో ఎన్ని లాభాలో...



మన ఆరోగ్యం మెరుగుపడాలంటే, రోజుని ఆరోగ్యకరమైన రీతిలో ప్రారంభించాలి. దక్షిణ భారత వంటకాల్లో తరచుగా కరివేపాకును వాడుతారు. ఇది చాలా రుచికరమైనది. ప్రతి రోజూ ఉదయాన్నే తాజా కరివేపాకును తినడం వల్ల ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని పోషకాహార నిపుణులు అంటున్నారు. ఖాళీ కడుపుతో కరివేపాకును నమలడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం....

జీర్ణక్రియను ఆరోగ్యంగా ఉంచుతుంది: కరివేపాకును ఖాళీ కడుపుతో తింటే జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. ఉదయం కరివేపాకును తిన్న తర్వాత, జీర్ణ ఎంజైమ్‌లు ఉత్తేజితమవుతాయి, ప్రేగు కదలికలను సులభతరం చేస్తాయి. ఇది మలబద్ధకం నుంచి ఉపశమనం పొందడంలోనూ సహాయపడుతుంది.

మార్నింగ్ సిక్నెస్ నుండి ఉపశమనం: చాలా మంది ఉదయం నిద్రలేచిన తర్వాత బలహీనత, తలతిరగడం, వాంతులు వంటి సమస్యలు ఎదుర్కొంటారు. అటువంటి పరిస్థితిలో, మీరు కొన్ని కరివేపాకులను నమిలినట్లయితే, మీ జీర్ణక్రియ ఆరోగ్యంగా ఉంటుంది. మార్నింగ్ సిక్నెస్ నుంచి ఉపశమనం పొందుతారు.

బరువు తగ్గడం: మలబద్ధకంతో బాధపడేవారు ప్రతిరోజూ ఉదయం నిద్రలేచిన తర్వాత కరివేపాకు జ్యూస్ తాగాలి, ఎందుకంటే ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. శరీరంలో జీర్ణక్రియ బాగా జరుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. మీరు బరువు, పొట్ట కొవ్వును తగ్గించుకోవచ్చు.

జుట్టుకు మంచిది: కరివేపాకు జుట్టు రాలడాన్ని నిరోధించడంలో సహాయపడుతుంది. ఉదయాన్నే ముందుగా ఒక గ్లాసు నీరు తాగాలి. కొన్ని నిమిషాల తర్వాత కొన్ని తాజా కరివేపాకులను తిని 30 నిమిషాల తర్వాత టిఫిన్ చేయాలి.

పోలింగ్ ప్రశాంతం

(మొదటిపేజీ తరువాయి)

రీ పోలింగ్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. ప్రిసైడింగ్ అధికారులు, పరిశీలకులు ఇచ్చే నివేదికల ఆధారంగా మంగళవారం రీపోలింగ్‌పై ఈసీ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

మొరాయించిన ఈవీఎంలు

రాష్ట్ర వ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. వనపర్తి జిల్లా అమరచింత జెడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్ 228/77లో ఈవీఎంలు మొరాయించాయి. రెండు గంటల పాటు ఈవీఎంలు పని చేయకపోవడంతో వాటిని రీప్లేస్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా 100కు పైగా సెంటర్లలో ఈవీఎంలు మొరాయించినట్టు ఎన్నికల సంఘం తెలిపింది. చిన్న చిన్న సాంకేతిక సమస్యలు తలెత్తిన వాటికి మరమ్మతులు చేయగా, మిగతా వాటిని మార్చడంతో పోలింగ్ సజావుగా సాగిందని పేర్కొంది.

ఎవరి ధీమా వారిదే!

(మొదటిపేజీ తరువాయి)

విశ్లేషించే పనిలో ఆయా పార్టీల నేతలు తలమునకలై ఉన్నారు. ఎన్నికలను పూర్తి ప్రశాంతంగా నిర్వహించడంలో సీఈఓ వికాస్‌రాజ్ సక్సెస్ అయ్యారు. ఎక్కడ ఏ చిన్న సమస్య తన దృష్టికి వచ్చినా, తక్షణం స్పందిస్తూ, తగిన చర్యలకు ఆదేశాలిస్తూ, ఆయన పూర్తి ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు. అయితే గతంలో మాదిరే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఓటింగ్ శాతాన్ని పెంచడంలో మాత్రం విఫలమయ్యారు. గ్రేటర్ పరిధిలోని ఏ పోలింగ్ బూత్‌లో కూడా 50 శాతం ఓట్లు పోల్ కాలేదు. సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పోలింగ్ వివరాల ప్రకారం హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో అత్యల్పంగా 39.17 శాతం, సికింద్రాబాద్ స్థానంలో 42.48 శాతం మాత్రమే ఓట్లు పోల్ అయ్యాయి. ఓట్ల పండుగ ముగియడంతో ఇప్పటి వరకు హడావిడిగా, టెన్షన్ పడిన అభ్యర్థులు కాస్త రిలీఫ్ ఫీల్ అవుతున్నారు. కుటుంబసభ్యులతో ఎక్కువ సమయం గడిపేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితాలు వచ్చేవరకు వేచిచూడటం తప్ప వారికీ మరో ప్రత్యామ్నాయం లేని విషయం తెలిసిందే. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9 గంటలకు కూడా ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. దీనితో తుది పోలింగ్ శాతం అర్ధరాత్రి 1.30 గంటలకు వెల్లడయ్యే అవకాశం ఉన్నదని కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం తెలిపింది.

నివేదిక తర్వాతే రీపోలింగ్‌పై నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. పోలింగ్ రోజు సీ విజిల్ , 1950, ఎన్‌జీఎస్‌పీ పోర్టల్ ద్వారా 400కు పైగా ఫిర్యాదులు వచ్చినట్టు వెల్లడించారు. ఇందుకు సంబంధించి 38 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా డిసెంబర్ ఒకటి నుంచి ఇప్పటి వరకు ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా రూ.330 కోట్ల విలువ చేసే నగదు, బంగారం, ఇతర ఆభరణాలు, డ్రగ్స్, నార్కొటిక్స్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.



మీరు బొట్టెందుకు పెట్టుకున్నారు?..

- మహిళలపై ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అనుచరుల దౌర్జన్యం
- ఆపకుండా వారికే ఎమ్మెల్యే మద్దతు..

నవతెలంగాణ- ఆదిలాబాద్

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో పాటు ఆయన అనుచరులు ఓ పోలింగ్ కేంద్రంలోకి కాషాయ కండువాలు ధరించి ప్రవేశించారు. కొంత మంది మహిళలు వారిని అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం కాషాయ కండువా ధరించి పోలింగ్ కేంద్రంలోకి రాకూడదని, ఎందుకు వచ్చారని మహిళా ఓటర్లు ప్రశ్నించారు. 'మీరు బొట్టు కూడా పెట్టుకోవద్దు.. ఎందుకు పెట్టుకున్నారు' అని మహిళా ఓటర్ల పట్ల దురుసుగా ప్రవర్తించారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఆ మహిళలను బయటకు పంపండి అంటూ పోలీసులను ఎమ్మెల్యే ఆదేశించడం గమనార్హం. కాషాయ కండువా కప్పుకున్న వారిని బయటకు పంపిస్తేనే తాము కూడా బయటకు వెళ్తామని మహిళలు పోలీసులకు తెగేసి చెప్పారు.

బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి..

జైనూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలపై బీజేపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. ఘర్షణలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బీజేపీ కార్యకర్తల దాడిని బీఆర్ఎస్ కార్యకర్తలు నిలువరించారు. ఇరు పార్టీల మధ్య ఘర్షణతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఘర్షణకు దిగిన కార్యకర్తలను పోలీసులు చెదరగొట్టారు. ఈ దాడిలో మీడియా ప్రతినిధుల సెల్‌ఫోన్లు ధ్వంసమయ్యాయి.

ఉప్పల్‌లో పార్టీ కండువాతో పోలింగ్ బూత్‌లోకి...

మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని నాచారం డివిజన్ భవానినగర్‌లో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఉప్పల్ బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పార్టీ కండువాతో పోలింగ్ బూత్ వద్ద బైఠాయించి తమ పార్టీ అభ్యర్థికే ఓటు వేయాలని ఓటర్లను ప్రభావితం చేస్తుండగా.. కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు బీజేపీ నాయకులకు కాంగ్రెస్ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. నాచారం పోలీసులు ఇరుగ్రూపులకు సర్దిచెప్పి పంపించారు.

ఓటరుపై కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సోదరుడి దాడి

నవతెలంగాణ- జహీరాబాద్

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటు వేయడానికి వచ్చిన ఓటరుపై కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ సోదరుడు నగేష్ షెట్కార్ దాడికి పాల్పడ్డాడు. అందరూ చూస్తుండగానే ఓటరును కాలితో తన్నాడు. దీనిపై విపక్ష పార్టీలు మండిపడు తున్నాయి. నగేష్‌పై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

మహాలక్ష్మి పథకం కింద రూ.లక్ష

(మొదటిపేజీ తరువాయి)

వల్ల మహిళలు గడ్డుకాలం ఎదుర్కొంటున్నారని సోమవారం విడుదల చేసిన వీడియో సందేశంలో అన్నారు. అలాంటి వారందరికీ కాంగ్రెస్ హామీ ఇచ్చిన మహాలక్ష్మి పథకం వల్ల లబ్ది చేకూరుతుందని తెలిపారు.

"స్వాతంత్ర్య సంగ్రామం మొదలుకొని నేటి ఆధునిక భారత నిర్మాణం వరకు మహిళల కృషి మరువలేనిది. కానీ, ద్రవ్యోల్బణం వల్ల నేడు వారు తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నారు. వారి కష్టానికి న్యాయం చేకూర్చేందుకు కాంగ్రెస్ విప్లవాత్మక గ్యారంటీతో ముందుకొచ్చింది. మహాలక్ష్మి పథకంతో ప్రతి పేద మహిళకు సంవత్సరానికి రూ.1 లక్ష లభిస్తాయి" అని సోనియా గాంధీ హామీ ఇచ్చారు.

తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో ఇప్పటికే తాము అమలు చేస్తున్న గ్యారంటీల వల్ల అనేక కుటుంబాలు లబ్ది పొందుతున్నాయని సోనియా పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు, ఆహార భద్రత వంటి విప్లవాత్మక చర్యల ద్వారా కోట్లాది మంది భారతీయులకు కాంగ్రెస్ పార్టీ సాధికారత కల్పించిందన్నారు. మహాలక్ష్మి ద్వారా దాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

ఆ ప్రధానుల ప్రత్యేకత మోడీకి అందేనా!

సోనియా గాంధీ వీడియో సందేశాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు పార్టీ నేతలు తమ 'ఎక్స్' ఖాతాల్లో పోస్ట్ చేశారు. ఒక్క ఓటు విలువ సంవత్సరానికి రూ.లక్షతో సమానమని సోనియా సందేశాన్ని షేర్ చేస్తూ రాహుల్ గాంధీ అన్నారు. "నిరుద్యోగం, ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న మహిళలకు కాంగ్రెస్ మహాలక్ష్మి పథకం సంజీవనిలా పనిచేయనుంది. ప్రతినెలా ఖాతాల్లో రూ.8,500 జమ అయితే ఆర్థికంగా ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. మీ కుటుంబ భవిష్యత్తును మీరే నిర్దేశించగలరు" అని రాహుల్ రాసుకొచ్చారు.

పెండ్లి చేసుకోక తప్పేలా లేదు

రాయబరేలి: "తాను త్వరలో పెండ్లి చేసుకోక తప్పేలా లేదు" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సరదా వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్ రాయ్‌బరేలీలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సోమవారం ప్రియాంకా గాంధీతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న జనం రాహుల్ జీ పెండ్లి ఎప్పుడు చేసుకుంటారని ప్రశ్నించగా ఆయన స్పందిస్తూ.. 'నేను పెండ్లి చేసుకోక తప్పేలా లేదు (అబ్ జల్దీ హి కర్నీ పడేగీ)' అని నవ్వుతూ అభివాదం చేశారు. అక్కడే ఉన్న ప్రియాంక గాంధీ సైతం నవ్వుతూ కనిపించారు.

ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగిన విషయం తెలిసిందే. కేరళ వయనాడ్ ఎంపీ స్థానం నుంచి మరోసారి పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సిట్టింగ్ ఎంపీ కూడా. అలాగే, కాంగ్రెస్ కంచుకోట రాయ్‌బరేలీలో సైతం బరిలో దిగారు. కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ మొన్నటి వరకు పోటీ చేయగా ఇప్పుడు ఆమె స్థానంలో రాహుల్ గాంధీ పోటీలో ఉన్నారు. ఈ క్రమంలో నిర్వహించిన ప్రచారంలో బీజేపీ, ఎన్డీయే సర్కారు వైఖరిపై ఆయన తీవ్రంగా స్పందించారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాయ్‌బరేలీతో తన కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఇందిరా గాంధీ, సోనియా గాంధీ ఇక్కడి నుంచే పోటీ చేశారన్న రాహుల్.. ఇది తమకు కర్మభూమి లాంటిదని అన్నారు.

దండకారణ్యంలో ఆగని ఎన్‌కౌంటర్లు

నవతెలంగాణ-చర్ల

రాష్ట్ర సరిహద్దు మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా భమ్రాగఢ్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఎనిమిది మంది మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి ఒక మహిళా మావోయిస్టు సహా ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఎదురు కాల్పులు జరిగిన ప్రదేశం ఇటు ఛత్తీస్‌గఢ్ అటు మహారాష్ట్ర సరిహద్దుగా పోలీస్ అధికారులు తెలుపుతున్నారు. హతమైన మావోయిస్టుల్లో పెరమిలి దళం కమాండర్ వాసు కూడా ఉన్నట్టు సమాచారం.

14మంది మావోయిస్టుల అరెస్టు

ఛత్తీస్‌గఢ్, బీజాపూర్ జిల్లాలోని గంగుళూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ముట్వెండి, పిడియా అటవీ ప్రాంతంలో 14 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారి నుంచి భారీగా పేలుడు పదార్థాలు, ప్రచార సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

పేలిన మందుపాతర

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఇంద్రావతి నదికి అవతల ఉన్న బొడ్గా గ్రామంలో బీజీఎల్ (బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్) సెల్ పేలిన ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. గ్రామ సమీపంలోని పొలంలో పిల్లలు ఆడుకుంటూ యూబీజీఎల్‌పై పడటంతో ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాలతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో భైరంగఢ్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఘటన సమాచారం అందిందని, పరిశీలిస్తున్నామని జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లు గ్రామస్తులను తెచ్చి చంపేశారని, వారు మావోయిస్టులు కాదని పౌరసంఘాలు ఆరోపిస్తున్నాయి.

బుర్ఖాలు తొలగించి.. ముస్లిం ఓటర్ల ఐడీ తనిఖీ

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశాలు జారీ చేశారు. దాంతో ఐపీసీ సెక్షన్లతోపాటు ప్రజాప్రాతినిధ్య చట్టం కింద ఆమెపై మలక్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై మాధవీలత మాట్లాడుతూ.. తాను ఒక అభ్యర్థిని అని చట్ట ప్రకారం ఫేస్‌మాస్క్‌లు లేకుండా ఐడీ కార్డుల వెరిఫికేషన్ చేసే హక్కు అభ్యర్థులకు ఉంటుందన్నారు. వాస్తవానికి ఆ హక్కు పోలింగ్ బూత్ ఆఫీసర్లదే. నిజామాబాద్ జిల్లాలో ముస్లిం మహిళా ఓటర్లు బుర్ఖా ధరించి పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి అభ్యంతరం తెలిపారు. అసలు ఓటు వేయడానికి ఎవరు వచ్చారు..? ఎలా గుర్తిస్తారు..? అని ముస్లిం మహిళా ఓటర్లను ఉద్దేశించి ప్రిసైడింగ్ ఆఫీసర్‌పై అరవింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఏం డ్యూటీ చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై ఎన్నికల అధికారులు అభ్యంతరం తెలిపారు.

గురుద్వారాలో మోడీ

(మొదటిపేజీ తరువాయి)

రంజిత్ సింగ్ .. తాకత్ శ్రీ హరిమందర్ జీ గురుద్వారాను నిర్మించారు. గురుగోబింద్ పుట్టిన ఊరు ఇదే. సిక్కు గురువుల్లో ఈయన పదో వ్యక్తి. పాట్నాలో ఆయన 1666లో జన్మించారు. గురుగోబింద్ తన తొలి రోజులను ఇక్కగే గడిపారు. ఆ తర్వాత ఆయన ఆనంద్‌పుర్ సాహిబ్‌కు వెళ్లారు. పాట్నా సాహిబ్ గురుద్వారాలో మోడీ ప్రార్థనలు చేశారు. ఆ తర్వాత ఆయన వంటశాలకు వెళ్లారు. ఆ తర్వాత లంగర్ సర్వ్ చేశారు. ఇదంతా ఓట్ల కోసమే అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

అప్పుడే వెనక్కి...

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. కొందరు సొంత వాహనాల్లో వెళ్లిపోయారు. కాగా పోలింగ్ ముగిసిన వెంటనే అప్పుడే హైదరాబాద్‌కు పయనమయ్యారు. తెలంగాణ జిల్లాల నుంచి స్వల్పంగా నగరానికి వచ్చినా, ఏపీ నుంచి భారీసంఖ్యలో తిరుగుముఖం పట్టారు. సోమవారం సాయంత్రం చౌటుప్పల్ సమీపంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఏపీఆర్టీసీతోపాటు టీఎస్ ఆర్టీసీ బస్సులు, ప్రయివేటు ట్రావెల్స్, సొంత వాహనాల్లో ఓటేయడానికి వెళ్లిన వేలాది మంది నగరానికి వచ్చేశారు. సోమవారం అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ రద్దీ కొనసాగుతూనే ఉంది.

భారత్ మానవ హక్కుల రికార్డుకు ఎదురు దెబ్బ !

- ఎన్‌హెచ్‌ఆర్‌సికి గుర్తింపు వాయిదా

న్యూఢిల్లీ : భారతదేశ మానవ హక్కుల రికార్డుకు పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన, జెనీవా కేంద్రంగా పనిచేసే గ్లోబల్ అలయన్స్ ఆఫ్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ఇనిస్టిట్యూషన్స్ (జీఏఎన్‌హెచ్‌ఆర్‌ఐ) ఈ ఏడాది జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి)కు గుర్తింపు ఇవ్వడాన్ని వాయిదా వేసింది. ఇలా గుర్తింపును వాయిదా వేయడం వరుసగా ఇది రెండో ఏడాది. ఈ నిర్ణయంతో మానవ హక్కుల మండలిలో అలాగే కొన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సంస్థల్లో భారత్ ఓటు వేసే హక్కు ప్రభావితమవుతుంది. మే 1వ తేదీన జరిగిన అక్రిడిటేషన్లపై సబ్ కమిటీ (ఎస్‌సిఏ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కమిటీ తాజా నివేదిక ఇంకా రావాల్సి వుంది. గుర్తింపును వాయిదా వేయాలంటూ సిఫార్సు చేయడానికి పలు కారణాలను గతంలో ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సి సభ్యుల నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, మానవ హక్కుల దర్యాప్తుల పర్యవేక్షకు పోలీసు అధికారులను నియమించారని, కమిటీలో మహిళలు, మైనారిటీల ప్రాతినిధ్యం కొరవడిందని పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సికి ఈ నిర్ణయాన్ని తెలియచేశారని సంబంధిత వర్గాలు ధృవీకరించాయి.

కాశ్మీర్‌లో పోటీకి నై

ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఇక్కడ ఇవే తొలి ఎన్నికలు

మూడు స్థానాలకూ అభ్యర్థులను ప్రకటించని బీజేపీ



లోయ ప్రజల్లో తీవ్ర ఆగ్రహం

ఓడిపోతే ఆర్టికల్ 370 రద్దుపై ప్రతికూల ప్రభావం

ఈ కారణంగానే పోటీకి కాషాయపార్టీ దూరం

ఎన్నికల విశ్లేషకులు, నిపుణుల వెల్లడి

న్యూఢిల్లీ : ఆర్టికల్ 370 రద్దు తర్వాత కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకాశ్మీర్‌లో తొలిసారిగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. జమ్మూకాశ్మీర్‌లో మొత్తం ఐదు ఎంపీ స్థానాలుండగా.. అందులో మూడు స్థానాలు బారాముల్లా, శ్రీనగర్, అనంత్‌నాగ్-రాజౌరీలు కాశ్మీర్ లోయలో ఉన్నాయి. అయితే, మే 13న శ్రీనగర్‌లో పోలింగ్‌తో కాశ్మీర్‌లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. లోయలోని మిగతా రెండు స్థానాలకు ఈనెల 20, 25న ఎన్నికలు జరగనున్నాయి.

ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకాశ్మీర్‌లో పరిస్థితి మారిపోయిందనీ, పర్యాటక రంగం వృద్ధిని సాధించిందనీ, వాణిజ్య-వ్యాపారాలు సాఫీగా సాగుతున్నాయనీ, జీ20 వంటి అంతర్జాతీయ సదస్సును ఇక్కడ నిర్వహించగలిగామని కేంద్రంలో ఉన్న అధికార బీజేపీ సర్కారు ఇప్పటి వరకూ చెప్పుకుంటూ వచ్చింది. ఇంత సానుకూల మార్పు వచ్చిందని చెప్పుకుంటున్న కాషాయపార్టీ లోయలోని మూడు స్థానాలకు పోటీ నుంచి దూరంగా ఉండటం గమనార్హం. ఈ మూడు స్థానాలకు అభ్యర్థులను పోటీలో దించకపోవటానికి గల కారణాలు ఏమిటని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

2019లో మోడీ ప్రభుత్వం జమ్మూకాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసిన విషయం విదితమే. అలాగే, జమ్మూకాశ్మీర్‌ను జమ్మూ మరియు కాశ్మీర్, లఢఖ్‌లు అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది కూడా. కొంతమంది విశ్లేషకులు కాశ్మీర్‌లో 2024 ఎన్నికలను ఆ 2019 ఎత్తుగడలపై రెఫరెండంగా భావిస్తున్నారు. ఇలాంటి తరుణంలో లోయలో తమ అభ్యర్థులను బీజేపీ నిలబెట్టకపోవటంపై రాజకీయ వర్గాల్లో చర్చోపచర్చలు నడుస్తున్నాయి. ఆర్టికల్ 370 రద్దు తర్వాత అంతా సానుకూల మార్పు వచ్చిందన్న బీజేపీ.. పోటీ నుంచి ఎందుకు తప్పించుకున్నదో స్పష్టం చేయాలని విమర్శకులు, విపక్ష నాయకులు ప్రశ్నిస్తున్నారు.

ఆర్టికల్ 370 రద్దుపై లోయలోని ప్రజలు ఆగ్రహంతోనే ఉన్నారనీ, ఇక్కడున్న మూడు ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తే ఓడిపోవటమేగాక.. డిపాజిట్ రాదనే భయంతోనే బీజేపీ ఇక్కడ తన అభ్యర్థులను బరిలో నిలపలేదని వారు అంటున్నారు. ఒకవేళ తమ అభ్యర్థులు ఓడిపోతే..

ఆర్టికల్ 370 రద్దుపై ప్రజల వ్యతిరేకతగా బీజేపీ ఓటమిని భావించే అవకాశం ఉంటుందన్న భయంతోనే కాషాయపార్టీ వెనకడుగు వేసిందని విశ్లేషకులు చెప్తున్నారు. ఆర్టికల్ 370 రద్దుపై కాశ్మీర్‌లోయలోని ప్రజలు బీజేపీపై ఇప్పటికీ ఆగ్రహంతోనే ఉన్నారు. ఇక్కడి కాశ్మీరీలు ప్రతిరోజూ ఈ ప్రాంత ప్రత్యేక హెూదాను రద్దు చేయటం, ఆ తర్వాత వేలాది మందిని అరెస్టు చేసిన తర్వాత భద్రతాపరమైన అణిచివేతకు ఆదేశించాలన్న బీజేపీ నిర్ణయంపై ఇప్పటికీ కోపాన్ని వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలోని మోడీ సర్కారు.. స్వేచ్ఛను హరించిందనీ, జర్నలిస్టులను అరెస్టు చేయించిందనీ, ఫెడరల్ ప్రభుత్వాన్ని విమర్శించే వార్తా సైట్‌లను మూసివేయించిందనీ, అధిక నిరుద్యోగం, విద్యుత్ కొరత, ప్రాథమిక మౌలిక సదుపాయాల కొరత ఈ ప్రాంతాన్ని పీడిస్తున్నాయని ఇక్కడి ప్రజలు అంటున్నారు. తమ అసంతృప్తి ఈ సారి కాశ్మీర్ ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబిస్తుందని కొందరు చెప్తున్నారు. మరికొందరు తాము ఓటు వేయటానికి ఇబ్బంది పడబోమని వెల్లడించారు.

శ్రీనగర్ నుంచి నేషనలిస్ట్ కాన్ఫరెన్స్(ఎన్.సీ) అభ్యర్థిగా ఉన్న సయ్యద్ అగా రుహుల్లా మాట్లాడుతూ.. కాశ్మీరీ ఓటర్లు తమ అసమ్మతిని వ్యక్తీకరించటానికి ఈ ఎన్నికలు ఒక అవకాశమని అన్నారు. 2019 నుంచి రాష్ట్ర శాసనసభ సస్పెండ్ చేయబడినందున ప్రజలు హక్కులు కోల్పోయారని భావిస్తున్నారనీ, కాబట్టి కాశ్మీరీలకు స్థానిక ప్రభుత్వం లేదని ఆయన ఆవేదనను వ్యక్తం చేశారు.

కాశ్మీరీలు తమ భూమి, సంస్కృతిపై దాడి జరుగుతున్నదని భయపడుతున్నారు. ఆర్టికల్ 370 కాశ్మీర్‌లో భూమిని కొనుగోలు చేయకుండా, స్థిరపడకుండా బయటి వ్యక్తులను నిరోధించింది. అయితే ప్రస్తుతం ఆ రక్షణ పోయిందనీ, బీజేపీ ఈ ప్రాంతంలో జనాభా మార్పును చేయటానికి ప్రయత్నిస్తున్నదని స్థానికులు చాలా మంది అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. "కాశ్మీర్‌లో పోటీ చేస్తే, ఎన్నికలు ఆర్టికల్ 370పై ప్రజాభిప్రాయ సేకరణగా మారుతాయనీ, అది పార్టీని ఇబ్బందికర స్థితిలోకి నెట్టివేస్తుందని బీజేపీకి తెలుసు" అని కాశ్మీర్‌లోని రాజకీయ విశ్లేషకుడు ముహమ్మద్ తెలిపారు.

కేంద్ర హెూం మంత్రి అమిత్ షా గతనెలలో జమ్మూలో ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ.. బీజేపీ ప్రజల హృదయాలను గెలుచుకోవాలని కోరుకుంటున్నదనీ, లోయలోనూ 'కమలం వికసించటానికి' తొందరేమీ లేదని అన్నారు. బీజేపీ 1996లో పోటీ చేయటం ప్రారంభించినప్పటి నుంచి శ్రీనగర్, బారాముల్లా, అనంతనాగ్-రాజౌరీ మూడు కాశ్మీర్ స్థానాల్లో ఒక్కటి కూడా గెలవలేదు. శ్రీనగర్‌లో మే 13న, బారాముల్లా మే 20న, అనంత్‌నాగ్-రాజౌరీ మే 25న ఎన్నికలకు వెళ్లనున్నది. మొన్నటి వరకు కాశ్మీర్‌లో బీజేపీ పోటీ చేస్తుందని అంతా భావించారు. రెండు నెలల క్రితం జాతీయ ఎన్నికల ప్రకటనకు రోజుల ముందు, 2019 ఆర్టికల్ 370 రద్దు తర్వాత మొదటిసారిగా మోడీ ఈ ప్రాంతంలోని అతిపెద్ద నగరమైన శ్రీనగర్‌ను సందర్శించారు. మీ హృదయాలను గెలుచుకోవటానికి నేను తీవ్రంగా కృషి చేస్తున్నాననీ, ఆ ప్రయత్నం కొనసాగుతుందని చెప్పారు. అయినప్పటికీ, కాశ్మీర్‌లో పోటీ చేసే సాహసాన్ని మోడీ కూడా చేయలేకపోతున్నారని రాజకీయ నాయకులు అంటున్నారు.

ఈ ప్రాంతం భారత్‌లోకి ప్రవేశించినప్పటి నుంచి ఎక్కువ కాలం పాలక పక్షంగా ఎన్‌సీ, పీడీపీలు కాశ్మీర్ లోయలో ప్రధాన పోటీదారులుగా ఉన్నాయి. కాంగ్రెస్, బీజేపీలు జమ్మూలో ప్రభావాన్ని కలిగి ఉన్నాయి. ఎన్‌సీ, పీడీపీలు బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీయే)ని సవాలు చేస్తున్న కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష ఇండియా కూటమిలో భాగం. అయినప్పటికీ, ఈ రెండు ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు కాశ్మీర్‌లో పరస్పరం పోటీ పడుతుండటం గమనార్హం. కాశ్మీర్‌లో ఉన్న మరో రెండు పార్టీలైన అప్నీ పార్టీ, పీపుల్స్ కాన్ఫరెన్స్‌లు బీజేపీకి పరోక్షంగా మిత్రపక్షంగా ఉన్నాయని వాదనలు ఉన్నాయి. అయితే, ఆ రెండు పార్టీలు మాత్రం ఈ వాదనలను ఖండించాయి.



ఇండియా వేదిక గెలుపుతో విముక్తి

జూన్ 5న జైలు నుంచి బయటకు వస్తా..!


ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కీలక వ్యాఖ్యలు..



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా వేదిక గెలిస్తే.. తాను జూన్ 5న తీహార్ జైలు నుంచి విడుదలవుతానని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ అమ్ ఆద్మీ పార్టీ కౌన్సిలర్లనుద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మద్యం స్కాం కేసులో అరెస్టయిన కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. మళ్లీ జూన్ 2న లొంగిపోవాలని సూచించిన విషయమూ తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తీహార్‌లోని తన సెల్‌లో రెండు సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి. ఫీడ్‌ను 13 మంది అధికారులు పర్యవేక్షించారు. సీసీటీవీ ఫీడ్‌ను పీఎంవోకు సైతం అందించారు. మోడీ సైతం పర్యవేక్షిస్తున్నారు. ఆయనకు తనపై ఎలాంటి పగ ఉందో నాకు తెలియదు. బాత్‌రూమ్‌కి వెళ్లడానికి నేను రాత్రి ఏ సమయానికి లేస్తానో కూడా వారు పర్యవేక్షించే వారు' అని అన్నారు. కేజ్రీవాల్ డిప్రెషన్‌లో లేరని తెలిపారు. జూన్ 2న తాను తిరిగి జైలుకు వెళ్లినా ... జూన్ 4న వెలువడే ఫలితాలలో ఇండియా కూటమి గెలిస్తేనే 5న మళ్లీ బయటకు వస్తానని అన్నారు.

కాంగ్రెస్‌కు టెంపోలో డబ్బులు పంపారా!

అదానీ, అంబానీలను అరెస్ట్ చేయండి : మల్లికార్జున్ ఖర్గే



న్యూఢిల్లీ: అదానీ, అంబానీల నుంచి కాంగ్రెస్‌కు టెంపోల నిండా డబ్బులు అంది ఉంటాయన్న ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తిప్పికొట్టారు. ధైర్యవంతమైన బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలను ఎందుకు అరెస్టు చేయలేదు? అని ప్రశ్నించారు. అలాగే 'మీరు హేమంత్ సోరెన్‌ను అరెస్ట్ చేశారు. అదానీ, అంబానీలను ఎందుకు అరెస్టు చేయడం లేదు' అని మల్లికార్జున్ ఖర్గే అన్నట్లు పీటీఐ వార్తా సంస్థ సైతం పేర్కొంది.కాగా, ప్రధాని మోడీ ప్రభుత్వం పాలసీలు రూపొందించినప్పుడు అదానీ సహా కొంత మంది పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా వ్యవహరించిందని రాహుల్ గాంధీ విమర్శిం చారు. రైతుల సంక్షేమాన్ని ఫణంగా పెట్టి పారిశ్రామికవేత్తల రుణాలను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేసిందని గతంలోనే ఆరోపించారు. మరోవైపు ఇటీవల తెలంగాణాలో ఎన్నికల ప్రచారం సందర్భంగా రాహుల్ గాంధీపై మోడీ విరుచుకుపడ్డారు. 'కాంగ్రెస్ యువరా జు ఐదేండ్లుగా పదే పదే ఒక విషయం చెబుతున్నారు. రాఫెల్ ఇష్యూ తెరుమరుగ య్యాక ఐదుగురు పారిశ్రామిక వేత్తలను, ముఖ్యంగా అంబానీ, అదానీలను లక్ష్యంగా చేసుకున్నారు. అయితే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే వారిపై దాడులు చేయడం మానేశారు. కాంగ్రెస్‌కు టెంపో లోడ్లు (కరెన్సీ) చేరాయా? అని నేను అడగాలనుకుంటున్నా. రాత్రికి రాత్రే అంబానీ, అదానీపై యువరాజు ఆరోపణలు ఆగిపోవడానికి ఏ డీల్ జరిగింది' అని మోడీ ప్రశ్నించారు.

ఈవీఎంలు భద్రపరిచే చోట సీసీటీవీలు ఆఫ్

ఏదో తప్పు జరిగింది : సుప్రియా సూలే



ముంబై: " ఈవీఎంలు భద్రపరిచిన గోదాంలో 45 నిమిషాలపాటు సీసీటీవీలు ఆపేశారు " అని ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ కుమార్తె, బారామతి లోక్‌సభ అభ్యర్థి సుప్రియా సూలే ఆరోపించారు. లోపల ఏదో తప్పు జరిగిందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ రెబల్ నేత అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ బీజేపీ అభ్యర్థిగా సుప్రియా సూలేపై పోటీ చేసింది. మే 7న మూడో దశ పోలింగ్‌లో భాగంగా బారామతితోపాటు ఇతర నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. నాటి నుంచి ఈవీఎంలను బారామతిలోని ఎఫ్‌సీఐ గోదాంలో భద్రపరిచారు. కాగా ఈవీఎంల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన సీసీటీవీలు సోమవారం ఉదయం 10.30 నుంచి 11.15 వరకు సుమారు 45 నిమిషాలపాటు ఆఫ్ అయ్యాయని సుప్రియా సూలే తెలిపారు. అక్కడ ఉన్న తమ సిబ్బంది ఎన్నికల అధికారులు, పోలీసుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈవీఎంలను భద్రపరిచిన గోదాం లోపల ఏదో తప్పు జరిగి ఉంటుందని సుప్రియా సూలే అనుమానం వ్యక్తం చేశారు. ఎక్స్‌లో పోస్ట్ ద్వారా ఆందోళన వ్యక్తం చేశారు. సీసీటీవీలు ఆఫైన వీడియో క్లిప్ కూడా ఆమె షేర్ చేశారు.

కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కన్నప్ప సందడి

విష్ణు మంచు నటిస్తూ నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రాన్ని ఈనెల 20న కేన్స్‌లో జరగనున్న ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'ది వరల్డ్ ఆఫ్ కన్నప్ప'గా ఆవిష్కరించనున్నారు. 'ది వరల్డ్ ఆఫ్ కన్నప్ప' కేవలం సినిమా కాదు.. ఇది ఒక సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ కానుంది. కథను చెప్పే విధానాన్ని పునర్నిర్వచించబోతోంది. ఇక రెడ్ కార్పెట్ మీద ఈ సినిమా రాక కోసం అందరూ చూస్తుండగా.. ఇప్పటికే ఈ మూవీపై అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. విష్ణు మంచు తన టీంతో కలిసి తెలుగు చిత్రసీమలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి వేదికగా నిలిచేలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

"కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'కన్నప్ప' టీజర్‌ను ఆవిష్కరించడం మాకు చాలా ఆనందంగా ఉంది. ప్రపంచ ప్రేక్షకులకు మేం ఎంతో ఇష్టంగా రూపొందించిన కన్నప్పను ప్రదర్శించడానికి కేన్స్ అనువైన వేదికగా ఉపయోగపడుతుంది. మన భారతీయ చరిత్రను ప్రపంచ వేదికపైకి తీసుకురావడం, మన కథలు, సాంస్కృతిక వారసత్వం గురించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు తెలియజేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం' అని అని విష్ణు మంచు ట్వీట్ వేశారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అక్షయ్ కుమార్, మోహన్ బాబు, మోహన్ లాల్, శరత్‌కుమార్ వంటి హేమాహేమీలు ఇప్పటికే తమ పాత్రలకు సంబంధించి చిత్రీకరణను పూర్తి చేసుకున్నారు. తాజాగా హీరో ప్రభాస్ సెట్‌లోకి అడుగుపెట్టారు. ఈ చిత్రాన్ని మోహన్ బాబు భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శివుని భక్తుడైన భక్త కన్నప్ప అచంచలమైన భక్తిని, విశ్వాసాన్ని చూపించబోతున్నారు. హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ షెల్డన్ చౌ, యాక్షన్ డైరెక్టర్ కెచా ఖంపక్ ఈ చిత్రానికి పని చేయటం విశేషం.



నవచిత్రం

భారీ సెట్‌లో వీర ధీర శూరన్



విక్రమ్ హీరోగా హెచ్.ఆర్.పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వంలో రియా శిబు నిర్మిస్తున్న చిత్రం 'వీర ధీర శూరన్'. విక్రమ్ 62వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది.

రీసెంట్‌గా విడుదలైన టైటిల్, టీజర్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. తెన్ కాశీలో భారీ సెట్ వేసి సినిమాను పూర్తి చేస్తున్నారు మేకర్స్. ఇప్పటి వరకు చేయనటువంటి డిఫరెంట్ రోల్‌లో విక్రమ్ అలరించబోతున్నారు. ఆయన లుక్ మాస్, రగ్డ్‌గా ఉంది. సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి అంచనాలు పెరుగుతున్నాయి. సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా!. అని అభిమానులు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇందులో కాళి పాత్రలో విక్రమ్ అందరినీ మెప్పించడానికి రెడీ అవుతున్నారు. విక్రమ్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్రంలో సిద్ధికీతో పాటు ఎస్.జె.సూర్య, దుసరా విజయన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రానికి తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

హరోం హర రిలీజ్‌కి రెడీ


సుధీర్‌బాబు


హీరో సుధీర్ బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ 'హరోం హర' మేకర్స్ 'మురుగడి మాయ' అనే కొత్త పాటను విడుదల చేశారు. టైటిల్ సూచించినట్లుగా, ప్రపంచంలో జరిగే ప్రతిచర్యకు కారణమైన మురుగన్ శక్తిని ఈ పాట నిర్వచిస్తుంది. చైతన్ భరద్వాజ్ స్కోర్ చేసిన ఈ మెస్మరైజింగ్ నెంబర్ సుధీర్ బాబు, సునీల్ స్నేహాన్ని చూపుతుంది. రఘు కుంచె ఈ పాటను అద్భుతంగా పాడారు. భరద్వాజ పాత్రుడు కుప్పం యాసలో ఆకట్టుకునే లిరిక్స్ రాశారు. ఎస్ఎస్‌సి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు నిర్మిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు 'సెహరి' ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహిస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నేపథ్యంలో 1989లో జరిగిన ఈ పీరియాడికల్ ఫిల్మ్‌లో మాళవిక శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఈనెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఆటలు



చివరి మ్యాచ్‌లే కీలకం

- ప్లే-ఆఫ్‌కు కోల్‌కతా..
- పంజాబ్, ముంబయి ఔట్..
- ఐపీఎల్ సీజన్-17



నవతెలంగాణ-క్రీడా ప్రతినిధి

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-17 రసవత్తరంగా మారింది. ఈ టోర్నీలో ప్రతి జట్టుకు చివరి మ్యాచ్‌లు కీలకంగా మారాయి. 2సార్లు టైటిల్ విజేత కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్లే-బెర్త్‌ను ఖాయం చేసుకోగా.. పంజాబ్, ముంబయి జట్లు చివరి మ్యాచ్‌లతో సంబంధం లేకుండా ఎలిమినేట్ అయ్యాయి. రాజస్తాన్(16పాయింట్లు), చెన్నై(14), సన్‌రైజర్స్(14) టాప్-4లో ఉన్నా.. ప్లే-బెర్త్‌లను ఖాయం చేసుకోలేకపోయాయి. ఇక బెంగళూరు(12), ఢిల్లీ(12), లక్నో(12) ఆ తర్వాతి స్థానాలో ఉన్నా.. లక్నోకు ప్లే-ఆఫ్‌కు చేరే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎందుకంటే ఆ జట్టు బెంగళూరు, ఢిల్లీ జట్లకు 13మ్యాచ్‌లు పూర్తవ్వగా.. లక్నో జట్టు ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇక రాజస్తాన్, సన్‌రైజర్స్‌క కూడా రెండేసి మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా.. చెన్నై జట్టు చివరి మ్యాచ్‌లో గెలిస్తేనే ప్లే-బెర్త్‌ను ఖాయం చేసుకోనుంది. ఈ క్రమంలో చివరి మ్యాచ్‌లు ప్రతి జట్టుకూ కీలకంగా మారాయి.

ప్రస్తుతం 16 పాయింట్లతో ఉన్న రాజస్థాన్ రాయల్స్ ఈ జట్టు దాదాపు ప్లేఆఫ్స్ చేరినట్టే. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో(పంజాబ్, కోల్‌కతాతో) ఒక్క మ్యాచ్‌లో నెగ్గినా రాజస్థాన్ ప్లేఆఫ్స్‌కు సునాయాసంగా చేరుతుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో భారీ తేడాతో కాకుండా తక్కువ తేడాతో ఓడాలి. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇప్పటివరకు 12 మ్యాచ్‌లు ఆడి 14 పాయింట్లతో నాల్గో స్థానంలో ఉంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో (గుజరాత్, పంజాబ్)పై విజయం సాధిస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్లేఆఫ్స్ బెర్తును సొంతం చేసుకుంటుంది. మెరుగైన నెట్ రన్‌రేట్ ఉండటంతో ఒక్క మ్యాచ్‌లో విజయం సాధించినా హైదరాబాద్ నాకౌట్ చేరే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ క్రమంలో రాజస్థాన్, హైదరాబాద్ కచ్చితంగా ప్లే-ఆఫ్స్‌కు చేరడం ఖాయం.

బెంగళూరు, ఢిల్లీ, లక్నోలకు కీలకం..

ఢిల్లీ, బెంగళూరు జట్లు 13మ్యాచులు పూర్తయ్యేసరికి 12పాయింట్లతో 5, 6 స్థానాల్లో ఉన్నాయి. ఢిల్లీ జట్టు చివరి మ్యాచ్‌ను లక్నోతో, బెంగళూరు జట్టు తన చివరి లీగ్ మ్యాచ్‌ను చెన్నైతో ఆడాల్సి ఉంది. ఈ రెండు జట్లు చివరి మ్యాచుల్లో భారీ అంతరంతో మ్యాచ్‌లను ముగిస్తేనే ప్లే-ఆఫ్స్ ఛాన్స్ దక్కనుంది. ఇక లక్నో జట్టు 12మ్యాచ్‌లు ముగిసే 12పాయింట్లతో 7వ స్థానంలో ఉండగా.. ఆ జట్టు చివరి రెండు లీగ్ మ్యాచ్‌లను ఢిల్లీ, ముంబయితో తలపడనుంది. ఈ రెండు మ్యాచుల్లో గెలిస్తే దాని ఖాతాలోనూ 16పాయింట్లు జమ అవుతాయి. దీంతో ఆ జట్టు కూడా ప్లే-ఆఫ్స్‌కు చేరడానికి మంచి అవకాశం ఉంది. కానీ, నెట్ రన్‌రేట్ ప్రతికూల అంశంగా మారింది. -0.769 నెట్ రన్‌రేట్ ఉన్న లక్నో మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో భారీ తేడాతో నెగ్గితేనే నాకౌట్ దశకు చేరడానికి ఛాన్స్ ఉంటుంది.

బెంగళూరు ప్లేఆఫ్స్‌కు చేరాలంటే..

బెంగళూరు ప్లే-ఆఫ్స్‌కు చేరాలంటే సన్‌రైజర్స్ రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడాలి. దాంతోపాటు లక్నో మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఒక దాంట్లోనే విజయం సాధించాలి. వీటితోపాటు ముఖ్యంగా మే 18న చెన్నైతో జరిగే మ్యాచ్‌లోబెంగళూరు తప్పక విజయం సాధించాలి. బెంగళూరు చివరి లీగ్ మ్యాచ్‌లో చెన్నైపై 18 పరుగులు లేదా అంతకంటే ఎక్కువ పరుగుల తేడాతో గెలవాలి లేదా చెన్నై నిర్దేశించిన లక్ష్యాన్ని 18.1 ఓవర్లలోనే ఛేదించాల్సి ఉంటుంది.

చెన్నై గెలిస్తేనే..

చెన్నై జట్టు తన చివరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరుపై గెలిస్తే సమీకరణాలతో నిమిత్తం లేకుండా నేరుగా ప్లే-ఆఫ్స్‌కు చేరుతుంది. బెంగళూరుపై భారీ తేడాతో కాకుండా స్వల్ప తేడాతో ఓడి నెట్ రన్‌రేట్ పడిపోకుండా చూసుకోవాలి. దీంతోపాటు సన్‌రైజర్స్ మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో భారీ తేడాతో ఓడిపోయి 14 పాయింట్లతో ఉండాలి. అంతేకాదు మే 14న లక్నోను ఢిల్లీ ఓడించాలి. శుక్రవారం ముంబయి చేతిలో లక్నో ఓడాలి లేదా స్వల్ప తేడాతో నెగ్గాలి. ఈ క్రమంలో ప్లే-ఆఫ్స్‌కు చేరాలంటే ప్రతిజట్టుకు చివరి లీగ్ మ్యాచ్‌లు కీలకంగా మారాయి.

ఇక ముంబయి,పంజాబ్ జట్లు 8 పాయింట్లతో 9, 10 స్థానాలో ఉన్నాయి. ముంబయి జట్టు 17న లక్నోతో, పంజాబ్ జట్టు 15న రాజస్థాన్‌తో, 19న సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇప్పటికే ఎలిమినేట్ అయిన ముంబయి, పంజాబ్ జట్లు చివరి లీగ్ మ్యాచుల్లో గెలిచినా, ఓడినా ముందుకెళ్లవు.



Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886